ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శుద్ధ ఏకాదశి మ. 3.15 వరకు, అనంతరం ద్వాదశి; నక్షత్రం: పునర్వసు తె. 4.21 వరకు, పుష్యమి; అమృతకాలం: తె. 2.05 నుండి 3.35 వరకు; వర్జ్యం: సా. 5.10 నుండి 6.38 వరకు; దుర్ముహూర్తం: మ. 12.24 నుండి 1.12 వరకు, మ.2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: ఉ. 7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ. 10.30 నుండి 12.00 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి: 56 • సంచిక: 316 • సోమవారం 26 ఫిబ్రవరి 2018 • హైదరాబాద్ • పేజీలు: 12+12 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



దివికేగిన దేవత

- మేనల్లుడి పెళ్లికి దుబాయ్‌కి వెళ్లిన శ్రీదేవి
- గుండెపోటుతో హోటల్లోనే హఠాన్మరణం
- నేడు ప్రత్యేక విమానంలో ముంబైకి పార్థివదేహం
- జూహు శ్మశానవాటికలో అంత్యక్రియలకు ఏర్పాట్లు
- ఆరాధ్య దేవత కోసం అభిమానుల ఎదురుచూపు
- రాజకీయ, సినీ దిగ్గజాల సంతాపం

సినీ ప్రపంచంలో మరో ధృవ తార అస్తమించింది. అతిలోక సుందరిగా.. అందాల తారగా జనం మదిని దోచిన కథానాయిక అనంతలోకాలకు వెళ్లిపోయింది. అశేష ప్రేక్షకుల ఆరాధ్య దేవతగా వెలుగొందిన శ్రీదేవి ఇక సెలవు అంటూ నిష్క్రమించింది. తెలుగులో బడిపంతులు సినిమాలో బాలనటిగా తెరంగేట్రం చేసిన శ్రీదేవి..16 ఏళ్ల ప్రాయంలో ఎన్టీఆర్ సరసన వేటగాడు చిత్రంతో ప్రేక్షకుల మదిని దోచుకుంది. సర్దార్ పాపారాయుడు, గజదొంగ, కొండవీటి సింహం, జస్టిస్ చౌదరి, బొబ్బిలిపులి, అనురాగదేవత వంటి ఎన్నో హిట్ చిత్రాల్లో శ్రీదేవి నటించి మెప్పించింది. తెలుగు, తమిళం,మలయాళం,కన్నడం, హిందీ సినీ పరిశ్రమల్లో తన అసాధారణ ప్రతిభతో గుర్తింపు తెచ్చుకున్న శ్రీదేవి దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సినీ కళామతల్లి ఆశీస్సులతో ముందుకుసాగింది. ఇంగ్లీష్- వింగ్లీష్ సినిమాతో రీఎంట్రీ ఇచ్చిన శ్రీదేవి... చివరగా మామ్ సినిమాలో వినూత్న పాత్రతో ప్రేక్షకులను మురిపించింది.

3లో





టాలీవుడ్ దిగ్భ్రాంతి

- చలన చిత్ర రంగానికి తీరని లోటు: సినీ, రాజకీయ ప్రముఖుల నివాళి
- బహుముఖ ప్రజ్ఞాశాలి అంటూ శ్రద్ధాంజలి
- అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్న సహచర నటీనటులు
- నేటి తరానికి ఆమె ఓ రోల్ మోడల్: సీఎం కేసీఆర్
- ఆమె వినయానికి ముగ్ధుడనయ్యా: మంత్రి కేటీఆర్
- గొప్ప నటిని కోల్పోయాం: ఏపీ సీఎం చంద్రబాబు

వివరాలు లోపలి పేజీల్లో...



వివరాలు 11లో

పురుషోత్తంరెడ్డి ఇంట్లో మరోసారి ఏసీబీ సోదాలు 7

ప్రతి రైతూ ఓ కేసీఆర్

- అదే నా లక్ష్యం
- అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తాం
- లక్షా 61వేల మందితో రైతు సంక్షేమ దళం
- అధికారాలిస్తున్నాం.. ఆటంబాంబుల్లా పనిచేయండి
- ఎక్కడ నకిలీ విత్తనాలు నిల్వ చేసినా కొల్లగొట్టండి
- పథకాలను నిజమైన లబ్దిదారుల దరిచేర్చండి
- లక్ష్యం దిశగా పనిచేస్తే ఏటా లక్షా 25వేల కోట్ల సంపద సృష్టించవచ్చు
- అన్నదాతను పీడిస్తున్న చీడను ఏరిపారేద్దాం
- రైతు సమన్వయ సమితులకు ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రతి రైతు సమన్వయ సమితి సభ్యుడు ఓ కేసీఆర్‌గా అవతారమెత్తి లక్ష్య సాధనవైపు దూసుకు పోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు పిలుపునిచ్చారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. వ్యవసాయ రంగాన్ని అన్ని కోణాల్లో పునరుద్ధరించి సమాజంలో ప్రతి రైతు కుటుంబం తలెత్తుకు బతికేలా చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 61వేల మంది సమన్వయ సమితుల సభ్యులను నియమించడం జరిగిందన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అవినీతి అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం మీకు అన్ని అధికారాలను ఇస్తోందని తెలిపారు. మీరంతా రైతు సంక్షేమ దళంగా, ఆటంబాంబులా పనిచేయాలని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన

⇨ 2వ పేజీలో...



రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గుత్తా

తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షునిగా పార్లమెంట్ సభ్యుడు గుత్తా సుఖేందర్ రెడ్డిని నియమిస్తున్నట్లు ఆదివారం జరిగిన రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సదస్సులో సీఎం కేసీఆర్ ప్రకటించారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణాలో ప్రారంభమవుతున్న సమన్వయ సమితుల వ్యవస్థకు గుత్తా సారధ్యాన్ని సమర్థిస్తూ ఈ సదస్సులో ఏకగ్రీవ తీర్మానం చేశారు.



హైదరాబాద్: రైతు సమన్వయ సమితుల దక్షిణ తెలంగాణ ప్రాంతీయ సదస్సులో రైతులు బహూకరించిన నాగలి, ఎడ్లబండి నమూనాతో ముఖ్యమంత్రి కేసీఆర్

నేటినుంచి కాంగ్రెస్ ప్రజా బస్సుయాత్ర

- చేవెళ్ల నుంచి శ్రీకారం
- ప్రారంభ కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేతల రాక
- యాత్రకు ముందు దర్గా, ఆలయం, చర్చిల్లో పీసీసీచీఫ్ ఉత్తమ్ పూజలు, ప్రార్థనలు

2లో



గాంధీభవన్ ఆవరణలో నిలిపి ఉంచిన బస్సు యాత్ర వాహనాలు

ఔరా..!



ప్రతి రైతూ ఓ కేసీఆర్



రాజేందర్ నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సు.. ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

మండల రైతు సమన్వయ సమితుల దక్షిణ తెలంగాణ ప్రాంతీయ సదస్సులో ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. క్షేత్రస్థాయిలో రైతు సంఘటిత శక్తికి ప్రతిరూపమే ఈ సమితులని, ఐక్యంగా కదంతొక్కి వ్యవ సాయంలో స్వర్ణయుగానికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. యేళ్ళ తరబడి అన్నదాతలను పట్టి పీడిస్తున్న చీడను ఏరిపారేసేందుకు నడుం బిగించాలని, మీకు అండగా ప్రభుత్వం ఉంటుందని స్పష్టం చేశారు. కల్తీ విత్తనాలు, పురుగుమందులు, ఎరువులపై ఉక్కుపాదం మోపాలన్నారు.

ఏ కార్యం తలపెట్టినా పట్టువదలని విక్రమార్కుడిలా పనిచేసి ఫలితాలు సాధించడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సమన్వయ సమితుల్లోని ప్రతి సభ్యుడు ఓ కేసీఆర్‌గా అవతారమెత్తి కష్టనష్టాల్లో ఉన్న వ్యవసాయ రంగాన్ని గట్టెక్కించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఒక రైతుగా ప్రార్థిస్తున్నా... మీ సోదరుడిగా అర్థిస్తున్నా... అనేకసంవత్సరాలుగా మనోవేద నకు గురై రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఇకనుంచి తెలంగాణాలో ఉండకూడదని సీఎం ఉద్వేగభరితంగా అన్నారు. గతంలోని ప్రభుత్వాలు రైతే రాజు అన్నారు, దుర్భిక్ష పరిస్థితుల్లోకి నెట్టివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయం అనేది ఒక జీవనాధారం, దాన్ని పరిరక్షించుకుని బావితరాలకు లాభసాటిగా మార్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. గడిచిన మూడేళ్ళుగా ఈ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ వస్తున్న ప్రభుత్వం రైతు బిడ్డకు వ్యవసాయ మంత్రిగా బాధ్యతలు అప్పగించి ఫలితాల సాధనకు కృషి చేస్తోందన్నారు.

వ్యవసాయోత్పత్తుల నిల్వకు కేవలం 4లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఉన్న గిడ్డంగులను రికార్డు స్థాయిలో 24 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచామన్నారు. ముఖ్యమంత్రితో, వ్యవసాయ మంత్రితో లక్ష్యాలు సాధించడం సాధ్యమయ్యే పనికాదని, ఈ క్రమంలో సమన్వయ సమితి సభ్యులు కథానాయకులు కావాల్సిం దేనని తేల్చి చెప్పారు. ఎక్కడ నకిలీ విత్తనాలు కనిపించినా, నిల్వ చేసినట్లు సమాచారం తెలిసినా కొల్లగొట్టాలని సీఎం పిలుపు నిచ్చారు. ఇజ్రాయిల్ దేశంలో అవలంబిస్తున్న ఆధునిక సాగు విధానాలు తెలుసుకునేందుకు దశల వారీగా కొన్ని వేలమంది సభ్యులను అక్కడికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఫలితాల సాధనే ప్రామాణికంగా మండల సమితి సభ్యులకు కూడా అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన పెట్టుబడి మద్దతు పథకాన్ని విజయవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత మీపై ఉందని గుర్తుచేశారు. భూ రికార్డుల ప్రక్షాళనతో తేలిన లెక్కల ప్రకారం అసైన్డ్ భూములు కలుపుకుని కోటి 65లక్షల ఎకరాలకు ఈ పథకాన్ని అమలు చేయాలన్నారు.

ఈ సీజన్‌కు బేరర్ చెక్కులే...
వచ్చే సీజన్‌లో ప్రీపెయిడ్ కార్డులు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయబోతున్న పంట పెట్టుబడి రాయితీ పథకం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సీఎం కేసీఆర్ అభిప్రాయపడ్డారు. ప్రతియేటా రెండు పంటలకు కలిపి ఎకరాకు రూ.8వేల చొప్పున పంపిణీ చేస్తే దాదాపు రూ.12వేల కోట్లు ఖర్చవుతుందన్నారు. కానీ లక్ష్యం దిశగా పనిచేస్తే ఏటా కేవలం వ్యవసాయ రంగంలోనే లక్షా 25వేల కోట్ల రూపాయల సంపద సృష్టించవచ్చునని తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మకమైన పథకం గురించి తెలుసుకుని ప్రధాని లాంటి వారు సైతం ఆశ్చర్య పోయారని కేసీఆర్ వెల్లడించారు. ఈ ఏడాది వానాకాలంలో బేరర్ చెక్కుల ద్వారా



పెట్టుబడి మద్దతు పథకం మొత్తాన్ని పంపిణీ చేయాలని నిర్ణయించామని, యాసంగిలో ప్రీపెయిడ్ కార్డుల ద్వారా పంపిణీ చేస్తామని ప్రకటించారు. ఈ మొత్తానికి సంబంధించిన రూ.12వేల కోట్ల నిధులతో పాటు రైతు సమన్వయ సమితులకు మద్దతు ధరల స్థిరీకరణ నిధిగా సువూరు రూ.10వేల కోట్లు ఈ బడ్జెట్‌లోనే కేటాయిస్తామన్నారు. పెట్టుబడి మొత్తం అవసరంలేని పెద్ద రైతులు స్వచ్ఛందంగా వదులుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. ఆ మొత్తాన్ని తిరిగి ప్రభుత్వం తీసుకోకుండా రాష్ట్రరైతు సమితి మూల నిధికి జమచేస్తామన్నారు.

వచ్చే ఏడాది పంట కాలనీలు

వచ్చే ఏడాది నుంచి పంట కాలనీలను ఏర్పాటు చేసి పంటల సాగును ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ఈ ప్రక్రియ లోనూ సమన్వయ సమితులే కీలకపాత్ర పోషించాలన్నారు. ప్రతి ఐదువేల ఎకరాలకు ఒకటి చొప్పున రైతు వేదికలను నిర్మించి పంటల ఎంపిక, అధునాతన సాగు విధానాలపై శిక్షణా కార్య క్రమాలను కొనసాగించాలన్నారు. అందుకు అవసరమయ్యే భూములను సమీకరించుకోవాలన్నారు. విదేశాల్లో స్థిరపడిన వారిని, పెద్ద రైతులను సంప్రదించి భూములను విరాళంగా సేకరించే ప్రయత్నం చేయాలన్నారు. భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.12 లక్ష్యల చొప్పున మంజూరు చేస్తుందన్నారు. ఏ పంట ఎన్ని ఎకరాల్లో సాగైందన్న సమాచారం రాష్ట్ర రైతు సమన్వయ సమితికి తెలిస్తే కొనుగోళ్ళ ప్రక్రియలో సమస్యలు ఉండవని చెప్పారు. పంట కోత సమయాల్లోనే మండల సమితులు వ్యవసాయ మార్కెట్ కమిటీలతో మాట్లాడి క్రయవిక్రయాలపై ఒప్పందాలు కుదుర్చుకోవాలని కేసీఆర్ సూచించారు. మద్ధతు ధరలు అమలు సాధ్యం కాని పక్షంలో జిల్లా సమితుల ద్వారా రాష్ట్ర సమితికి సమాచారం అందిస్తే తక్షణమే కొనుగోలు చేసేందుకు యంత్రాంగం రంగంలోకి దిగుతుం దన్నారు.

రిజిస్ట్రేషన్ ఆలస్యమైతే
అధికారులపై రోజుకు రూ.1000 జరిమానా

తమసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతులకు ఒకరోజు లోనే పని పూర్తయ్యే విధంగా ఆదేశాలు ఇస్తామన్నారు. ఒకవేళ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే రోజుకు రూ.1000 చొప్పున వారికి జరిమానా విధిస్తామన్నారు. ఇందుకు సంబం ధించిన మార్గదర్శకాలను త్వరలోనే విడుదల చేస్తామ న్నారు. మరనించిన వారి వివరాలను వారం తిరగకుండా రెవెన్యూ కార్యా లయాల్లో సవరించు కోవాలని, ఆ దిశగా రైతుల్లో సమన్వయ సమితి సభ్యులు అవగాహన కల్పించాలని సూచించారు. ఎక్కడా ప్రభుత్వ యంత్రాంగం పైసా లంచం తీసుకోకుండా నిబద్ధతతో పని చేయాలని సీఎం స్పష్టం చేశారు. అలాంటివేవీ ఆశించకుండా ఉం డేందుకు ఉద్యోగులకు మెరుగైన జీతభత్యాలు చెల్లిస్తున్నా మన్నా రు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోని అధికారి టుబుల్‌పై వ్యవసా య సమాచారం కోసం ప్రత్యేక కంప్యూటర్‌ను ఏర్పాటు చేస్తా మన్నారు.

50శాతం సబ్సిడీతో యాంత్రీకరణకు ప్రత్యేక ప్రాధాన్యత

పంట పెట్టుబడి వ్యయాన్ని తగ్గించేందుకు వ్యవసాయ యాంత్రీకరణను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని సీఎం తెలిపారు. ప్రతి వ్యవసాయ క్లస్టర్ పరిధిలో అవసరమైన యంత్ర సామాగ్రిపై ప్రభుత్వానికి నివేదిక పంపించాలన్నారు. కూలీల కొరత సమస్యను తీర్చేందుకు ట్రాక్టర్లు, కల్టివేటర్లు, రోటోవేటర్లను 50శాతం సబ్సిడీపై అందిస్తామన్నారు. అలాగే ప్రతి మండలానికి 10 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 5వేల నాట్లేసే యంత్రాలను వచ్చే వ్యవసాయ సంవత్సరం నుంచి పంపిణీ చేస్తామన్నారు. అందులోనూ రైతు సమితులదే కీలక పాత్ర ఉంటుందని కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఒక ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను, వాటి నిల్వకు ఒక కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేస్తామన్నారు.

ఈ సదస్సులో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, మంత్రులు హరీష్‌రావు, జూపల్లి కృష్ణారావు, మహేందర్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, నాయిని , లక్ష్మారెడ్డి, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, ఎంపీలు కె.కేశవరావు, జితేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గుత్తా సుకేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారధితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు తదతరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాల్లోనే భూముల రిజిస్ట్రేషన్లు

రాష్ట్రంలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ ప్రక్రియ ముగిసిన వెంటనే భూముల రిజిస్ట్రేషన్లప్రక్రియను ప్రజలకు మరింతగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఇప్పుడున్న 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కొనసాగిస్తూనే ప్రతి మండల తహసీల్దార్ కార్యాలయంలో భూములు రిజిస్ట్రేషన్లు చేసుకునేలా వ్యవస్థను నెలకొల్పుతామన్నారు. మండల రెవెన్యూ అధికారుల బాధ్యతలను విస్తరించి ప్రజలకు మెరుగైన సేవలను అందుబాటులోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. క్రయ విక్రయాలు, భూముల బదిలీలు, సంతకాలు ఒకేరోజు పూర్తిచేసి, ఆ సమాచారాన్ని కేవలం అరగంటలోనే ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామన్నారు. పాస్‌పోర్టు మాదిరిగా కొత్త పాస్‌బుక్‌లు పోస్టు ద్వారా కొన్నవారికి, అమ్మిన వారికి అందించబడుతాయన్నారు.

సమితుల సందేహాలకు
సీఎం కేసీఆర్ నివృత్తి
వ్యవసాయం జీవన విధానమని సందేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దక్షిణ తెలంగాణ రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సదస్సులో సభ్యుల సందేహాలను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నివృత్తి చేశారు. ప్రభుత్వం చేసిన సూచనల మేరకు భోజన విరామ సమయంలో వారంతా పింక్ కలర్ పేపర్లపై సందేహాలు, గ్రీన్ కలర్ పేపర్లపై సూచనలు రాసి ప్రత్యకంగా ఏర్పాటు చేసిన బాక్సుల్లో వేశారు. వాటిని పరిశీలించిన అధికారులు వ్యవస్థను మెరుగుపరిచేందుకు దోహదపడే అంశాలను సీఎం దృష్టికి తీసుకు వెళ్ళారు. ఒక్కో సందేహాన్ని పేర్లతో సహా చదువుతూ కేసీఆర్ సమాధానాలు ఇచ్చారు. అడవి పందుల నివారణకు సోలార్ పెన్షన్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. వనాల్లో జంతువులు, పక్షులు తినే పండ్ల వృక్షాలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రైతు సమన్వయ సమితి సభ్యులు వ్యవసాయంతో, మార్కెటింగ్ చేయడంలో ఆదర్శంగా నిలిచిన అంకాపూర్ గ్రామాన్ని సందర్శించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయం వ్యాపారం కాదని, అది ప్రజల జీవన విధానమని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ సమితి సభ్యులందరికీ సందేశమిచ్చారు.

రైతు వేదికలకు భూముల విరాళం

సీఎం పిలుపు మేరకు కొంతమంది సమన్వయ సమితి సభ్యులు రైతు వేదికలను నిర్మించేందుకు భూములను విరాళంగా ఇచ్చారు. మక్తల్ నియోజక వర్గం యాంకి గ్రామానికి చెందిన రైతు వెంకట్‌రెడ్డి మొదటగా ఎకరం భూమిని విరాళంగా



ప్రకటించ డంతో ఆయన్ను సీఎం సన్మానించారు. కర్తాల గ్రామానికి చెందిన గూడూరి భాస్కర్‌రెడ్డి మరో ఎకరం స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఆలి యాకు చెందిన ఎం.లింగారెడ్డి రూ.12. 16 లక్షల మొత్తాన్ని రైతు వేదికల నిర్మా నానికి విరాళంగా అంద జేశారు. కొడంగల్ నియోజకవర్గం రావుపల్లి గ్రామానికి చెందిన చెన్న బస్వారెడ్డి ఎకరం భూమిని ఇస్తాయని సీఎంకు భరోసా ఇచ్చారు.

మాలోతు కృష్ణకు వోవర్‌సీస్ పథకం

సభ్యుల సందేహాలను నివృత్తి చేస్తున్న క్రమంలో జూర్యాపేట జిల్లాకు చేరెందిన సమన్వయ సమితి సభ్యుడు మాలోతు కృష్ణఒక్కసారిగా లేచి తన విజ్ఞప్తిని ఆలకించాలంటూ గట్టిగా అరిచాడు. తన కూతురు అమెరికాలో మెడిసిన్ చదువుతోందని, ఓవర్‌సీస్ పథకానికి దరఖాస్తు చేసుకుంటే తిసర్కరిం చారని ఏడుస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో వెంటనే స్పందించిన సీఎం కేసీఆర్ ఆయన్ను వేదిక వద్దకు పిలిపించుకున్నారు. మంత్రి జగదీష్‌రెడ్డికి చెప్పి తక్షణమే మంజూరు చేయాల్సిందిగా ఆదేశించారు.

వంటనూనెలతో
తస్మాత్ జాగ్రత్త

- మళ్లీమళ్లీ వాడితే అనారోగ్యం
- కేన్సర్, హృద్రోగాల ముప్పు



పోపు దగ్గర నుంచి మసాలా వేపుళ్ళ దాకా మనం తీసుకునే దైనందిన ఆహార పదార్థాల్లో వంటనూనె కీలక పాత్ర పోషిస్తుంది. మిగతావాటితో పాటుగా వంటనూనె సైతం ఖరీదైపోవడంతో ఒకసారి వాడిన దాన్ని మళ్ళీ మళ్ళీ వినియోగించడం భారతీయ పాకశాలల్లో సర్వసాధారణం. కానీ అలా వండుకున్న ఆహార పదార్థాలను తీసుకోవడం అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందని అనేక అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. అయితే ఒకసారి వాడిన దానిని ఎలాంటి అనారోగ్య సమస్యలకు కారణం కాకుండా మళ్ళీ మళ్ళీ వినియోగించుకోవడం అనేది అది ఏ రకమైన నూనె, దానిని ఎంత ఉష్ణోగ్రత వద్ద వేడి చేస్తున్నది, ఎంత కాలం వినియోగిస్తున్నది, తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది.

నూనెను వేడి చేసిన ప్రతిసారీ దానిలోని కొవ్వు అణువులు కొంతమేరకు విచ్ఛేదనం చెందుతుంటాయి. నూనెను వేడి చేస్తున్న ఉష్ణోగ్రతకు లోబడి ఈ విచ్ఛేదనం నుంచి పొగ పుట్టుకొస్తుంది. అది దుర్వాసనకు దారి తీస్తుంది. నూనెను ఎంత వెంట వెంటనే వాడుతున్నామో అంతే వేగంగా దుర్వాసన పెరిగిపోతుంటుంది. ఆ కారణంగా గాలిలోకి, వంట చేస్తున్న ఆహారంలోకి అనారోగ్యకరమైన పదార్థాలు చేరుకుంటాయి. అత్యధిక ఉష్ణోగ్రత వద్ద వేడి చూసిన నూనె విషవాయువులను విడుదల చేస్తుంది.

ఒక అధ్యయనం ప్రకారం ఆవ నూనె తక్కువ స్థాయిలో విషవాయువులను విడుదల చేస్తుంది. కొబ్బరి నూనె అత్యల్ప ఉష్ణోగ్రత వద్దసైతం విషవాయువులను వెలువరిస్తుంది. ఆలివ్ నూనె, పొద్దుతిరుగుడు పువ్వు నూనెపైన పేర్కొన్న రెండింటికి మధ్యస్తంగా విషవాయువులను విడుదల చేస్తాయి.

నూనె పొగను వెలువరిస్తున్నప్పుడు స్వేచ్ఛా మూలకాలు సైతం ఉత్పత్తి అవుతాయి. ఇవి మన దేహంలో కణాలను దెబ్బ తీసి కేన్సర్ వ్యాధికి కారణమవుతాయి. అవి నూనెలో తయారైన ఆహార పదార్థాల్లో కలసిపోయి వాటిని భుజించే వారికి కేన్సర్, తదితర వ్యాధులను కలిగిస్తాయి. అత్యధిక ఉష్ణోగ్రత వద్ద నూనెలో కొవ్వులు ఉపసర్గ కొవ్వులుగా రూపాంతరం చెందుతాయి. వీటి వలన హృద్రోగ వ్యాధులు వచ్చే ముప్పు అధికంగా ఉంటుంది. ఆలివ్, వేరుసెనగ నూనెలను మరోసారి వేడి చేసినప్పుడు ఉపసర్గ కొవ్వుల శాతం పెరుగుతుందని ఒక అధ్యయనంలో తేలింది.

నూనెను 190 డిగ్రీలు అంతకన్నా ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద వేడి చేసినప్పుడు హెచ్ఎన్ఇ అనే విష పదార్థం ఏర్పడుతుంది. దీని వలన అల్జీమర్స్, పార్కిన్‌సన్స్, ఎల్‌డిఎల్ (చెడు) కొలెస్ట్రాల్ పెరిగే ముప్పు అధికంగా ఉంటుంది. ఇదంతా చదివినప్పుడు తరచుగా వెలుపల మరీ ముఖ్యంగా రోడ్డు పక్కన బండ్ల వద్ద వేపుడు పదార్థాలు తినడం ఆరోగ్యానికి ఎంత ముప్పో మనకు తెలిసివస్తుంది.

వంట నూనెను ఎప్పుడు మార్చాలి?

వంట నూనె చిక్కగా నురగకట్టి రుచీపచీ లేకుండా దుర్వాసన వస్తున్నప్పుడు దానిని వదిలించుకోవడం మంచిది. అయినా సరే అలాంటి నూనెను వినియోగించుకోవాలని భావించిన పక్షంలో పొరపొరలుగా ఉన్న చీస్ క్లాత్‌లో దానిని వడగట్టాలి. అందులో ఏవైనా ఆహార పదార్థాలు తొలగిపోయిన తర్వాత గట్టి మూతను కలిగి కాంతి సోకని పాత్రలో నూనెను నిల్వ చేయాలి. వీలుంటే ఫ్రిజ్‌లో ఉంచాలి. నూనెను శీతలమైన, చీకటి ప్రాంతంలో ఉంచడం మరింత ఉత్తమం.

నూనెను ఇలా వాడాలి

నూనెలో ఆహార పదార్థాలను 190 డిగ్రీల కన్నా ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద వేయించవద్దు. థర్మామీటర్‌తో ఉష్ణోగ్రతను కొలవాలి. నూనెలో ఆహార పదార్థాలు మిగిలిపోని విధంగా వేయించాల్సిన ఆహారాన్ని సిద్ధం చేసుకోవాలి. ఆహార పదార్థాలను నూనెలో వేయించడానికి స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు లేదా పాన్‌లు వినియోగించాలి. నూనెను త్వరగా పాడు చేసే ఇనుము లేదా రాగి పాత్రలను వాడకూడదు. చివరగా వంట పూర్తి కాగానే వేడిని దూరం చేయాలి. ఎంత ఎక్కువ సేపు నూనె వేడి చేస్తే అంత త్వరగా అది పాడైపోతుంది. నూనె చూడటానికి బాగున్న పక్షంలో దానిని మూడు నెలల తర్వాత కూడా వాడవచ్చని నిపుణులు చెబుతున్నారు.

వంట నూనె వదిలించుకునేదెలా?

వంట నూనెను నేరుగా సింకులో పారబోయవద్దు. అది వాటర్ పైపుల్లో చల్లబడి పేరుకుపోతుంది. దాని వలన సింకు లేదా సెప్టిక్ ట్యాంక్ పనితీరు దెబ్బతింటుంది. పాత్రల్లో నూనెను సబ్బు, వేడి నీటితో కడగడం వల్ల ప్రయోజనం ఉండదు. అలా చేయడం వల్ల పైపుల్లో అడ్డంకులు ఏర్పడుతాయి. బదులుగా నూనెను పాతబడిన కాఫీ క్యాన్ లేదా పాల జగ్గులో పోయాలి. గట్టిగా మూతపెట్టాలి.ఆ తర్వాత దానిని చెత్త కుండీలో పడేయ్యాలి. కొన్ని చోట్ల వాడిన వంటనూనెను రీసైకిల్ కూడా చేస్తారు.

మార్చి 1న హోలీ సెలవు

ఆంధ్రప్రభ, హైదరాబాద్: మార్చి 1న హోలీ పండగ సెలవుగా ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం హోళీ పండగను మార్చి 2వ తేదీగా పేర్కొంది. అయితే హోళీ దహనం నేపథ్యంలో దేవాదాయ శాఖ మార్చి 1కి హోళీ పండుగగా నిర్ధేశించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మార్చి 1నే ప్రభుత్వ సెలవుగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



వైభవంగా యాదాద్రీశుని రథోత్సవం

యాదగిరికొండ, ప్రభ న్యూస్ : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కల్యాణమూర్తులైన శ్రీ లక్ష్మీనృసింహులను బాలాలయంలో రథాంగ హోమం నిర్వహించి బాలరథం పై ఊరేగించారు. యాదాద్రి క్షేత్రంలో ఆలయ పునర్నిర్మాణ అభివృద్ధి పనులు జరుగుతున్న దృష్ట్యా ఉదయం బాలాలయంలో శాస్త్రోక్తంగా రథోత్సవాన్ని నిర్వహించి రాత్రి భక్తుల సౌకర్యార్థం శ్రీ స్వామి వారి ప్రచార రథాన్ని కొండ కింద పురవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీస్వామి, అమ్మవార్లను దర్శించుకుని ఆనందపరవశులయ్యారు. అనంతరం కల్యాణమూర్తులైన శ్రీ స్వామి, అమ్మవార్లను ఆచార్యులు కొండ పై బాలాలయానికి ప్రవేశింపజేశారు.



గాంధీభవన్‌లో దామోదరరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్న నేతలకు కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి



కాంగ్రెస్ ప్రజాచైతన్య బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన మల్లు రవి

నేటి నుంచే కాంగ్రెస్ ప్రజాచైతన్య బస్సు యాత్ర

- దర్గా, మందిరం, మసీద్‌లలో ఉత్తమ్ పూజలు
- మొదటి రోజు చేవెళ్ల, వికారాబాద్‌లలో భారీ బహిరంగ సభలు
- సభల విజయవంతానికి కాంగ్రెస్ నేతల ప్రత్యేక దృష్టి

హైదరాబాద్,ఆంధ్రప్రభ : టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేపట్టే ప్రజా చైతన్య బస్సుయాత్ర సోమవారం నుంచి ప్రారంభం అవుతుంది. బస్సుయాత్ర విజయ వంతానికి కాంగ్రెస్ ముఖ్యనేతలు తీవ్ర కసరత్తునే చేస్తు న్నారు. ఇప్పటికే ప్రజా చైతన్యయాత్రకు సంబందించి నాలుగు కమిటిలను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటింటిచిన విషయం తెలిసిందే. కాగా కాంగ్రెస్ పార్టీకి సెంటిమెంట్‌గా భావించే రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నుంచి ఈ యాత్ర మొదలు పెడుతున్నారు. మాజీ హోం శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ఈ సభ విజయవంతానికి అన్ని తానై ప్రత్యేక దృష్టిని సారిం చారు. కాగా భారీ బహిరంగ సభకు ముందుగానే హైదరాబాద్‌లోని నాంపల్లిలో దర్గాలో ఉదయం 10 గంటలకు టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌తో పాటు పార్టీ ముఖ్యనేతలు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత 11 గంటలకు ఆరేమైసమ్మ ఆలయంలోని ఆమ్మవారిని దర్శించుకుని, మధ్యాహ్నం 12 గంటలకు మొయినాబాద్ చర్చిలో ప్రార్థనలు చేయనున్నారు. చేవెళ్లలో సభ అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు వికారాబాద్‌లో మరో సభను ఏర్పాటు నిర్వహించనున్నారు. రాతి వికరాబాద్‌లోని బస చేసి మరుసటి రోజు తాండూర్‌లో మధ్యాహ్నం 1 గంటకు సభ జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 4 గంటలకు సంగారెడ్డి లో ప్రజా చైతన్య సభకు ఉత్తమ్ హాజరవుతారు. 27 రాత్రి సంగారెడ్డిలోనే ఉత్తమ్ బస చేసి 28న మధ్యాహ్నం జహీరాబాద్, సాయంత్రం నారాయణ ఖేడ్‌లో జరిగే బహిరంగ సభలలో ఉత్తమ్ హాజరవుతారు. కాగా ఈ మూడు రోజుల బస్సుయాత్రలో భాగంగా పూర్వపు రంగారెడ్డి, మెదక్ జిల్లాలలో మొత్తం ఆరు నియోజక వర్గాల్లో జరిగే సభలు, సమావేశాల్లో ఉత్తమ్ మాట్లాడుతారు.



ఈ బస్సుయాత్ర ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావడమే లక్ష్యంగా యాత్ర కొనసాగుతుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. నాలుగేళ్లలో ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించే ప్రయత్నం చేయనున్నారు. విస్మరించిన హామీలు ప్రధానంగా ప్రస్తావించాలని నిర్ణయం తీసుకున్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలపై నిర్లక్ష్యంతో పాటు నిరుద్యోగ సమస్యలతో పాటు రైతుల ఆత్మహత్యలను ప్రత్యేక ప్రస్తావించనున్నారు.

రెండు ప్రచార రథాలు.. పాటల సీడీని ఆవిష్కరణ ..

ఉత్తమ్ చేపట్టే ప్రజా చైతన్య యాత్రకు ఓల్వో బస్సును ప్రత్యేకంగా తయారు చేయించిన విషయం తెలిసిందే. బస్సుయాత్రను మరో రెండు ప్రచార రథాలు అనుసరనిస్తాయి. ముందుగానే గ్రామాల్లోకి వెళ్లి ప్రజలను చైతన్యం చేయడం కోసం ఈ రథాలు పని చేస్తాయి. టీ పీసీసీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షుడు ఏపూరి సోమన్న నేతృత్వంలో కళాకారులు పాటల పాడేందుకు ఏర్పాట్లు చేశారు. పాటల సీడీని టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం గాంధీభవన్‌లో ఆవిష్కరించారు.

యాత్ర విజయవంతానికి వాల్ పోస్టర్లు ఆవిష్కరణ..

ప్రజాచైతన్య యాత్ర విజయవంతం చేయాలని ఆదివారం గాంధీభవన్‌లో నిరుద్యోగ జేఏసీ, గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లు రవి, టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్, బండి సుధాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

హై కమాండ్ పెద్దలు దూరం..

ఉత్తమ్ చేపట్టే యాత్ర ప్రారంభ సభలకు పార్టీ హై కమాండ్ పెద్దలు హాజరుకావడం లేదు. కేంద్ర మాజీ మంత్రి చిదంబరం, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యలు హాజరవుతారని ముందుగా ప్రచారం జరిగినప్పటికి వారు రావడం లేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ రామచంద్ర కుంతియాతో పాటు రాష్ట్ర ముఖ్యనేతలు హాజరవుతారని తెలిసింది.

కాంగ్రెస్‌తోనే మహిళాభివృద్ధి ! నేరెళ్ల శారద

మహిళల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, అందుకు నిదర్శనం సీఎం కేసీఆర్ మంత్రివర్గంలో ఒక్క మహిళకు కూడా స్థానం లేకపోవడమే నిదర్శనమని చెప్పారు. ఆది వారం యూసుఫ్ గూడలో జరిగిన నగర మహిళా కాంగ్రెస్ సమావేశంలో నేరెళ్ల శారద మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే మహిళల సాధికారత సాధ్యమని భావించి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో మహిళలు కాంగ్రెస్‌లో చేరుతు న్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో సభ్యత్వం ఉన్న మహిళలు లక్షల్లోనే ఉన్నారని, బహుశా ఇతర పార్టీల సభ్యులందరు కలిపి కూడా అంత సంఖ్యలో ఉండరని తెలిపారు.ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో ముస్లిం మహిళలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి నేరెళ్ల శారద కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆత్మీయ సమ్మేళనంలో
గందరగోళం
వీహెచ్, యూత్ కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం



ఎన్ఎస్‌యూఐల సమావేశంలో ప్రసంగిస్తున్న ఉత్తమ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ : కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాలైన యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ పూర్వపు అధ్యక్షుల ఆత్మీయ సమ్మేళనంలో గందరగోళం నెలకొంది. ఉత్తమ్ చేపట్టే ప్రచా చైతన్య యాత్ర విజయవంతానికై ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత, ఏఐసీసీ కార్యదర్శి వీహెచ్‌కు ప్రస్తుత యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకుల మధ్య కొద్దిపేసు వాగ్వాదం చోటు చేసుకున్నది. గాంధీభవన్ ఆవరణలోని ఇందిరా భవన్‌లో ఆదివారం గతంలో యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కమిటిల్లో కీలక పదవుల్లో పని చేసిన సీనియర్లతో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ కుమార్‌యాదవ్ ఆత్మీయ సమ్మేళనం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఎంపీ హనుమంతరావుతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో నిరుద్యోగ సమస్యపై యూత్ కాంగ్రెస్ చేపట్టిన రథయాత్రతో పాటు ఉత్తమ్ చేపట్టే ప్రజా చైతన్య యాత్ర విజయవంతానికి తీసుకునే చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ ఇటీవల చేపట్టిన రథయాత్రకు సంబంధించిన ప్లెక్సీల్లో సీనియర్లను పోటోలు లేవని వివరించబోగా.. యూత్ కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారు. పార్టీ బలోపేతానికి తీసుకునే అంశాలపై చర్చించకుండా ఫోటోలు అంశం ఎందుకని వారించారు. దీంతో వీహెచ్ ఆగ్రహం వ్యక్తం చేయబోగా.. నాలుగుసార్లు పార్టీ టికెట్ ఇచ్చినా విజయం సాధించలేదని గుర్తుంచుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకొడరూ వీహెచ్‌ను ఉద్దేశించి ఘాటుగా వ్యాఖ్యానించారు. టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి జోక్యం చేసుకుని ఇరువురిని వారించి సమావేశం సజావుగా సాగే విధంగా చర్యలు తీసుకున్నారు.

ఈ ఏడాది చివరిలోనే ఎన్నికలు
అధికారంలోకి రాగానే రూ. 2లక్షల రైతు రుణమాఫీ : ఉత్తమ్

ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 119 నియోజక వర్గాల్లో చేపట్టే ప్రజా చైతన్య బస్సుయాత్ర విజయవంతానికి యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నేతలు కీలకంగా పాత్ర పోషించాలని కోరారు. రాష్ట్రంలో కుటుంబ పాలనను పారదోలడానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఐకమత్యంగా ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ అని ఆయన జోష్యం చెప్పారు. ఈ ఏడాది చివరిలోనే ఎన్నికలు వచ్చే అవకాశం ఉందన్నారు. బూత్ కమిటిలను పూర్తి చేయాలన్నారు. ఎంత పెద్ద లీడరైనా ఓటింగ్ శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీ, నిరుద్యోగ యువతకు రూ. 3 వేలు భృతి ఇస్తామని ఉత్తమ్ పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీకి అనుబంధ సంఘాలే పట్టుకొమ్మలని వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క అన్నారు.



భువిని వీడి దివికేగిన దేవకన్య



తీవ్ర విషాదంలో చిత్రసీమ • సామాజిక మాధ్యమాల్లో అభిమానుల సంతాప సందేశాలు • దిగ్భ్రాంతిలో యావద్భారతం
• శ్రీదేవి లాంటి నటి లేరు.. ఇక రారు అంటూ వ్యాఖ్యానాలు
• మరణ వార్త విని షాకయ్యా: మెగాస్టార్ చిరంజీవి
• అంత్యక్రియలకు వెళ్లను: వర్మ



ముంబయ్: ఓ ధృవతార రాలిపోయింది. అందానికి అందం, అభినయానికే అభినయం అన్నట్లు సినీరంగంలో అతిలోకసుందరిగా వెలుగొందిన ఆ తార తిరిగిరాని అనంతలోకాలకు తరలిపోయింది. కొన్నేళ్ల పాటు తెలుగు, తమిళ,మలయాళ, హిందీ చిత్రసీమలను ఏలిన నట విదుషీమణి శ్రీదేవి (54) గుండెపోటుతో హఠాన్మరణం చెందారన్న వార్త ప్రతీఒక్కరినీ కదిలించివేస్తోంది, కన్నీరుమున్నీరుగా విలపింపజేస్తోంది. మేనల్లుడి వివాహం కోసం కుటుంబ సభ్యులతో కలిసి దుబాయ్‌కి వెళ్లిన శ్రీదేవి శనివారం అర్ధరాత్రి అస్వస్థతకు గురయ్యారు. హోటల్ గదిలో స్పృహ కోల్పోయి కనిపించినట్లు, ఆ వెంటనే దుబాయ్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె కన్నుమూసినట్లు వైద్యులు చెప్పారని ఆమె బంధువు సంజయ్‌కపూర్ తెలిపారు.

రషీద్ ఆస్పత్రిలోనే పోస్టుమార్టం

దుబాయ్ లోని రషీద్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు.. ఆమెకు వివిధ పరీక్షలు చేశారు. అన్ని టెస్ట్ లకుసంబంధించిన రిపోర్టులు అందిన తర్వాత శ్రీదేవి భౌతికకాయాన్ని భారత్‌కు ప్రత్యేక విమానంలో తరలించనున్నారు.మేనల్లుడు మోహిత్ వివాహం కోసం దుబాయ్ లోనిజుమైరా ఎమ్మిరేట్స్ టవర్స్ హోటల్ లో బస చేసిన శ్రీదేవి..శనివారంఅర్ధరాత్రి బాత్రూమ్ లో కళ్లు తిరిగిపడిపోయారు. వెంటనే గమనించిన కుటుంబీకులు,బంధువులు ఆమెను దగ్గర్లోని రషీద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆమె మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. గుండెపోటు రావడంతోనే శ్రీదేవి మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆదివారం సాయంత్రానికి శ్రీదేవి మృదేహాన్ని భారత్ తరలించాలని ఎంబసి అనుకున్నప్పటికీ...స్టార్ డమ్ కారణంగా అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన తర్వాతే భౌతికకాయాన్ని తరలించాలని వైద్యులు తెలిపారు.

దివ్యభారతి..శ్రీదేవి అక్కా చెల్లెళ్లా అనేవారు

శ్రీదేవి హఠాత్మరణతో ఒకప్పటి ప్రముఖ నటి దివ్యభారతిని అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు. రూపరేఖల్లో శ్రీదేవితో దగ్గరిపోలికలు కలిగిన దివ్యభారతి 19 ఏళ్ల వయస్సులోనే అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆమె మరణం నేటికీ మిస్టరీనే. అయితే 1990 దశకంలో శ్రీదేవి వెండితెరపై వెలిగిపోతున్న సమయంలోనే దివ్యభారతి చిత్రసీమలో అడుగుపెట్టింది. అప్పట్లో అంతా దివ్యభారతి, శ్రీదేవి అక్కాచెల్లెల్లూ అని అనుకునేవారు.

శ్రీదేవికి ఎలాంటి హృద్రోగ సమస్యలు లేవు

శ్రీదేవికి ఎలాంటి హృద్రోగ సమస్యలు లేవని, గుండెపోటుతో చనిపోయిందంటే నమ్మలేకపోతున్నామని సంజయ్‌కపూర్ తెలిపారు. ఆమె మరణవార్త విని వెంటనే దుబాయ్‌కు బయలుదేరినట్లు ఆయన వివరించారు. ఫోరెనిక్స్ నివేదిక కోసం వేచిచూస్తున్నామని, ఆమె కుటుంబంతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని దుబాయ్‌లోని భారత రాయబారి నవదీప్‌సింగ్ పేర్కొన్నారు. ముంబాయి నుంచి ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరిన ప్రత్యేక విమానం తిరిగి రాత్రి 8 గంటలకు ముంబాయి చేరుకోవచ్చునని సమాచారం.

ప్రముఖుల సంతాపం

శ్రీదేవి మృతి పట్ల రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, బీజేపీ అగ్రనేత ఎల్ కే అద్వానీ,కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం కేసీఆర్,ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సహా వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇతర రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. శ్రీదేవి లేని లోటు పూడ్చలేనిదని స్మరించుకున్నారు. తన అసమాన ప్రతిభతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసిన శ్రీదేవి మరణం తీరనిలోటని అన్నారు.శ్రీదేవి మరణవార్త తెలుగు చిత్రసీమతో పాటు భారతీయ సినీరంగాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు, పెద్ద ఎత్తున ప్రేక్షకులు ఆమె మృతిని జీర్ణించుకోలేకపోతున్నారు. తెలుగు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ సంతాపం వ్యక్తంచేసింది.



నేడు అంత్యక్రియలు

లెజెండరీ స్టార్ శ్రీదేవి అంత్యక్రియలు నేడుముంబైలోని జుహు శ్మశాన వాటికలో జరగనున్నాయి. ప్రత్యేక జెట్ విమానంలో శ్రీదేవి భౌతికకాయాన్ని ముంబాయ్ తీసుకురానున్నారు. ఇప్పటికే ప్రముఖవ్యాపార వేత్త అనిల్ అంబానీ శ్రీదేవీ భౌతికకాయాన్ని తరలించేందుకు ప్రైవేట్ జెట్ విమానాన్ని దుబాయి పంపారు. భారత రాయబార కార్యాలయ అధికారులు కూడా ఎప్పటికప్పుడు అప్ డేట్స్ అందిస్తున్నారు. దుబాయ్ పోలీసులకు అవసరమైన పూర్తిసమాచారాన్ని అందిస్తూ.. సాధ్యమైనంత త్వరగా శ్రీదేవి భౌతికకాయాన్ని భారత్ తరలించేందుకు ఏర్పాట్లుచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఫార్మాలిటీలన్నింటినీ పూర్తిచేసి..శ్రీదేవి కుటుంబ సభ్యులకు కూడా అవసరమైన సహాయసహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు యూఏఈ భారత రాయభారి నవ్‌దీప్ సింగ్ సూరి స్పందిస్తూ.. శ్రీదేవి కుటుంబానికి దుబాయిలో అవసరమైన సహాయసహకారాలు అందించేందుకు రాయబార కార్యాలయ అధికారులు కృషి చేస్తున్నట్లు ట్వీట్ చేశారు.



తల్లడిల్లిన జాన్వి

శ్రీదేవి హఠాత్మరణంతో ఆమె పెద్ద కుమార్తె జాన్వి తల్లడిల్లిపోయింది. పెళ్లి వేడుక కోసం దుబాయ్‌కి కుటుంబ సభ్యులంతా వెళ్లగా జాన్వీ మాత్రం దఢక్ సినిమా షూటింగ్ కోసం ముంబై లోనే ఉండిపోయింది. తల్లి మరణవార్త వినగానే జాన్వీ ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో దర్శక, నిర్మాత కరణ్ జోహర్ ఆమెకు ధైర్యం చెప్పారు. కన్నీటి పర్యంతమౌతున్న జాన్విని జుహూలోని అనిల్ కపూర్ ఇంటికి తీసుకెళ్లారు.

బోనీకపూర్ ఇద్దరు భార్యల మృతి వెనుక మిస్టరీ ఇదే..



అతిలోకసుందరి శ్రీదేవి మరణంతో యావత్ చిత్ర పరిశ్రమలో విషాదఛాయలు అలుముకున్నాయి. చిత్ర పరిశ్రమ అనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా శ్రీదేవి మరణం అందరినీ షాక్‌కి గురిచేసింది. అయితే శ్రీదేవి మరణం తర్వాత ఓ విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. బోనీకపూర్ తన ఇద్దరు భార్యల మరణం విషయంలో ఒకేలాంటి సంఘటనలు చోటుచేసుకోవడం విశేషం. మొదటి భార్య మోనా కపూర్ తన కుమారుడు అర్జున్ కపూర్.. బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న సమయంలోనే మరణించారు. కొడుకు నటుడిగా ఎంట్రీ ఇచ్చిన సినిమా ఇంకా రెండు నెలల్లో విడుదల అవుతుందనగా ఆమె కేన్సర్ వ్యాధితో స్వర్గస్తులైయ్యారు. సేమ్ టు సేమ్ ఇప్పుడు లెజండరీ నటి శ్రీదేవి కూడా తన కుమార్తె జాన్వీ కపూర్ హీరోయిన్‌గా పరిచయం అవుతున్న చిత్రం విడుదల కాకుండానే, హార్ట్‌ఎటాక్‌తో మరణించడంతో.. వారసుల ఎంట్రీకి, బోనీకపూర్ భార్యల మరణానికి లింక్ పెడుతూ.. అసలు మిస్టరీ ఇదేనంటూ సోషల్ మీడియాలో వార్తలు ట్రెండ్ అవుతున్నాయి.


శ్రీదేవి అంతిమ క్షణాల్లో ఆమె పక్కనే

శ్రీదేవి అంతిమ క్షణాల్లో... భర్త బోనీకపూర్‌తో పాటు చిన్న కుమార్తె ఖుషీ ఆమె పక్కనే ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం పెళ్లి వేడుకలు పూర్తైన తర్వాత కుమార్తెతో పాటు బోనీకపూర్ ముంబై తిరిగి రావాల్సి ఉంది. శ్రీదేవి తన సోదరి శ్రీలతతో పాటు కొద్దిరోజులు దుబాయ్‌లో ఉండాలని అనుకున్నారు. బోనీకపూర్ ముంబై వెళ్లిపోయివుంటే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించడానికే భయం వేస్తోందని సన్నిహితులు చెప్తున్నారు. శ్రీదేవి పెద్ద కుమార్తె జాహ్నవి కపూర్... సినిమా షూటింగ్ కారణంగా దుబాయ్‌కు వెళ్లలేదు. దడక్ సినిమాలో బిజీగా ఉండడంతో జాహ్నవి తల్లితో పాటు వెళ్లలేకపోయింది. తల్లి మరణవార్త తెలిసిన వెంటనే... అంధేరీలోని తన నివాసానికి చేరుకుంది జాహ్నవి. ఒంటరిగా ఉన్న ఆమెను బంధువులు, సన్నిహితులు ఓదారుస్తున్నారు.

శ్రీదేవి కోసం ముంబయ్‌లో అభిమానుల ఎదురుచూపు



శ్రీదేవి మృతితో ఒక్కసారిగా షాక్‌కు గురైన అభిమానులు ముంబయ్‌లోని ఆమె నివాసానికి పెద్దఎత్తున చేరుకుంటున్నారు. అభిమాన తారను కడసారి చూసేందుకు భారీగా తరలివస్తున్నారు. మరోవైపు శ్రీదేవి నివాసం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రత పెంచారు.అనిల్ కపూర్ ఇంటికి సినీ ప్రముఖులు తరలివస్తున్నారు.



శ్రీదేవి మృతికి సంతాప సూచికంగా పూరీ సముద్ర తీరప్రాంతంలో ప్రముఖ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన సైకతశిల్పం

కాంగ్రెస్ ట్వీట్‌పై నెటిజనులు గుస్సా

శ్రీదేవి మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ చేసిన ట్వీట్‌పై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీదేవి మృతిపట్ల సంతాపం వ్యక్తం చేస్తూ పార్టీ అధికారిక ట్వీట్‌లో యూపీఏ హయాంలోనే శ్రీదేవికి పద్మశ్రీ పురస్కారం లభించిందని పేర్కొంది. ఈ ట్వీట్ పట్ల నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆమె వినయానికి ముగ్ధుడినయ్యా...

శ్రీదేవితో మంత్రి కేటీఆర్ పాత స్మృతులు

అందాలతార.. ప్రముఖ నటి శ్రీదేవితో తాను కలిసిన సందర్భాన్ని ట్విట్టర్ ద్వారా రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖా మంత్రి కెటిఆర్ గుర్తుచేసుకున్నారు. శ్రీదేవి హఠాన్మరణం తనను షాక్‌కు గురిచేసిందని ఆదివారం చేసిన ట్వీట్‌లో ఆయన పేర్కొన్నారు. రెండేళ్ళక్రితం హైదరాబాద్‌లో టెక్ స్టార్టప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ఆమె వినయానికి, మానవత్వానికి ముగ్ధుడినయ్యానన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమెతో కలిసి ఉన్న ఫోటోను ట్వీట్ చేశారు. ఆమె మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతిని ప్రకటించారు.

అతిలోక సుందరి.. తరాలు మారినా చెదరని సౌందర్యం

కాలం మారింది.. తరాలు మారాయి.. కానీ.. రోజులెన్ని మారినా ఏళ్లు ఎన్ని గడిచినా మనం మరిచిపోలేని మనుషులు కొందరుంటారు. అలాంటి వారే అతిలోక సుందరి శ్రీదేవి.. చిరకాలం గుర్తుండిపోయే అందాల నటి శ్రీదేవి ఇక లేరు. అతిలోక సుందరి అస్తమయమైంది. భువి నుంచి దివికెగిసింది. లెజండరీ నటి అతిలోక సుందరి శ్రీదేవి చనిపోయారు. దుబాయ్‌లో నటుడు మోహిత్ మార్వా వివాహానికి భర్త బోనీకపూర్, చిన్న కూతురు ఖుషితో కలిసి దుబాయ్ వెళ్లిన శ్రీదేవి హార్ట్ ఎటాక్‌తో మృతి చెందారు. 1963 ఆగస్టు 13న తమిళనాడులోని శివకాశిలో జన్మించారు శ్రీదేవి. బాలనటిగా 1967లో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. తెలుగు, తమిళ, కన్నడ, మళయాళం, హిందీ సినిమాల్లో నటించారు.శ్రీదేవి అసలు పేరు శ్రీ అమ్మ యాంగేరి అయ్యపాన్. 1975లోని తన చిన్నతనంలో తునాయివన్ సినిమాతో సినీ రంగంలోకి ప్రవేశించిన శ్రీదేవి, భారతదేశంలోని గొప్ప నటీమణుల్లో ఒకరిగా ఎదిగారు. తెలుగులో మా నాన్న నిర్దోషి మూవీతో ఎంట్రీ ఇచ్చిన అతిలోక సుందరి.. అగ్రహీరోలందరితోనూ నటించారు. కె.బాలచందర్ దర్శకత్వం వహించిన మూండ్రు ముడిచు చిత్రం ద్వారా పేరు తెచ్చుకున్నారు. తెలుగులో పదహారేళ్ల వయసు, హిందీలో సోల్వాసావన్ చిత్రాలు కథానాయికగా ఆమెకు తొలి సినిమాలు. దక్షిణాది భాషల సినిమాలతో పాటు బాలీవుడ్‌లోనూ తన హవా కొనసాగించిన ఆమె ఎన్టీఆర్, ఎఎన్నార్, అమితాబ్, కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు, చిరంజీవి, రజనీకాంత్, కమల్‌హాసన్ వంటి మేటి స్టార్ హీరోలందరి సరసన నటించారు. కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో దాదాపు 24 చిత్రాల్లో ఆమె నటించారు. అన్ని భాషలలో కలుపుకుని కెరీర్ మొత్తంమీద 240 చిత్రాలలో ఆమె నటించారు. తెలుగులో 85, హిందీలో 71, తమిళంలో 72 మళయాళంలో 26, కన్నడంలో 6 చిత్రాల్లో నటించారు శ్రీదేవి.బాలీవుడ్ నిర్మాత బోనీ కపూర్‌ను 1996లో పెళ్లి చేసుకుంది శ్రీదేవి. వీరికి జాన్వీ, ఖుషీ ఇద్దరు కుమార్తెలున్నారు. ఇప్పటి వరకూ 15 ఫిల్మ్ ఫేర్ అవార్డుల అందుకున్న శ్రీదేవిని 2013లో భారత సర్కార్ పద్మశ్రీ అవార్డుతో గౌరవించింది. అంతే కాదు ఇంటర్నేషనల్ బెస్ట్ యాక్టర్ అవార్డును కూడా సొంతం చేసుకుంది. అయితే జుదాయి మూవీ తర్వాతా వెండితెరకు దూరమైన శ్రీదేవి.. మళ్లీ 14 ఏళ్ల గ్యాప్ తర్వాత ఇంగ్లీష్-వింగ్లీష్ మూవీతో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించారు. చివరిగా ఆమె 2017లో మామ్‌లో నటించారు. శ్రీదేవి మృతిపై బాలీవుడ్‌తో పాటు కోలీవుడ్, టాలీవుడ్ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాయి.తెలుగులో మూడు తరాల హీరోలతో నటించిన ఘనత శ్రీదేవి సొంతం. ఫస్ట్ జనరేషన్ హీరోలైనా ఎన్టీఆర్, ఎన్నాఆర్‌ల సరసన యాక్ట్ చేసి మెప్పించిన శ్రీదేవి. ఇక రెండో తరం హీరోలైనా కృష్ణ, శోభన్‌బాబులతో సైతం ఆడిపాడింది. మూడో తరం కథానాయకులైనా చిరంజీవి, నాగార్జున, వెంకటేష్‌లతో జోడి కట్టి తన సత్తా చాటింది. టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా కొనసాగుతూనే శ్రీదేవి బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. హిమ్మత్ వాలా సినిమా శ్రీదేవిని ఓవర్ నైట్ స్టార్‌ని చేసింది. ఆ తర్వాత హిందీ చిత్రసీమలో ఎన్నో హిట్ చిత్రాల్లో నటించి ఆలిండియా నెంబర్ వన్ హీరోయిన్‌గా ఒక వెలుగు వెలిగింది.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహిత్య వాక్యం

సుడిగాలిలో నువ్వు!

ఓ మనిషీ...!
సుడిగాలిలో నువ్వూ సుడివై పోకు
ఆ వడిగాలిలో వాలుగా ఒదిగిపోకు
నిన్ను నువ్వు గాలివాలుకు అర్పించుకోకు
నిన్ను నువ్వు శూన్యం చేసుకోకు!
గాలివాటులో వెళితే గమ్యం లేనట్టే!
తలొంచి తప్పుకుంటే జీవం ఎండినట్టే!
ఒకసారి కొట్టుకుపోతే తిరిగి రావడం ఉండదు
నాలుగుకాళ్ల జంతువులా నేలబారు నడవకు!
నువ్వు రెండు కాళ్ల జీవివని గుర్తు తెచ్చుకో!
నిటారుగా నిలబడితేనే మనిషి వవుతావు
సుళ్లు తిరిగే గాలిలో ఎదురు నిలిస్తేనే
మహావృక్షంలా జీవితంలో పాతుకుపోతావు



గాలివాటంలో వేసే అడుగు నీది కాదు
అలా నడిచే నడక నీ నడక అస్సలే కాదు
అడుగు తీసి అడుగేస్తేనే నడకవుతుంది
నడుస్తూ తలెత్తి చూస్తేనే విశ్వం కనిపిస్తుంది
తలొంచి పడిపోతే అది చెట్టెలా అవుతుంది
నిటారుగా నిలబడి సుడిగాలిని తరిమేస్తుంది
అందుకే అది తరతరాలకు ఆదర్శమైంది
నువ్వయినా నిలబడితేనే నువ్వవుతావు
నిన్ను దాటి అది వెళ్లాక నువ్వే శిలవవుతావు
జీవమున్న శిలలే కదా చరిత్రకు ఆనవాళ్లు
నిలిచి గెలిచేవారే కదా కొత్త ఇజానికి మైలురాళ్లు!

- వయ్యస్సారెస్
9000013367


చిన్ని నారాయణరావు
కవిత్వం స్వీయానుభవాల సారం

మాట దీర్ఘకవిత 'The word' పేరుతో ఇంగ్లీషు భాషలోకి అనువాదమయ్యింది. మాటమీద కవిత్వం ప్రపంచంలో ఏ సాహితీవేత్త రాయలేదు. అందులోనూ దీర్ఘ కవిత మాటమీద ఏ భాషలోనూ రాలేదు. అలా ఒక కవితా రికార్డును చిన్ని నారాయణరావు సొంతం చేసుకున్నాడు. ఇది అరుదైన విషయం ఎందరో మేధావుల ప్రశంసలని మాట దీర్ఘ కవిత సొంతం చేసుకుంది.

కవిత్వం మన మనోభావాలకి ప్రతిబింబం. చిన్ని నారాయణరావు ఒక ఊహాశాలి. లలితపదాలతో అనంతమైన భావాలను పలికించటంలో దిట్ట. అందరూ తీసుకొటానికి దృష్టి సారించటానికి నిరాకరించిన వస్తువుని గ్రహించి కరుణ రసపాతితంగా, మనోజ్ఞంగా కవిత చెప్పటంలో ఆయన ప్రజ్ఞ అసాధారణమైనది. అందువల్లనే ఆయన వర్తమాన తెలుగు కవులలో అద్భుత కవిత్వం చెప్పిన కవిగా విమర్శకుల చేత ప్రశంసింపబడ్డాడు. గుర్తింపబడ్డాడు. గొప్ప భావుకత మూలంగా ఆయన రాసిన చాలా కవితలు, ఆత్మకళ అభివ్యక్తితో నిత్యనూతనంగా అలరారుతాయి. సహజమైన కావటం మూలంగా ఆయన చూపు చాలా లోతైనది. వ్యక్తీకరణలో ఆయన వివిధ స్థాయీ భేదాలు పాటించటం వలన ఆయన కవితలు పాఠకులని ఆలోచింపచేస్తాయి. లలిత పదాలతోనే అనంత గంభీర సాంద్రతని ఆయన సాధిస్తాడు. ఆగ్రహమూ, మానవత్వమూ, ఆలోచన పరిణతి మూలంగా ఆయన కవిత్వం సరళంగా వుండి వినూత్నంగా ఉంటుంది. కరుణ రసాకోశితంగా, అంతర్గత ప్రవాహశీలతతో కవిత్వం ఒక్కమెట్టు ఎక్కిస్తా. పాఠకులను భావస్థాయి నించి తారాస్థాయి తీసుకెళ్లటంలో ఆయన నేర్పు అసాధారణం. అనన్య సామాన్యం. ఆయన కవిత్వం భావుకతతో పాటు, వ్యంగ్యం, ఆగ్రహం, మానవత్వంతో వలసశీలత కలిగి మనల్ని అబ్బురపరుస్తుంది. అంతిమంగా చైతన్యశీలతని కలిగించి ప్రభావశీల కవిత్వంగా అలరారుతుంది. ఇందుకు ప్రధానంగా 40సంవత్సరాల ఆయన సాహిత్య యాత్ర మూలంగా ఈ పరిణతి ఆయన సాధించగలిగాడు. అంతకన్నా మించి ఆయన గొప్ప సహనశీలి, చిరునవ్వుతో సాధించిన విధేయత, వినయం, దాన్ని మించిన అమాయకత్వంతో కూడిన పసితనం, అబ్బురపాటుతో కూడిన నిశిత దృష్టి ఫలితంగా ఎవరూ స్వీకరించని అంశాలని స్పృశించి వాటిని కవితామయం చేయటం ద్వారా చాలా గొప్ప కవితలు రాయగలిగాడు. అవి చాలా అరుదైన విశిష్ట కవితలుగా గుర్తింపుని సాధించుకున్నాయి. జీవితం ఓ విజయం, అంతర్ముఖం, మాట (దీర్ఘకవిత), గుండెదీపం, గంపకూడు ఆయన వెలువరించిన కవితా సంపుటాలు. ఇంక ఆయన రాసిన సినిమా సమీక్షలు, పలు వ్యాసాలు, విమర్శలు ఒక పుస్తకంగా రావాల్సిన అవసరం ఉంది.

మాట దీర్ఘకవిత 'The word' పేరుతో ఇంగ్లీషు భాషలోకి అనువాదమయ్యింది. మాటమీద కవిత్వం ప్రపంచంలో ఏ సాహితీవేత్త రాయలేదు. అందులోనూ దీర్ఘ కవిత మాటమీద ఏ భాషలోనూ రాలేదు. అలా ఒక కవితా రికార్డును చిన్ని నారాయణరావు సొంతం చేసుకున్నాడు. ఇది అరుదైన విషయం ఎందరో మేధావుల ప్రశంసలని మాట దీర్ఘ కవిత సొంతం చేసుకుంది. ఆయన అసాధారణ కవిత్వ లో చూపు మాట దీర్ఘకవిత్వంలో తొణికిసలాడింది. పద్మశ్రీ డా॥తుర్లపాటి కుటుంబ రావు-మాట మహత్మ్యను గురించి చిన్నినారాయణరావు ఎంతో పెద్దగా చెప్పారు అని ఒక కితాబు ఇచ్చారు. 'మాట' అనే అంశంపై దీర్ఘ కవిత మొదటిసారిగా రాసినవారు చిన్ని నారాయణరావే" అని ప్రముఖ విమర్శకులు కీ.శే. అద్దేపల్లి రామమోహనరావు స్వీయంగా సర్టిఫికెట్ ఇచ్చారు. 3.11.17న మాట ఆంగ్లానువాదం ది వర్డ్ పుస్తకాన్ని ఉపరాష్ట్రపతి గౌ॥ముప్పవరపు వెంకయ్యనాయుడు ఢిల్లీలో స్వీయహస్తాలతో ఆవిష్కరించి, ఆ పుస్తకంలోని కవిత్వ విన్యాసాన్ని ఎంతో ప్రశంసించటం ఆ పుస్తకం తెచ్చుకున్న అరుదైన గౌరవంగానే కాక, సాహిత్య చరిత్రలో మాట దీర్ఘకవిత ప్రస్థానం వంతు విలువైనదిగా ఆయన భావించారు. ఖలీల్ జిబ్రాన్ ప్రాఫెట్ తర్వాత ఆ స్థాయిని అందుకొన్న దివర్డ్ విలువ ప్రపంచ సాహిత్యానికి కొత్త వెలుగులు పంచిందంటే అది చిన్ని నారాయణరావు కలానికి వున్న శక్తిగా ఎవరైనా గుర్తించక తప్పదు.

మాట/సుమ్మాద్వారమై/స్నేహహస్తం అందిస్తే/ ప్రపంచమే కుప్పకూలిన శతం గెస్టై/వంగి వంగి నవస్కరిస్తుంది/సంఘాల్లో వేనవేలుకోటే/బ్రతుకుల్లో ఉషస్సుల పంటలే/పండిస్తుంది! (మాట 54వ పేజీ)



అలాగే ఒక మహానిస్తబ్ధతను చీల్చి చెండాడేది ఒక్క మాట మాత్రమే-అని మాట యొక్క భావాతీత గంభీరతను వేదాల స్థాయిలోకి చెప్పిన ఘనత ఆయన సాధించాడు. ఒక మహాఋషి స్థాయిలో మాట దీర్ఘ కవితా తపస్సు చేసిన మునీంద్రుడు మన చిన్ని నారాయణరావు. నాన్ ఋషికి కురుతే కావ్యం అన్న నానుడిని నిజం చేశారు చినారా! ఆత్మానుభవ స్థాయిని జ్ఞానస్థితికి, ధ్యానస్థితికి మాట కావ్య రచన ద్వారా ఆయన సాధించారు. ఇది అన్ని విషయాల పట్ల సమదృష్టిని సాధన ద్వారా పరిణతిని చేరుకోగలిగిన మోహరహితులు మాత్రమే మాట, గుండెదీపం, గంపకూడు లాంటి కావ్యరచనలు చేయగలరు. మెప్పించగలరు. తన రెండవ సంపుటి అంతర్ముఖంలో చిన్నినారాయణరావు ''నాకు కొంచెం స్ఫూర్తి నివ్వు'' అనే కవితలో.

''ఎడారిలో నీటికొలను నిర్మించే సామర్థ్యం నాది/మండు వేసవిలో/ మంచుదనం వెలుయించే ప్రతిభ నాది/ నాకు కొంచెం ఊసరా విప్పి చూడు/ అవనీతలాన్ని స్వర్గధామం చేస్తాను'' అని భావుకత ధైర్యాన్ని రంగరించి పోసి సామాన్యుల పట్ల వేదనమయ కోణంలో వస్తున్న దర్శించే ఆయన తన కవిత్వ ప్రాణప్రతిష్ఠ చేసుకున్నాడు. సమాజాన్ని అవగాహన చేసుకొనే సామర్థ్యం నిండే కవిత్వ పుష్టిని రాబట్టుకున్నాడు. దీనికి వ్యక్తిగత నియమాలతో దృశ్య శేషతని కూడా సాధించి తన జ్ఞానసంపత్తిని పండించుకొని ఇతర కవులకి అందని ప్రతిభని స్వయంకృషితో సాధించుకున్నాడు. ప్రతి కవితలో ఇవి తప్పక ఉండాల్సిన లక్షణాలే కాదు. అత్యవసరాలు కూడా. అంతే కాదు సహృదయత, సౌజన్యం చిన్నినారాయణరావులో కన్పించే అదనపు గుణాలు, లక్షణాలు. వర్తమాన తెలుగు సాహిత్య వాతావరణంలో చిన్ని నారాయణరావు లాంటి వ్యక్తిత్వం వున్న కవులు చాలా కొద్దిమంది మాత్రమే తారసపడ్డారు.

సూక్ష్మంగా ఆయన కవిత్వప్రతిభని తెలియచేయటానికి రాసిన చిన్ని ప్రయత్నం మాత్రమే. పోతే విమర్శకరంగంలో ఆయన ప్రతిభకి అంచనా వేయటానికి మాటలు చాలవు. తర్వాత రాజకీయ నాలుగు- కవితా సంపుటి రాబోతున్నది.

పెన్నాతీరంలో విశిష్ట సాహిత్య సేవ చేస్తున్న చినారా, ప్రధాన కార్యదర్శిగా డా॥నాగభైరవ కోటేశ్వరరావు అవార్డు కమిటీకి వ్యవహరిస్తూ ఇప్పటికి 39 మహాసభలని జరిపి రాష్ట్రంలోని ఎందరో కవులని, సినీప్రముఖులని సన్మానించి ఎంతో గొప్పగా ఆదరిస్తున్నారు. 1978లో చేత సాహితీ సంస్థకి కార్యదర్శిగా, 1983లో స్పందన సాహితీ ప్రధాన కార్యదర్శిగా ఆయన సాగించిన సాహితీ ప్రస్థానం ఎంతో విలువైనది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రచయితల సంఘానికి కార్యదర్శిగా వ్యవహరిస్తూ, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా యువరచయితలని హార్థికంగా, ఆర్థికంగా ప్రోత్సహిస్తూ తన వితరణ శీలతని చాటుకుంటున్నారు.

అంతేకాక రాష్ట్రవ్యాప్తంగా 23 సాహిత్య సంస్థల నించి గత 40ఏళ్లుగా ఎన్నో అవార్డులు, ఘన సన్మానాలు స్వీకరించారు. లాయర్ వారపత్రిక అవార్డు, మానస అవార్డు, చినుకు పత్రిక అవార్డు, కళాంజలి పురస్కారం, 2008లో ప్రతిష్టాత్మక ఎక్స్‌రే జాతీయ ఉత్తమ కవితా అవార్డు, ఇలా లెక్కలేనని అవార్డులు అందుకున్నారు. ఇక 2009లో ఆనం రామనారాయణ మంత్రివర్యుల చేత; 2010లో ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యగారి చేత పొందిన సన్మానాలకి లెక్కలేదు. ఇక ప్రధాన పురస్కారాలు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో స్వీకరించారు. 1. పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్శిటీ, హైద్రాబాద్ వారి నుంచి 2012 సంవత్సరానికిగాను వచన కవిత్వానికి కీర్తి పురస్కారం, 2. శ్రీఖర, నందన నామ ఉగాదులలో హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్రప్రభుత్వ ఉగాది కవి సమ్మేళనంలో పాల్గొని ప్రభుత్వం చేత సన్మానం స్వీకరించారు. 3. మాట దీర్ఘ కవితకు రావి రంగారావు జనరంజక పురస్కారం 2015 అవార్డు అందుకున్నారు. 4. గుండెదీపం కవితా సంపుటికి కలేకూరి ప్రసాద్ (యువక) స్మారక సాహిత్య పురస్కారం 2015 అందుకున్నారు. 5. గుండెదీపం కవితా సంపుటికి అద్దేపల్లి ఫౌండేషన్ ఉత్తమ కవితా సంపుటి పురస్కారం 2015కిగాను స్వీకరించారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా చిన్ని నారాయణరావు పొందిన పురస్కారాలు, సన్మానాల వివరాలు చెప్తా బోతే కొండవీటి చాంతాడంత లిస్ట్‌తయారవుతుంది. ఇందులో కొన్ని వివరాలు మాత్రమే ఉటం కించటం జరిగింది. చక్కటి సాహిత్యంతో మరెన్నో ఉత్తమ పుస్తకాలతో చిన్ని నారాయణరావుగారు మనలని అలరిస్తారనే నమ్మకంతో...

(చిన్ని నారాయణరావు సృజనసాహితీ, సత్తుపల్లి వారి కీర్తిపురస్కారం అందుకుంటున్న సందర్భంగా)

- సాగర్ శ్రీరామకవచం
9885473934

జ్వరం వచ్చినపుడు...

తలపై ఇనుపగుళ్ళు

చేతులకు కాళ్ళకు, సంకెళ్ళు
పులినెక్కిన వీరుడు

వీరుడా...నీ కత్తి ఏది?
మిత్రుడా...నీ పౌరుషం ఏది?
హితుడా...నువ్వు ఎవరి కోసం
ఇక్కడ నిలబడ్డవ్,
ఏ నల్లని రాక్షసుని
కనిపించని హస్తం
నిన్నిక్కడికి విసిరేసింది
ఎవరో విలపిస్తున్నారు...



ఎక్కడో మృత్యు సర్పం ఒకటి
పడగ విప్పి చూస్తున్నది...
స్పర్శించలేని నిర్నిమిత్త సహచరి
నిలువెత్తు ప్రశ్న
కలవర పెడుతున్నది
మిత్రుడా ఉలికి పడకు,
నీ నుదురుపై తెల్లని
రంగు గల ఒక
లేత చేతి స్పర్శ...
బతుకు వాకిలి ద్వారం
ఇంకా తెరచే ఉందని
ఊపిరి హెచ్చరిక...నెచ్చెలీ..
అదిగో నువ్వు
చూడవలసిన సూర్యోదయం
అక్కడ యుద్ధభూమి
నిరీక్షిస్తుంది
లే...లేచి కవచం వేసుకో..
గోరుకోయ్యలు పోడుస్తున్నాయ్

శిథిల జ్ఞాపకాల
సమాధుల మీద ఆత్మలు
ఆకుపచ్చగా
మొలుస్తున్నాయ్
మిత్రుడా.. జాగ్రత్త
శత్రువు నాచు పెట్టుకొని
ఇక్కడే ఉండి ఉంటాడు
మృత్యువు పిడికిలి
విప్పుతుందేమో
సలసల కాగే రక్తం
రాబోయే యుద్ధాన్ని స్వప్నిస్తుంది.
విజయుడా...నీకెందుకు భయం
గెలుస్తావు కదా నువ్వు
మనకోసం ఇంకా
దుఃఖం మిగిలే ఉంది.

- డాక్టర్ కాంచనపల్లి
9876096614

సాహిత్య గ్రంథాల పరిచయం

తెలంగాణ సాహిత్య అకాడమి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రచురించిన సాహిత్య గ్రంథాల పరిచయ కార్యక్రమం 28వతేదీన రవీంద్ర భారతి మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జరుగుతుంది. ఉదయం. పదిగంటల నుండి మ. 1.00గంట వరకు జరిగే సభకు డా॥నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారు. బుర్రా వెంకటేశం ముఖ్యఅతిథి. శాతవాహనుల నుండి కాకతీయుల వరకు తెలంగాణ అనే గ్రంథపరిచయంపై డా॥ జి. అంజయ్య , తెలంగాణ పద్య కవితా వైభవంపై గురిజాల రామశేషయ్య, మూడు తరాల తెలంగాణ కథపై కె.పి. అశోక్‌కుమార్, తెలంగాణ సామెతలపై బుజంగరెడ్డి, తెలంగాణ నవలా వికాసంపై ఆచార్య వెలుదండ నిత్యానందరావు, తెలంగాణ సినీగేయ వైభవంపై చంద్రబోసు ప్రసంగిస్తారు. మ.2.00గంటల నుండి సా.5.00గంటల వరకు జరిగే కార్యక్రమానికి కె.వి.రమణాచారి ముఖ్య అతిథిగా హాజరవుతారు. తెలంగాణలో శాతవాహనుల వారసత్వం అనే గ్రంథంపై హరగోపాల్, తెలంగాణలో భావ కవితా వికాసంపై మల్లెగోడ గంగాప్రసాద్, తొలినాళ్ల సోయిపై వర్ఖుల శివకుమార్, 'గోండ్వానాలాండు ఎంత ప్రాచీనమైనదో తెలుగు కూడా అంతే ప్రాచీనమైనది'పై సగిలి సుధారాణి, మాదిరాజు రామాకోటేశ్వరరావు స్వీయచరిత్రపై డా॥బాల శ్రీనివాసమూర్తి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వంపై డా॥ పగడాల నాగేందర్, ఈగ బుచ్చిదాసు సంకీర్తనలు, శతకంపై భాస్కర్ యోగి ప్రసంగిస్తారు.

- డా॥ఏనుగు నరసింహారెడ్డి
కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి

కవిత్వ ముద్రణ ఒక కళాత్మక క్రియ!

కవిత్వం రాయడం వేరు దాన్ని అందంగా అచ్చువేయించడం వేరు. ఈ విషయంలో చాలా మంది కవులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దానికి ఎన్నో కారణాలు కొందరికి ఆర్థికపరిస్థితులు బాగా లేకపోవడం వల్ల తాము మంచి కవిత్వం రాసినా కవితా సంపుటికి.. అందంగా.. కాస్ట్లీగా ముద్రించుకోలేక పోతుంటారు. అయితే ఆర్థిక స్థోమత ఉన్న ఉద్యోగులు, ధనం కలవారు..నిర్లక్ష్యం వల్లనో, అవగాహన లేకపోవడం వల్లనో పుస్తక ముద్రణకు అంత ప్రాధాన్యత ఇవ్వక ఏదో కవితా సంపుటి వేయించామన్నట్టు తక్కువ ఖర్చుతో ముద్రించి... ఆవిష్కరించుకుంటారు. ఇతర దేశాల లేక రాష్ట్రాల కవితా సంపుటాలు పరిశీలిస్తే మనం కొన్ని విషయాలు గమనించవచ్చు.

1. కవితా సంపుటి సైజ్ ఎలా ఉండాలి?, 2. పేజీ మేకింగ్ ఎలా ఉండాలి?, 3. poetry book design or formating అందంగా ఉందా?, 4. ఏ fonts లో అక్షరాలుండాలి?, 5. కవర్ పేజీ డిజైనింగ్ ఎవరితో చేయించాలి., 6. కవితా సంపుటి బ్యాక్ పేజీలో కవి పరిచయం అవసరమా?, 7. బొమ్మలు ఉండాలా? వద్దా?, 8. ముందు మాటలు వెనుక మాటలు అవసరమా?, 9. ఎన్ని పుస్తకాలు వేయించుకోవాలి? అన్నది కూడా ఆలోచించుకోవాలి. , 10. కవి పేరు, ఫొటో ఎక్కడ ఉండాలి? కవర్ పేజీపై కవి ఫోటో ఉండవచ్చా?, 11. కవితాసంపుటి మొత్తం ఎన్ని పేజీలు ఉండాలి?, 12. కవితా సంపు టాల పేర్లు ఎలా ఉండాలి?

పై ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకుంటే కొత్తగా కవిత్వం సంపుటాలుగా వెలువరించాలనుకునే ఉత్సుకత ఉన్న కవులకు ఎంతో ఉపయోగం ఉంటుంది. పాశ్చాత్య దేశాల్లో యూట్యూబ్‌లలో కవితా సంపుటాల డిజైనింగ్ పై guidelines, videos, presen- tations ఉన్నాయి. ఇక కవితా సంపుటాలను ప్రచురించే ముందు కవులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. 1. పుస్తకం సైజ్ మరీ పెద్దగానూ,మరీ చిన్నగానూ లేకుండా చూసుకోవాలి. అతి పెద్ద కవితా సంపుటాలు పెద్దపెద్ద కవులు వేయిస్తుంటారు. వీరు అప్పటికే ప్రసిద్ధ కవులై ఉంటారు. కాని కొత్తగా కవిత్వం రాసేవారు కవిత్వం లేకున్నా, కక్కుర్తితో పెద్ద కవితా సంపుటాలు వేయించడం వల్ల ప్రయోజనం ఉండదు. పైగా చిన్న కవితా సంపుటాల్లో మంచి కవిత్వం ఉన్న సంపుటాలను కవితా ప్రియులు బాగా ఇష్టపడతారు. 2. కవర్ పేజీలపై కవుల బొమ్మలు వేయించుకోవడం ఫ్యాషన్ అయిపోయింది. కవులు ఎవరికి వారు అందంగా ఉన్నామని భావిస్తే సరిపోదు. ఇతరులకు అందంగా కనిపించాలి కదా. ఇంతకూ కవిత్వానికి కవర్‌పేజీ సింబా లిక్‌గా ఉండాలి గాని...కవుల ముఖ సౌందర్యానికి కాదు కదా. బాహ్యసౌందర్యం కన్నా ఆత్మగత కవితా సౌందర్యం గొప్పదని తెలుసుకోవాలి. కవిత్వం

కవిత్వం-డిక్షన్-22

ఆత్మకళ అని శేషేంద్ర అన్నది అందుకే. 3. కవితా సంపుటి బ్యాక్ పేజీలో..కవి పరిచయం అక్కర లేదు. కవిత్వపరిచయం ఉంటే పరవాలేదు. (ముందు మాటల్లో కొన్ని వాక్యాలు) కవి తన పరిచయాన్ని లోపలి పేజీల్లో చివరి పేజీలో వేయించుకోవచ్చు. 4. కవితా సంపుటిలో అక్షరాల ఫాంట్ మరీ చిన్నగా కాకుండా మరీ పెద్దగా కాకుండా ఉంటే మంచిది. వెరైటీ కోసం కొందరు వివిధ ఫాంట్‌లను వాడుతుంటారు. అది బుక్ డిజైనింగ్‌ను బట్టి ఎలా ఉంటుందో చెప్పగలం. 5. కవితా సంపుటిలోని ప్రతి పేజీ..లో ఒక పక్క కవి పేరు మరో పక్క కవితా సంపుటి పేరు ఉండేలా చూసుకోవడం మంచిదే. పేజీలు చిరిగిపోయినా ..బజారులో పడినా కవిత కింద కవిత పేరో లేక కవితా సంపుటి పేరో ఉంటుంది. 6. కవితా సంపుటాల్లో కవిత్వం కన్నా బొమ్మలు డామినేట్ చేసే విధంగా ఉండ రాదు. అది కవిత కళ కన్నా చిత్రకళ అయ్యే ప్రమాదం ఉంది. చిత్రాలు కూడా అద్భుత కవిత్వాలే కాని..కవిత్వానికి అవి వక్ర భాష్యాలు కారాదు. బొమ్మలు ఉండాలా, వద్దా అన్నది కవితా వస్తువు, కవి అభిరుచి అవసరం బట్టి ఉంటుంది.

7. కవితా సంపుటాల పేర్లు ఎలా ఉండాలి? అన్నది పెద్ద చర్చనీయాంశం. దేశవిదేశాల కవితా సంపుటాలు కవర్ పేజీలు పరిశీలిస్తే.. కవితా సంపుటి పేర్లు కవితాత్మకంగా ఉంటాయి లేదా క్యాచీగా లేదా సింబాలిక్‌గా ఉంటాయి. ఇప్పుడు చాలామంది కవితా సంపుటిలోని ఒకమంచి కవిత పేరునే సంపుటి పేరుగా పెట్టుకుంటారు. అయితే అది కొత్తగా ఉండాలి. ఆలోచనాత్మకంగా ఉం డాలి. ఉదాహరణకు... వెన్నెలపూలు అన్న పేరు బాగానే ఉందని పిస్తుంది. కానీ ఇది మరీ పాత డిక్షన్‌లా కనిపించదూ? అదే 'సగం తెగిన చంద్రుడు' అన్నారనుకో ఏదో కొత్తగా ఉందనిపిస్తుంది. క్యూబిక్ చిత్రాల్లా కవితా శీర్షికలుంటే బాగుంటుందని నా భావన. 8. సంపుటిలో చాలా మంది కవితాశీర్షికలు ఇంకా సంస్కృత పదాల పదబంధాలతో పెట్టడం ఆశ్చర్యం. అంతేకాదు కవర్ పేజీలో కూడా సంస్కృత పదబంధాలతో పేర్లు పెట్టడం బోదలీర్ symbolic manifesto dictionకు వ్యతిరేకం ప్రతీకలు గాని, పేర్లు గాని, శైలిగాని,పాత డిక్షన్‌లో సంప్రదాయ డిక్షన్‌లో ఉండటాన్ని S.M.D. వ్యతిరేకిస్తుంది. 9. కవి పేరు కవితా సంపుటి కవర్‌పేజీలో మధ్యలో పెడుతుంటారు కొందరు. ఇది పాత పద్ధతి. చివరిలో ఉండాలి. కవిత్వం గొప్పగా లేకుంటే కవిపేరు ఎంత బోల్డ్ లెటర్స్‌లో వేయించినా ఫలితం ఉండదు. 10. కవితా సంపుటాలకు ముందు మాటలు వెనుక మాటలు ఉండాలా, వద్దా? అన్నది పెద్ద ప్రశ్న. కొత్తగా కవితలు రాసే వారికి ముందు మాటలు చాలా అవసరం. ఎందుకంటే అప్పటికే కవిత్వంలో తలపండిన పెద్ద కవులు వారి అనుభవాలతో కొత్త కవుల కవిత్వాన్ని చదివి విశ్లేషించి నాలుగు మంచి మాటలు రాస్తారు. కవిత్వం భాష.. అభివ్యక్తికి సంబంధించి..కొన్ని సూచనలు చేస్తారు. అవి కవులకు తమ తప్పులు దిద్దుకోడానికి ఉపయోగపడతాయి. 12. కవితా సంపుటి ముద్రణలో భాష పట్ల జాగ్రత్త వహించాలి. అచ్చు తప్పులు లేకుండా చూసుకోవాలి. చాలా కవితా సంపుటాల్లో అచ్చు తప్పులు లేని కవిత్వం అరుదుగా కనిపిస్తుంది. అంతేకాదు గ్రాంధిక వాదులను మహాభాషా



పండితులనుకొని కొందరు వారిని ప్రూఫ్ రీడింగ్‌కు నియమిస్తే మొత్తం మీ కవిత్వం శైలే మారిపోతుంది. మీరు అపహాస్యం పాలవుతారు. కవిత్వ భాష తెలిసినవారితో ప్రూఫ్ రీడింగ్ చేయించడం మంచిది. 13. కవితా సంపుటి అంకితం కవితాత్మకంగా, ఆత్మీయ భావనతో ఉండాలి. కవుల 'నా మాట' 'నా నుడి' మొదలైనవి కవితాత్మక శైలిలో INFORMATIVEగా ఉండాలి. 14. విషయ సూచిక తప్పనిసరిగా ఉండాలి. చాలామంది వెలువరించిన కవితా సంపుటాలలో 'విషయసూచిక లేకపోవడం ఆశ్చర్యకరంగా ఉంటుంది. అది కవుల నిర్లక్ష్య భావనకు నిదర్శనం. 13. ఎన్ని పుస్తకాలు వేయించాలి అన్నది కూడా కొత్తగా కవితా సంపుటాలు వేయించే యువకవులు ఆలోచించాలి. మొదట్లో వారి మాటలు వీరి మాటలు (ముఖ్యంగా పబ్లికేషన్) విని ఎక్కువ కాపీలు వేయించుకుంటారు. తర్వాత ఉచితంగా పంచలేక, అమ్ముకోలేక, ఇంట్లో పెట్టుకోలేక బాధపడుతుంటారు. ఇప్పుడు 500కన్నా ఎక్కువ ఎవరూ వేయించుకోరు. అవసరమైతే పి.డి.ఎఫ్ ఫైల్ అలాగే ఉంచుకుని అవసర మైనన్ని పుస్తకాలు ముద్రించుకోవచ్చు.

కవిత్వం రాయడం ఒక కల
కవితా సంపుటి అచ్చేయించడం ఒక కళ.

(కొత్త కలాల కోసం- కవితా నిర్మాణ పద్ధతులు)

- బిక్కి కృష్ణ
9912738815

సాహిత్య వార్తలు

యాములపల్లి నరసిరెడ్డికి ఎక్స్‌రే అవార్డు

విజయవాడ: ఎక్స్‌రే 2017 జాతీయస్థాయి అవార్డు ప్రముఖ రచయిత సీనియర్ జర్నలిస్టు యాములపల్లి నరసిరెడ్డి పెనుకొండ (అనంతపురం) ''భవన నిర్మాణ కార్మికుడు''కు లభించింది. విజేతకు పదివేల నగదు, జ్ఞాపికతో సత్కరించడం జరుగుతుంది. సాహిత్య ప్రియులు, కవులు, అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఈ అవార్డు నిర్వహణ ఈ సంవత్సరంతో మూడు పుష్కరాల కాలం పూర్తిచేసుకుంది. ప్రధాన అవార్డుతో పాటు మరో పదిమందికి ఉత్తమ కవితా పురస్కారాలు కూడా అందచేయబడతాయి. విశ్వ విద్యాలయ పూర్వ ఉపాధ్యక్షులు, సాహితీ స్రష్ట పద్మశ్రీ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ కొలకలూరి ఇనాక్ న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తారు.

అమ్మ-నేను-నాన్న కవితాసంకలనం ఆవిష్కరణ

సాహితీకిరణం గౌరవ సంపాదకులు గుదిబండి వెంకటరెడ్డి సంపాదకత్వంలో వెలువడిన 77మంది కవుల కవితలతో కూడుకున్న కవితాసంకలనం 'అమ్మ-నేను-నాన్న'ను 20వతేదీన శ్రీ త్యాగరాయ గానసభ కళాదీక్షితులు కళావేదిక యందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి.రమణ ఆవిష్కరిస్తారు. ఆం.ప్ర.పూర్వ చైర్మన్ డా॥ఎ.చక్రపాణి ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న ఈ సభలో పుస్తకాన్ని దూరదర్శన్ పూర్వసంచాలకులు డా॥ పాలకుర్తి మధుసూదనరావుకు అంకితం కావిస్తారు. పొత్తూరి జయలక్ష్మి పుస్తక పరిచయం కావిస్తారు.

పొత్తూరి సుబ్బారావు
9490751081

''**భాషే నేను తెచ్చుకున్న తీయని వరం**
భాషే నేను కట్టుకున్న జీవనగోపురం''

అనడంతో సి.నారాయణరెడ్డిగారికి తన భాషపై ఎంతటి అనురాగమో, తన భాష తనకి ఎంతటి జీవశక్తో తెలుస్తుంది. ఉక్తి వైచిత్రిని సినారెగారికి సహజ ప్రకృతి. అది ఆశువుగా, సద్యఃస్ఫూర్తిగా అలవడిన విద్య. దానికి కారణం శబ్దాధికారం, శబ్దప్రియత్వం, సినారెగారి ఉక్తి వైచిత్రిలో ముఖ్యాంశాలు.

1. మాత్రాగణాలకు అనుగుణంగా శబ్దాల కూర్పు
2. వ్యంగ్యోక్తులు లేదా గూఢోక్తులు
3. సంభాషణోక్తుల చాతుర్యం
4. అలంకారోక్తులు

సూక్తులు: మంచిమాటలు, సుభాషితాలు అని సామాన్యార్థం వాటితో పాటు చమత్కారాలు, లోకోక్తులు, కూడా సూక్తులే అవుతాయి. ఇవి ఆలోచనాత్మకమైనవి. పాఠకుల్ని కథనం వైపు లాక్కొని వెళ్తాయి. సి.నా.రె. సూక్తులు పాతబడినవి కావు. నవనవోన్మేషమైనవి. పాత్రలకి వన్నె పెట్టేవి.

''ముఖాముఖి'' కవితాసంపుటిలో ఈ క్రింది పంక్తులలో ఉక్తులూ సూక్తులూ రెండూ జమిలిగా కనబడతాయి.

''నాదేశం పావనగంగ, నాదేశం కరుణాంతరంగ
నా దేశం భగవద్గీత, నాదేశ అగ్నిపునీత సీత''

ఇక్కడ అంత్యాను ప్రాసోక్తి వుంది. దేశాన్ని గురించి నూతనమైన సూక్తులున్నాయి. ఇక్కడి అలంకారోక్తులు దేశసూక్తికి బలాన్నిచ్చాయి. ఇది అపూర్వమైన సూక్తి. అందుకే ఈ నాలుగు పంక్తులు యువతకి స్ఫూర్తినిచ్చాయి. ఇది చదవగానే సినారె గారిది అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ప్రశ్నలు సంధించి చెప్పవలసిన అంశానికి---ఇవ్వడం గమనిస్తాం

''పరిమళాలు నెవడాపును?
పైరగాలి నెవడాపును?
ఎవడాపును మానవతా
రవిరుక్కును, కవి వాక్కును?''

మూడో పాదాన్ని ఎవడాపును? అని ప్రారంభించటం ఉక్తి వైచిత్రి. దీనివల్ల ఏదో బలీయమైన అంశాన్ని కవి చెప్తున్నాడని ఊహిస్తాం. నాలుగో పంక్తి చదివితే శాశ్వతమైన ఉక్తిని ''రుక్కు-వాక్కు'' అర్థగాంభీర్యాన్ని కలగజేస్తాయి. ఎప్పుడు? అది మానవతకి సంబంధించినదైతేనే. భూమికలోని పంక్తులివి

''ఆశావాదం మనిషికి ఆరోప్రాణం
అది లేనిది బ్రతుకేమిటి? నరకప్రాయం''

ఇదొక సార్వకాలికమైన సూక్తి. ఆశ ఉండాలి కానీ అది దురాశ, నిరాశ కాకూడదు. ఏ ఆశలు లేని జీవితం బాధామయమే కాదు. నిస్తేజం కూడా.

''కర్పూర వసంతరాయలు'' కావ్యం సినారె కవితా ప్రతిభకు పట్టాభిషేకం. ఇందులో గల ఉక్తి చతురత, సూక్తి వైచిత్రి మనల్ని పరవశుల్ని చేస్తుంది.

''చకితుడై రాయడా జవ్వనిని గాంచె
కాటవేముడు ప్రభుముఖమ్ము పఠియించె''

ఇందులో వక్రోక్తి లేదా వ్యంగ్యోక్తి గమనిస్తాం. ''రాయడా జవ్వనిని గాంచె'' అంటే ఊరికే చూశాడని కాదు మనసు పడ్డాడని అర్థం. ఎందుకనంటే నృత్యం చేయటం, ఆమె జవ్వని కావటం కాటవేముడు రాజు ముఖాన్ని చూశాడని కవి అనలేదు. ''పఠియించె'' అన్నాడు. చదివేశాడు అంటే అంతరంగాన్ని అర్థం చేసుకున్నాడు. వాచ్యంగా కాకుండా వ్యంగ్యంగా వెల్లడించటం సినారె ఉక్తి చతురత!

'కర్పూరవసంతరాయలు'లో లకుమరాజుతో పలికిన సత్యోక్తి ఇది!

''కాలిధూళియే నాటికి
గంధపుపొడియగునా?''

ఇది లకుమ తన స్థాయిని గుర్తు చేస్తూ పలికింది. ఇది అందరకు వర్తించే సూక్తి. ఎవరైనా తన శక్తిని, స్తోమతను బట్టి ఆశించాలి. లకుమ ద్వారా సినారె అందించిన లోకసూక్తి ఇది. ఇది కొత్తది. 'ప్రపంచ పదులు', గజళ్ళు వంటివి వ్యక్తిత్వ వికాస సూక్తు లకు పెన్నిధులు. కొత్త ఉపమానాలతో ప్రతిపాదం ఒక సూక్తిగా సాగుతుంది.



సినారె కవిత్వంలో ఉక్తులూ, సూక్తులూ

''కొందరికి పదవి వద్దన్నా మీదపడుతుంది వరూధినిలా
మరికొందరికి సిక్సర్ సాధించిన క్రికెట్ బంతిలా
ఒగరుస్తూ ఉరికినా అందదు
పదవికి చిగురులా ఉండాలి యోగ్యత జిగురులా కాదు.

''ఎన్ని మెట్లు ఎక్కావని కాదు ఎంతయెత్తుకెదిగావనీ
ఎన్ని మునకలేశావని కాదు, ఎంత లోతు చూశావనీ
ఎన్ని కృతులు చదివావని కాదు, ఎంత సిద్ధిపొందావనీ

''కప్పి జెబితే కవిత్వం విప్పి జెబితే విమర్శ'' అన్నది సినారె ఉపనిషత్ వాక్యంలా అల్పరచనలో అనల్పార్థం ఇస్తుంది.

''**ప్రబంధ కవులు స్త్రీల అంగాంగ వర్ణన చేస్తే**
భావకవులు స్త్రీల అంతరంగాన్ని వర్ణించారు'' అంటారు తమ సిద్ధాంత వ్యాసంలో. ''ఇంతటి వశీకరణ శక్తికి మూల కారణం మధురాక్షర సమ్మేళనం. మందార- మధుప- మదనములు ఒక్కపాదంలోనే ఇన్ని మకారాల గుబాళింపు. అందుకే ఈ పద్యం తెలుగు వారినోటికెక్కింది'' అంటారు. ''మందారమకరందాలు''లో ఇలా వచనంలో కూడ ఉక్తి వైచిత్రిని ప్రదర్శిస్తారు సి.నారాయణరెడ్డి. **'పోతన తెలుగుల పుణ్య పేటి'** అయితే సినారె **''తెలుగు వాక్కుల పేటి''**.

- ద్వా. నా. శాస్త్రి
9849293376

చుక్కలు చూపుతున్న ట్రాఫిక్ జామ్‌లు

●పోలీసులపై వాహనదారుల మండిపాటు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ఫస్ట్.. ఎన్‌ఫోర్స్‌మెంట్ నెక్స్ట్ అని ఊదరగొట్టే ట్రాఫిక్ పోలీసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఫస్ట్.. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ నెక్స్ట్ అన్న చందాన వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ ట్రాఫిక్ జామ్ చోటు చేసుకున్నా అక్కడ ట్రాఫిక్ పోలీసుల జాడ మచ్చుకైనా కనిపించదని, అదే స్పెషల్ డ్రైవ్‌ల పేరిట జరిమానాల విధింపులో మాత్రం ట్రాఫిక్ పోలీసులు గుంపులు గుంపులుగా కనిపిస్తూంటారని వాహనదారులు వ్యంగ్యోక్తులు విసురుతున్నారు. ఇందుకు సంబంధించి నగరంలో ఓ సంఘటన చోటు చేసుకుంది. అల్వాల్ నుంచి బొల్లారం వరకు పెద్ద ఎత్తున వాహనాలు ఆగిపోవడంతో భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. రెండు గంటలుగా ఐదు కిలోమీటర్ల మేర ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు ఆందోళనకు దిగారు. ఇంత జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. అత్యంత దారుణమైన విషయమేమంటే ఆ ట్రాఫిక్ జామ్‌లో రెండు అంబులెన్స్‌లు ఇరుక్కుపోయాయి. హైదరాబాద్ రోడ్లపై ప్రయాణం చేయాలంటే ఎప్పుడు గమ్యస్థానం చేరుతామో తెలియని పరిస్థితి నెలకొని వుందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. మరోవైపు ఆయా జంక్షన్లలో సైతం కెమెరాలతో ట్రాఫిక్ పోలీసులు రెడీగా ఉంటున్నారు. కెమెరాలను క్లిక్ మనిపిస్తున్న తీరుపై సైతం వాహనదారులు ఆవేదన చెందుతున్నారు.

పరిశోధకులకు ఉపయుక్త గ్రంథం


హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ గౌరవ సభ్యులు డాక్టర్ ఆంజనేయ గౌడ్ సామాజిక న్యాయం మరియు బీసీలపై వ్రాసిన పరిశోధనా గ్రంథాన్ని ఢిల్లీకి చెందిన జాతీయస్థాయి ప్రముఖ ప్రచురణ సంస్థ రీసెర్చ్ ఇండియా ప్రెస్ ప్రచురించింది. సామాజిక న్యాయం మరియు భారతదేశ సామాజిక, ఆర్థిక రంగాల్లో ఓబీసీల అభివృద్ధి ప్రభుత్వ ఉద్యోగ రంగంపై ప్రత్యేక దృష్టి అనే ఈ గ్రంథంలో 70 ఏళ్ల దేశ, రాష్ట్రప్రభుత్వ పాలనా విభాగాలు వివిధ రంగాల్లో బీసీలకు జరిగిన అన్యాయాన్ని శాస్త్రీయ గణాంకాలతో సహా వివరించారు. ఆ కాలంలో జాతీయ మరియు వివిధ రాష్ట్రాల బీసీ కమిషన్‌ల అధ్యయనాలు ఆయా కేంద్ర, రాష్ట్రాలకు సమర్పించిన నివేదికలు, వాటిపై జాతీయ, వివిధ రాష్ట్రాల ప్రభుత్వాల చర్యలను గ్రంథంలో చర్చించారు. ఏడు అధ్యాయాలు 362 పేజీలతో వెలువడిన ఈ పుస్తకంలో సామాజిక న్యాయం, సిద్ధాంతం, భారత రాజ్యాంగ దృక్పథం, బీసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్లు, న్యాయస్థానాల తీర్పులు, మండల్ కమిషన్ అనంతరం రాజకీయ, సామాజిక పరిణామాలు, వివిధ రంగాల్లో దేశంలో ప్రస్తుత ఓబీసీల స్థితి తదితర అనేక అంశాలపై ఈ గ్రంథంలో సమగ్ర వివరాలు అందించారు. పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి ఈ గ్రంథానికి వ్రాసిన ముందుమాటలో అధ్యయన పరిశోధకులకు, విధానాలు రూపొందించేపాలకులకు డాక్టర్ ఆంజనేయగౌడ్ గ్రంథం గొప్ప ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రూ.1900 విలువ కలిగిన ఈ పుస్తకం ఇప్పటికే రెండువేలకాపీలు అమ్ముడు పోయింది. త్వరలో తెలుగు అనువాదం కూడా వెలువడుతుంది.

ఉగ్రవాద సానుభూతిపరుడి అరెస్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: విదేశాలకు పారిపోతున్న కేరళకు చెందిన ఉగ్రవాద సానుభూతిపరుడిని శంషాబాద్ విమానాశ్రయంలో నిఘా అధికారులు పట్టుకున్నారు. కేరళకు చెందిన ఎంఎంఅక్బర్‌కు స్థానికంగా 13 విద్యా సంస్థలున్నాయి. అతడు పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు ఉగ్రవాదం, మత ప్రేరేపిత బోధనలు చేస్తున్నాడు. ఈ విషయాన్ని ఒక సంస్థ సోషల్ మీడియాలో వెల్లడించింది. దీంతో కేరళ పోలీసులు 2016లో నిఘా పెట్టారు. 2017లో అతడి విద్యాసంస్థల్లో సోదా చేయగా పలు పుస్తకాలు లభించాయి. ఆ పుస్తకాలను ముంబైలో ముద్రించినట్లు గుర్తించారు. పోలీసులు అతడిపై కేసు నమోదు చేయగా, అప్పటి నుంచి అక్బర్ పరారీలో ఉన్నాడు. దేశం విడిచి పారిపోయే అవకాశం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు, కేంద్ర హోంశాఖ సహాయంతో లుక్ ఔట్ సర్కిల్ జారీ చేశారు. ఈ క్రమంలో అక్బర్ కౌలాలంపూర్ నుంచి విమానంలో శంషాబాద్‌కు వచ్చాడు. అక్కడి నుంచి దుబాయ్ వెళ్లేందుకు సిద్ధమవుతుండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు.

విభజన సమస్యలు తేలేనా..?

●ఇంకా జటిలంగానే కీలక సమస్యలు ●కేంద్ర హోం శాఖ చొరవ ●సఫలం కాని భేటీలు ●గడువు కోరుతున్న తెలంగాణ ప్రభుత్వం ●దిక్కుతోచని ఏపీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాల మధ్య విభజన అంశాలు మరింత జటిలంగా మారుతున్నాయి. రెండు రాష్ట్రాలకు చెందిన అనేక సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే మిగలడంతో కేంద్రం చొరవ చూపుతోంది. రాష్ట్ర విభజన జరిగి మూడున్నరేళ్లయినా ఇంకా ఆస్తులు, అప్పుల విభజన కొలిక్కి రావడంలేదు. దీంతో కేంద్ర హోంశాఖ స్వయంగా రంగంలోకి దిగింది. రెండు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు ఉన్నతస్థాయి సమావేశాలకు పూనుకున్నది. అయినా సమయం కలిసిరాక సమావేశాల వాయిదాలతో సమస్యలకు మోక్షం లభించడంలేదు.

ఇదిలా ఉండగా ఈ నెల 27న మరోసారి సమావేశం కావాలని ఇరు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్ర హోంశాఖ లేఖలు రాసింది. అయితే గతంలో పలుమార్లు కేంద్ర హోంశాఖ ఇద్దరు సీఎస్‌ల భేటీకి ప్రయత్నాలు చేసినా అవి సఫలం కాలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలోని షెడ్యూల్ 13 లోని అంశాలతోపాటు అనేక అంశాల్లో వివాదాల పరిష్కారమే లక్ష్యంగా ఈ సమావేశం ఏర్పాటు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అయితే తొలి భేటీకి తెలంగాణ సీఎస్ ఎస్కే జోషి హాజరు కాలేదు. పని ఒత్తిడితో హాజరు కాలేనని ఆయన ముందే చెప్పారు. దీంతో మరోసారి సమావేశానికి కేంద్ర హోం శాఖ షెడ్యూల్‌ను ఖరారు చేసింది. ఈ మేరకు ఇరు రాష్ట్రాలకు లేఖలను అందజేసింది. షెడ్యూల్ 9, 10ల విషయంలో ఇంకా అస్పష్టత వీడలేదు. షీలా బీడే కమిటీ కొన్ని సిఫార్సులు చేసినా ఇంకా పంపకాలు పూర్తి కాలేదు. పబ్లిక్ రంగ సంస్థల పంపకాలు, ఆస్తులు, అప్పుల అంశంలో వివాదాలు ఇంకా తొలగిపోలేదు.

కొన్ని అంశాల్లో ఇరు రాష్ట్రాల మధ్య సమన్వయ లేమి ఎదురవుతోంది. ఉన్నత విద్యాశాఖకు చెందిన కొన్ని ఆస్తుల అంశం జటిలంగా మారింది. ఈ అంశంలో న్యాయం కోరుతూ ఏపి సర్కార్ కోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో చరాస్తుల పంపిణీకే తెలంగాణ ప్రభుత్వం ముందుకు వస్తుండగా గరిష్ట నిష్పత్తిలో ఆస్తుల పంపిణీ జరగాలనే ఏపి వాదనకు తెలంగాణ సుముఖంగా లేదు. కేవలం నగదునే పంపిణీ చేసుకుందామని, ఇక్కడి స్థిరాస్తుల పంపిణీ సరికాదని తెలంగాణ ప్రభుత్వం అంటోంది. దీంతో ఈ అంశంపై పీటముడి పడింది. ఏపీ మాత్రం నిర్దేశిత నిష్పత్తిలో పంపకాలు చేసుకోవాలని కోరుతోంది. తద్వారా తమకు వచ్చిన ఆస్తుల విక్రయంతో ఆదాయం పొందవచ్చని ఏపీ యోచిస్తోంది. ఇది విభజన చట్టంలో లేదని తెలంగాణ మోకాలడ్డుతోంది. కీలకమైన హైదరాబాద్‌లోని పబ్లిక్ రంగ సంస్థల ఆస్తులపైనే ఇరు రాష్ట్రాలు పట్టుదలకు పోతున్నాయి. అత్యంత విలువైన ఆస్తుల పంపిణీకి కేంద్రం కూడా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. దాదాపు 100 కుపైగా పబ్లిక్‌సెక్టార్ సంస్థల లెక్కలు తీసి దీనిపై డిస్ప్యూట్ రిజల్యూషన్ కమిటీని కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ నేతృత్వంలో పరస్పర చర్చల ద్వారా పరిస్థితిని చక్కబెట్టాలని యోచిస్తోంది. రైల్వే బోర్డు ఛైర్మన్‌తోపాటు, కేంద్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి, జలవనరుల శాఖ కార్యదర్శి, పారిశ్రామిక విధానం ప్రమోషన్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి, కేంద్ర ప్రభుత్వ వ్యయ శాఖ, షిప్పింగ్ ట్రాన్స్‌పోర్టు కార్యదర్శి, స్టీల్ మంత్రిత్వ కార్యదర్శి, రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ కార్యదర్శులను ఆహ్వానించినట్లు తెలిసింది. కాగా ఈ సమావేశం కూడా కొనసాగేది అనుమానమేనని తెలుస్తోంది. బడ్జెట్ కసరత్తు రెండు రాష్ట్రాల్లో జరుగుతోంది. అధికారులు ఈ కసరత్తులో నిమగ్నమయ్యారు. ఇదే అంశాన్ని తెలంగాణ ప్రధానంగా ప్రస్తావిస్తోంది. మరోసారి భేటీని పొడిగించాలని కోరే అవకాశం ఉందని సమాచారం.

శరవేగంగా ట్విన్‌టవర్స్ నిర్మాణం

●ఆరు నెలల్లో అందుబాటులోకి...

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బంజారాహిల్స్ రోడ్ నెం. 12లో ఎనిమిది ఎకరాల స్థలంలో 16, 24 అంతస్తుల ఫ్లోర్స్‌తో కూడిన ట్విన్ టవర్స్ నిర్మాణపనులు శరవేగంతో కొనసాగుతున్నాయి. మొత్తం పనులను ఆరు నెలలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. నవంబర్‌కల్లా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రానికే తలమానికంగా ఈ ట్విన్ టవర్స్ నిలవబోతోంది. ఇందులో కమాండ్ కంట్రోల్ సెంటర్ మెయిన్ హాల్ ఫోర్త్ ఫ్లోర్‌లో, విజిటర్స్ హాల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉండనుంది. వెయ్యి మంది వ్యక్తులు ఏకకాలంలో కూర్చునేందుకు వీలుగా ఆడిటోరియం, అధునాత సాంకేతికతతో అలరారే వాటర్ ఫౌంటైన్స్ ప్రధాన ఆకర్షణగా నిలువనున్నాయి. అత్యున్నత ప్రపంచశ్రేణి ప్రమాణాలతో ఈ ట్విన్‌టవర్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్ రూపుదిద్దుకుంటోంది. మొత్తంగా నాలుగు లక్షల చదరపు గజాల విస్తీర్ణంలో ఈ ట్విన్‌టవర్స్ నిర్మాణమవుతోంది. 600 ఫోర్ వీలర్స్ పార్కింగ్ చేసుకునేలా సెల్లార్‌లో సౌకర్యం కల్పించనున్నారు. కాగా, ఇందులో నిర్మితమవుతున్న కమాండ్ కంట్రోల్ సెంటర్ ఒక్క పోలీసు శాఖకే కాదు.. అన్ని శాఖల అధికారులు వినియోగించుకునే వీలుంది. తాజాగా రాష్ట్ర హోం శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి మరో ఆరు నెలల్లో ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణం పూర్తి కానుందని చెప్పిన సంగతి తెలిసిందే.

ఇటు ట్విన్ టవర్స్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుంటే మరోవైపు భాగ్యనగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిటీ, సీసీటీవీ, నేను సైతం ప్రాజెక్టు కింద సీసీ కెమెరాల ఏర్పాటు దిశగా ప్రయత్నాలు ఊపందుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పోలీసు సిబ్బందికి టెక్నాలజీలో శిక్షణను అందిస్తున్నారు. ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో సిబ్బందికి టెక్నాలజీలో శిక్షణను ఇవ్వడం జరుగుతోంది. హైదరాబాద్, జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తంగా పది లక్షల సీసీ కెమెరాల ఏర్పాటు చేసే దిశగా సిబ్బంది కృషి చేయాలని నేను సైతం ప్రాజెక్టును మరింత ముందుకు తీసుకెళ్లాలని డీజీపీ మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇప్పటికే లక్షా 50 వేల సీసీ కెమెరాలు కమ్యూనిటీ, నేను సైతం ప్రాజెక్టు కింద నెలకొల్పారు. ఇటు హైదరాబాద్, జీహెచ్ఎంసీ పరిధిలో పది లక్షల కెమెరాలతో, అటు జిల్లాల వ్యాప్తంగా కూడా సీసీ కెమెరాల స్థాపన దిశలో ప్రజలను సన్నద్ధులను చేయడంలో పోలీసు సిబ్బంది బిజీబిజీగా ఉన్నారు. జిల్లాల్లో కూడా నేను సైతంకు అపూర్వ స్పందన లభిస్తోంది.

మిషన్ భగీరథలో ఇంటింటికి నల్లా నీరు మాదిరిగానే నేనుసైతం ద్వారా ఇంటింటికి సీసీ కెమెరా అన్న కొత్తకాన్సెప్ట్‌ని తెరపైకి తీసుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీసీ కెమెరాలన్నింటినీ ఈ ట్విన్‌టవర్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తారు. తద్వారా రాష్ట్రంలో ఏ మూల ఏ చిన్న సంఘటన జరిగినా క్షణాల్లో అది ఇక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుతుంది. అదే విధంగా హైదరాబాద్‌లో ప్రధాన వేడుకులను సైతం పర్యవేక్షించే వీలుంటుంది.

పెరగనున్న రహదారుల నిడివి

●11 రోడ్ల మార్పునకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదన




హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో జాతీయ రహదారుల నిడివి పెరగనుంది. రహదారుల నిర్మాణంతోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్ర స్థాయికి తీసుకువెళ్లవచ్చన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర రహదారులకు తోడుగా జాతీయ రహదారుల అభివృద్ధికై కృషి చేస్తోంది. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా బదలాయించాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తోంది. రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేతృత్వంలో అధికారులు ఇటీవల ఢిల్లీ వెళ్లి కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి బదలాయించాల్సిన రహదారులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులపై వినతిపత్రాలు ఇచ్చారు. కేంద్రం ప్రీ బడ్జెట్ చర్చల సందర్భంగా కూడా వినతులు సమర్పించింది. కేంద్రం సానుకూలంగా స్పందిస్తే రాష్ట్రంలో విస్తరించిన జాతీయ రహదారుల నిడివి 7,357 కిలోమీటర్లు చేరుకునే అవకాశం ఉంది.

ప్రస్తుతం రాష్ట్రంలో 6,150 కిలోమీటర్ల పొడవు గల 25 జాతీయ రహదారులు ఉన్నాయి. వాటితో 1207 కిలోమీటర్ల నిడివి ఉన్న 11 రోడ్లను కూడా జాతీయ రహదారులుగా బదలాయించాలని ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. అందుకు కేంద్రం సానుకూలంగా స్పందిస్తే రాష్ట్రంలోని దాదాపు 50 శాసనసభ నియోజకవర్గాలను కలుపుతూ నేషనల్ హైవేస్ ఏర్పాటవుతాయి. కొన్ని రహదారులను కేంద్రం స్వయంగా నిర్వహిస్తుండగా, మరికొన్నింటిని పీపీపీ విధానంలో పబ్లిక్, ప్రైవేట్ బాగస్వామ్యంతో నిర్వహిస్తున్నాయి. 11 రహదారులను జాతీయ రహదారులుగా మార్చడంతో పాటు అంతర్రాష్ట్ర అనుసంధానంలో భాగంగా రాష్ట్రానికి రూ. 190.10 కోట్ల అంచనాతో చేపట్టే పథకాలకు నిధులు మంజూరు చేయాలని మంత్రి తుమ్మల కేంద్రం దృష్టికి తెచ్చారు.

జాతీయ రహదారులు వేయడానికి సంబంధించి భూసేకరణ, అటవీ అనుమతులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో అధికారులను మంత్రి ఆదేశించారు. ఇప్పుడున్న రోడ్లతో పాటు మరో 11రహదారుల బదలాయింపు జరిగితే రాష్ట్రంలోని దాదాపు సగం నియోజకవర్గాలలో జాతీయరహదారులు వెళతాయి. కొత్త జాతీయ రహదారులకు సంబంధించి నిర్మల్ జిల్లాలో భైంసా - పెద్దపల్లి రోడ్డు రూ.59 కోట్లు, భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలో లక్ష్మీనగరం - లక్ష్మీపురంరోడ్డు రూ.51 కోట్లు, ఖమ్మం జిల్లాలో ఖానాపురం - గన్నవరం రోడ్డు రూ. 12.40 కోట్లు, ఖమ్మం జిల్లాలో మిట్టపల్లి - ఉట్కూరు - పెద్ద కోరికొండ రహదారి రూ. 33 కోట్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ములకలపల్లి - వెంకటాపురం రహదారి రూ. 34.70 కోట్లు మంజూరు చేయాలని కేంద్రానికి సమర్పించిన వినతిపత్రంలో కోరారు.

అదే విధంగా నకిరేకల్ -మల్లంపల్లి జాతీయ రహదారి 465పై జమన్లపల్లి - మంగలవారి పేట సెక్షన్‌లో 33 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి అటవీ అనుమతులు మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్ మహానగరం చుట్టూ ప్రాంతీయ బాహ్య వలయ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, జడ్చర్ల - దేవరకొండ జాతీయ రహదారి 167 పనుల విస్తరణకై రూ. 114. 23 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు.

ఏపీకి లక్ష విద్యుత్ కార్లు



●సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి కంపెనీలకు రాయితీలు ●విద్యుత్ సంస్కరణలు అమలు చేశాం: సీఎం చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో: ఆంధ్రప్రదేశ్‌లో లక్ష విద్యుత్ కార్లు ఉత్పత్తి, కొనుగోళ్లకు ఎంవోయూ చేయబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. మార్చి 7న ఇందు కోసం ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సాంప్రదాయేతర వనరులను ఉపయోగించుకుంటూ సౌరవిద్యుత్, పవన విద్యుత్‌ల ఉత్పత్తి వినియోగంలో ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా, నెంబర్-1లో నిలబెడతామన్నారు. సీఐఐ, సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఏర్పాటు చేసిన అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు రెండో రోజు ఆదివారం సాంప్రదాయేతర వనరుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి - వినియోగంపై సదస్సు నిర్వహించారు. తొలుత సంబంధిత ప్రముఖులతో చర్చలు నిర్వహించిన అనంతరం చంద్రబాబు వివిధ కంపెనీలతో కుదిరిన ఒప్పందాలను ఆయా సంస్థలకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సౌర, పవన విద్యుత్ ఉత్పత్తితో పర్యావరణ పరిరక్షణ కలుగుతుందన్నారు. భవిష్యత్‌లో అన్ని రంగాల్లో సౌర, పవన విద్యుత్‌ల వినియోగం గణనీయంగా పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు.రాష్ట్రం విద్యుత్‌లోటుతో ఉండేదని,దీన్ని సమగ్రంగా పరిశీలన చేసి విద్యుత్ రవాణా నష్టాలను అధిగమించడం, సంస్కరణలు ప్రవేశపెట్టడంతో మిగులు విద్యుత్ స్థాయికి చేరామన్నారు. సౌర, పవన విద్యుత్‌లు చౌకగా లభిస్తాయని తద్వారా ఉత్పత్తి రంగం లాభపడటమే కాకుండా వినియోగదారులకు తక్కువ ధరకు ఆయా ఉత్పత్తులు లభిస్తాయన్నారు. అవసరానికి తగినట్లుగా ఉత్పత్తి చేయడం, శక్తిని నిల్వ చేయడం, నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ఆధునిక పద్ధతుల్లో కంప్యూటర్‌ల వినియోగం ఉపకరిస్తుందన్నారు. అన్ని రకాల విద్యుత్‌లను గ్రిడ్‌ల ద్వారా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వంద మెగావాట్ల సోలార్ ప్లాంట్లకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రపంచంలోనే అత్యధిక నిల్వ సామర్థ్యం గల ప్లాంట్లను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఈ రంగంలో ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు ఎక్కువ రాయితీలు ఇస్తున్నట్లు తెలిపారు.

పారిశ్రామిక రంగానికి వెన్నెముకగా నిలిచే విద్యుత్ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. తొలుత జరిగిన చర్చల్లో సాంప్రదాయేతర వనరుల వినియోగం, ఉత్పత్తి రంగాల్లో ఐటీ, డిజిటల్ రంగాలను ఉపయోగించడంపై చర్చించారు. సౌర, పవన విద్యుత్‌ల ఉత్పత్తికి అనువైన ప్రాంతాలను గుర్తించడం, విద్యుత్ రవాణా మార్గాలను రూపొందించడంలో శాస్త్రీయత పాటించడంపై విపులంగా చర్చించారు. అవసరాలు, శాస్త్రీయత తదితర అంశాలపైన , ప్రభుత్వ రాయితీలపై చర్చ జరిగింది. పలువురు పారిశ్రామికవేత్తల ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానాలు చెప్పారు.

బోన్సాయ్ సదస్సు జరపండి: తలసాని

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మానసిక ప్రశాంతతను చేకూర్చే బోన్సాయ్ వృక్షాల సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మహారాష్ట్రలోని పూణేలో ఈ నెల 22నుంచి జరుగుతోన్న బోన్సాయ్ అంతర్జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో మంత్రి తలసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బోన్సాయ్ మొక్కలను పెంచటం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. ఇటువంటి సదస్సు హైదరాబాద్‌లో నిర్వహిస్తే ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహకారం అందిస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం పచ్చదనాన్ని పెంచెందుకు హరితహారం కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మంత్రి తలసాని పేర్కొన్నారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ మధ్య ఘర్షణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాజన్న సిరిసిల్ల జిల్లాలో వీర్నపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై, కానిస్టేబుల్ ఘర్షణ పడ్డారు. సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ విశ్వజిత్ కానిస్టేబుల్ మోహన్‌ను సస్పెండ్ చేశారు. కాగా, ఎస్సై, కానిస్టేబుల్ ఘర్షణ పడ్డ విషయం అక్కడి పోలీసు వర్గాల్లో పెద్ద సంచలనమే అయింది.

టెక్నాలజీలో ఏపీ నెం. 1

విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో: ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించుకుని రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రపథాన నిలిపే దిశలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖపట్నంలో నిర్వహిస్తున్న మూడు రోజుల అంతర్జాతీయ భాగస్వామ్య పెట్టుబడుల సదస్సులో రెండో రోజైన ఆదివారం ఉదయం టెక్నాలజీ ఫర్ టుమారో అనే అంశంపై నిర్వహించిన చర్చా సదస్సునుద్దేశించి ఆయన కీ నోట్ అడ్రస్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అశాస్త్రీయ పద్ధతిలో విభజింపబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తొలినాళ్లలో రాజధాని లేక, నిధులు ఇతర మౌలిక సదుపాయాల లేమితో బాధపడిందని, ఒక్కొక్క సమస్యను అధిగమిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ఖచ్చితంగా అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాలో అగ్రపథాన నిలపడం కోసం విజన్ ప్రకారం 2050 నాటికి ప్రపంచంలోనే తొలి రాష్ట్రంగా తయారు చేయడం తమ ప్రస్తుత లక్ష్యమన్నారు. ఇందుకోసం ఆధునిక శాస్త్ర సాంకేతిక పద్ధతులను ఉపయోగించుకోవడంలో తమ ప్రభుత్వం ఆకాశమే హద్దుగా కృషి చేస్తోందన్నారు. రియల్ టైం గవర్నెన్స్ ద్వారా ఇ-ప్రగతి, ఇ-ఫైలింగ్, బయో మెట్రిక్ అటెండెన్స్ వంటి విధానాల ద్వారా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా, సమయ పాలనతో అందజేయడంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచామన్నారు. అలాగే పరిశ్రమల స్థాపనకు అవసరమైన సహజ వనరులు దేశంలో ఇంకే రాష్ట్రానికి లేవన్నారు. సుదీర్ఘ తీర ప్రాంతం, రవాణా సౌకర్యాల కనెక్టివిటీ, మానవ వనరులు, నీటిలభ్యత, ముడి ఖనిజ లభ్యత, 24 గంటల విద్యుత్ సరఫరా సౌకర్యం, సింగిల్ విండో పద్ధతిలో పరిశ్రమలకు కావాల్సిన అన్ని రకాల పాలనా అనుమతులను పారదర్శకంగా కేవలం 21 రోజుల స్వల్ప వ్యవధి వంటి సౌకర్యాల కల్పనతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరుస్తున్నారన్నారు.

ఇటీవల రాష్ట్రంలో నిర్వహించిన ప్రజా సాధికార సర్వే సత్ఫలితాలు ఇచ్చిందన్నారు. అన్ని ప్రజోపయోగసేవలకు ఆధార్ నెంబరును అనుసంధానం చేయించడం త్వరితగతిన తమ రాష్ట్రంలో పూర్తవుతోందన్నారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న కాంప్రహెన్సివ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టం, ఇ-ఆఫీసు, ఇ-కేబినెట్, బయో మెట్రిక్ విధానం, ఏపీ క్లౌడ్ మేనేజ్‌మెంట్ విధానాలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. రాబోయే మార్చిలోగా ప్రభుత్వ కార్యాలయాన్నీ శతశాతం ఇ-ఆఫీసు, ఇ-ఫైలింగ్, బయోమెట్రిక్ వంటి సాంకేతిక విధానాల పరిధిలోనికి తీసుకురానున్నామన్నారు. అలాగే సర్వైలెన్స్ కెమెరాల అమరిక ద్వారా రాష్ట్రాన్ని నిఘా నేత్రాల పరిధిలో వుంచుతున్నామన్నారు. అలాగే 40 లక్షల ఎల్ఇడి వీధి బల్బులను ముఖ్యమంత్రి డ్యాష్ బోర్డుకు అనుసంధానించామన్నారు. ప్రతి పాఠశాలల్లోనూ దృశ్య శ్రవణ (వర్చువల్) బోధనా తరగతి గదులను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే డ్రోన్ పరిజ్ఞానంతో నిఘానే కాకుండా, భూగర్భ జలాల లభ్యత వంటి సమాచారాన్ని సులువుగా పొందగలుగుతున్నామన్నారు. ఇందుకోసం డ్రోన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రజల ఇళ్లకు భద్రత కల్పనలో భాగంగా వారికి దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు ఇ-లాకింగ్ సౌకర్యంతో అనుసంధానించి దొంగతనాల నియంత్రణ చేపడుతున్నామన్నారు.

286 ఒప్పందాలు... రూ. 1,74,568 కోట్ల పెట్టుబడులు

విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీఐఐ సౌజన్యంతో విశాఖ వేదికగా మూడోసారి నిర్వహిస్తున్న అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సులో భాగంగా రెండో రోజు ఆదివారం పెట్టుబడుల ప్రవాహం కనిపించింది. వివిధ రంగాలకు చెందిన సంస్థలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సదస్సును శనివారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. తొలి రోజు 77 ఎంవోయూలు చేసుకోగా రూ. 31,546 కోట్లు పెట్టుబడులు రావడం జరిగింది. తద్వారా సుమారు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు ప్రభుత్వం తెలియజేసింది. రెండో రోజు ఆదివారం ఉదయం నుంచి అనేక సంస్థలతో ముఖ్యమంత్రి చర్చా గోష్టి నిర్వహించారు. తదుపరి పలు సంస్థలతో ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. మొత్తం 286 ఎంవోయూలు జరగగా తద్వారా రూ.1,74,568 కోట్ల పెట్టుబడులు రావడం జరిగింది. తద్వారా రూ. 2,86,371 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు.

1. ఏరోస్పేస్, రక్షణ రంగాలలో పది ఒప్పందాలు.. రూ.9,406 కోట్ల పెట్టుబడులు, 6వేల మందికి ఉపాధి అవకాశాలు.

2. టెక్స్‌టైల్స్ రంగంలో 26 ఒప్పందాలు, రూ. 5,337 కోట్లు పెట్టుబడులు. తద్వారా 33,092 మందికి ఉపాధి అవకాశాలు.

3. ఇంధన రంగంలో 20 ఒప్పందాలు.. రూ.80,435 కోట్లు పెట్టుబడులు, 25,011 మందికి ఉద్యోగ అవకాశాలు. 4. ఆహార శుద్ధి రంగంలో 169 ఒప్పందాలు.. రూ.3,534 కోట్లు పెట్టుబడులు, 48,398 మందికి ఉద్యోగ అవకాశాలు. 5. వైద్య ఆరోగ్య రంగంలో 25 ఒప్పందాలు.. రూ. 5,090 కోట్లు పెట్టుబడులు, 4,750 మందికి ఉద్యోగావకాశాలు. 6. మౌళిక వసతుల రంగంలో 15 ఒప్పందాలు.. రూ.43,486 కోట్లు పెట్టుబడులు, 1,12,020 మందికి ఉద్యోగావకాశాలు. 7. ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ రంగంలో రెండు ఒప్పందాలు, రూ.18,220 కోట్లు పెట్టుబడులు, 38వేల మందికి ఉద్యోగావకాశాలు.



పీఎంఐ గణాంకాలే కీలకం

• హోలీ సందర్భంగా శుక్రవారం సెలవు



ముంబై: ఈ వారం స్టాక్ మార్కెట్లకు సూక్ష్మ ఆర్థిక గణాంకాలతో పాటు డాలర్ మారకంతో రూపాయి కదలిక ప్రభావం చూపనున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. శుక్రవారం నాడు హోలీ సందర్భంగా మార్కెట్లకు సెలవు. మార్కెట్లను ఉత్తేజపరిచే అంశాల గురించి ఇన్వెస్టర్లు ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు గ్లోబల్ మార్కెట్లో జరిగే పరిణామాలు కూడా మార్కెట్లపై ప్రభావం చూపుతాయి. ఈ వారంలో క్యూ4 జీడీపీ అంచాలతో పాటు తయారీరంగానికి చెందిన పీఎంఐ గణాంకాలు విడుదల కాను న్నాయని, దాని ప్రభావం కూడామార్కెట్లపై ఉంటుందని మార్కెట్ పండి తులు చెబుతున్నారు.

బుధవారం నాడు తయారీరంగానికి చెందిన పీఎంఐ గణాంకాలు వెల్లడవుతాయి. గత వారమంతా పీఎన్‌బీ స్కాం మార్కెట్లను కుదిపేసింది. దీంతో మార్కెట్లు కాస్తా ఛబడ్డాయి. అయితే బ్యాంకింగ్ వ్యవస్థపై కొంత ప్రభావం చూపినా.. ఈస్కాం దేశ వృద్ధిని అడ్డుకొనంతే తీవ్రంగా ఉం డదని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

ఫ్యాన్సీ లగ్జరీ కారుపై రూ. 40లక్షల డిస్కౌంట్!

గురుగావ్ : ఏదైనా వస్తువు కొంటే రూ.100 లేదా రూ. 1,000, లేదా రూ.10,000 వరకు డిస్కౌంట్ గురించి మనం విని ఉంటాం. కానీ ఇక్కడ గురుగావ్‌లోని బిగ్ బాయిస్ టాయ్జ్ (బీబీటీ) వద్ద ఫ్యాన్సీ బ్రాండెడ్ కొత్త టర్బో చార్జ్డ్ బీఎండబ్ల్యు ఐ8 హైబ్రిడ్ సూపర్‌కారు కొనుగోలు చేస్తే అక్షరాలా రూ.40 లక్షల డిస్కౌంట్ ఇస్తామని ప్రకటించింది. ఈ డిస్కౌంట్‌తో కాంపాక్ట్ మెర్సిడెజ్ కొనుగోలు చేసి ఇంకా కొంత డబ్బు మిగిలించుకోవచ్చు. లేదా సూపర్ సలూన్ మసేరటి క్వాట్రోపోర్టిలో కొనుగోలు చేసుకోవచ్చు. లేదా మారుతి సుజుకి చెందిన ఐదు బలెనోలు కొనుగోలు చేసుకోవచ్చు. గురుగావ్‌లోని లగ్జరీ కార్ల డీలర్ వద్ద అతి పెద్ద సెలెబ్రిటిలు, పారిశ్రామికవేత్తలు క్యూ కడుతున్నారు. క్రికెటర్ విరాట్‌కోహ్లి నుంచి సజ్జన్ జిందాల్ వరకు కస్టమర్లు. రూ.40 లక్షల కంటే మరింత ఎక్కువ డిస్కౌంట్ రూ.1 కోటి వరకు కావాలనుకుంటే కూడా దానికి సిద్ధమేనని బీబీటీ చెబుతోంది. అయితే దీనికి మీరు కాస్తా రాజీపడి 2015 మోడల్ ఇది ఫస్ట్‌హ్యాండే.. కానీ మోడల్ పాతది దానికి రాజీపడితే డీల్ ఫిక్స్ అయినట్లే. కొత్త 2017 వెర్షన్ బీఎండబ్ల్యు ఐ8 ధర రూ.2.6 కోట్లు. అదే 2015 వెర్షన్ అయితే బీబీటీ వద్ద రూ.1.55 కోట్లు మాత్రమే. అలాగే కొత్త బీఎండబ్ల్యు జెడ్4 ధర మార్కెట్లో రూ.82.4 లక్షలు.

అ యితే 2016 వెర్షన్ కారు బీబీటిలో రూ.62.5 లక్షలు మాత్ర మేనని స్ట్రాటజీ ఎంటర్‌ప్రెన్యూర్ జతిన్ అహుజా చెబుతు న్నారు. బిగ్ బాయిస్ టాయిస్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఆయనే. ఆయన చెప్పేదేమిటంటే బల్క్‌లో కార్లను కొ నుగోలు చేసి పెద్దెత్తున కస్టమర్లకు డిస్కౌంట్లు ఆఫర్ చేసి మం చి లాభాలను గడిస్తున్నానని చెబుతున్నాడు. ఉదాహరణకు మసేరటిస్ డీలర్ కంపెనీని మూసివేస్తున్నట్లు ప్రకటించగానే అక్కడికి వాలిపోయి మొత్తం సరకు తీసుకొచ్చి నోరూరించే డిస్కౌంట్లకు ఆఫర్ చేయడంతో కార్లు హాట్‌కేకుల్లా అమ్ముడ పోయాయి. అయితే ఇలాంటి అవకాశాలు ఎప్పుడో కానీ రావని అహుజా చెబుతున్నాడు. నేరుగా తాను మాన్యూఫ్యా క్చరర్ (తయారీదారుడి) నుంచి కార్లను కొనుగోలు చేస్తానని డీలర్ వద్ద కొనుగోలు చేయనని, అందుకే తానుకస్టమర్లకు ఆకర్షణీయమైన డిస్కౌంట్లు ఆఫర్ చేయగలుగుతున్నానని చెప్పాడు. ఈ లగ్జరీ కార్ల కంపెనీలు కూడా తక్కువ ధరకైనా ఉన్న సరకును వదించుకోవాలని చూస్తాయని అహుజా తెలిపాడు. డజన్ల కొద్ద ఫస్ట్ హ్యాండ్ లగ్జరీ కార్లను రిటైల్‌లో విక్రయించానని ఉదాహరణకు బీఎండబ్ల్యు ఐ8, బీఎండబ్ల్యు జెడ్4, మసేరటీ క్వ్రాటాపోర్టో, వోల్వో ఎక్స్‌సీ90లను విక్రయించానని, ఇవన్నీ అధీకృత డీలర్లతో పోల్చుకుంటే చాలా ధరకు విక్రయించానని అహుజా తెలిపాడు గతేడాది సుమారు 100 బ్రాండెక్ కొత్త కార్ల కంటే ఎక్కువే విక్రయించానని వాటిలో వోల్వో, మసేరటీలున్నాయని చెప్పారు. డీలర్ కంపెనీని మూసేస్తున్నట్లు చెప్పగానే 20మసేరటీలను కొనుగోలు చేశానని చెప్పుకొచ్చారు.తన వద్ద బీఎండబ్ల్యు జె4ల స్టాక్ ఉందని గత మూడు నెలల కాలంలో 20 కార్లను విక్రయించానని, ప్రస్తుతం 10 మాత్రమే మిగిలాయని అహుజా అంటున్నాడు. వాస్తవానికి ఈ వ్యాపారం ఎలా ఉంటుందో పరీక్షిం చేందుకే దిగానని.. గతేడాది రూ.200 కోట్ల రెవెన్యూ సాధిం చానని ఢిల్లీ యూనివర్శిటీ నుంచి కెమికల్ ఇంజినీరింగ్‌తో పాటు ఎంబీఏ పూర్తి చేసిన అహుజా చెప్పాడు. కార్లంటే పడి చచ్చే క్రేజ్ ఉన్నందు వల్ల ఈ వ్యాపారంలోకి దిగానని, 2007 నుంచి విదేశాల నుంచిలగ్జరీ కార్లను దిగుమతి చేసుకొని విక్రయిస్తునన్నాడు. సెకెండ్ హ్యాండ్ లగ్జరీకార్ల విషయానికి వస్తే ఫెరారీ, లాంబోర్గిని, రోల్స్‌రాయిస్, బెంట్లీ, అస్టీన్ మార్టిన్ బ్రాండ్‌లు గుర్తుకొస్తాయి. అయితే భారత్‌లో అధికా రికంగా లభించని కార్ల విషయానికి వస్తే హమ్మర్, క్యాడిలాక్, క్రైస్లర్‌లు దొరకవు. ఇవన్నీ తమ బీబీటీలో దొరుకుతాయని. వాటి ధర రూ.1-4 కోట్ల వరకు ఉంటాయని అహుజా చెప్పాడు.సెకండ్ హ్యాండ్ లగ్జరీ కార్ల అమ్మకాలు మన దేశం లో ఏడాదికి 4,500కు విక్రయాలు జరుగుతాయి. మొత్తానికి లగ్జరీ కార్ల మార్కెట్ ఏడాది 39వేల కార్ల విక్రయాలు జరుగుతున్నాయి. వాటిలో మెర్సిడెజ్ బెంజ్, బీఎండబ్ల్యు, ఆడి, వోల్వో, జ్యాగ్వార్ ల్యాండ్ రోవర్‌లు ఎక్కువగా అమ్ముడవుతాయి. సెకండ్‌హ్యాండ్ కారు కొనుగోలు చేసే ముందు అన్నీ పరీక్షలు జరిపి కొనుగోలు చేస్తానంటాడు అహుజా.. కొన్న వెంటనే విక్రయించాలనుకుంటానని, సరకు నిలిబడిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటానని చెప్పాడు. లగ్జరీకారు 25,000 కిలోమీటర్ల దాటితే కొనుగోలు చేయనని.. ఒక వేళ బంపర్ మార్చినా.. ఇన్సురెన్స్ లిటిగేషన్ ఉన్నా దాని జోలికిపోనని.. రూ.50 లక్షల కంటే తక్కువ విలువ చేసే కార్లు విక్రయించనని చెప్పుకొచ్చాడు అహుజా. రూ.1 కోటి పెట్టుబడి పెట్టి లగ్జరీ కారు కొనుగోలు చేయాలనే కస్టమర్ కొన్ని లక్షల విలువ చేసే సెకెండ్ హ్యాండ్ కారుకొనుగోలుకు ఎందుకు మొగ్గుచూపుతాడని ఆయన ప్రశ్నిస్తున్నాడు. తాను ప్రతి 6-8 నెలలకు ఒక కారు మార్చుతానని అహుజా తెలిపాడు.కార్లపై మోజు ఉండే వారికి మాత్రమే తాను కార్లు విక్రయిస్తానని చెప్పాడు. తన కస్టమర్ల జాబితా గురించి వివరిస్తూ.. సరైస్ పూనావాలా, నవీన్ జిద్దాల్, ఫోర్టిస్ హాస్పిటల్స్‌కు చెందిన శివిందర్ మోహన్‌సింగ్, సజ్జన్ జిందాల్‌లున్నారని అహుజా గర్వంగా చెబుతున్నాడు. జిందాల్ తమ వద్ద నుంచి మసేరటికొనుగోలు చేశారని చెప్పాడు. చాలా మంది సంపన్నులకు తమకు ఎలాంటి కారు సరిపోతుందనే విషయం తెలియదని.. వారికి తాము సలహా ఇస్తుంటామని, తమ సలహాను 90 శాతం మంది పాటిస్తారన్నారు. ఇదిలా ఉండగా బీబీటి విస్తరణ బాట పట్టింది.



ఢిల్లీకే పరిమితం కాకుండా త్వరలోనే హైదరాబాద్, ముంబై, కోలకతాలకు వచ్చే రెండేళ్లలో విస్తారిస్తామని చెప్పారు. తాను విక్రయిం చిన కార్లలో 40 శాతం మంది కస్టమర్లు తిరిగి తన వద్దకు రారని.. తన బృందం కస్టమర్ల వద్దకు వెళుతుందని చెప్పా రు. వీరు కస్టమర్లతో సంప్రదించి కార్ల గురించి వివరిస్తుం టారు. రోజుకు ఇద్దరు కస్టమర్లు తమ వద్దకు వస్తుంటారని అన్నారు. 150 మంది అంకితభావం కలిగిన బృందం తన వ ద్ద ఉందన్నారు. జీఎస్టితో కాస్తా ఇబ్బంది పడ్డామన్నారు. జీఎస్టికంటే 3-4 శాతం పన్ను ఉంటే జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత 48 శాతానికి పెరిగిపోయింది. ప్రస్తుతం జీఎస్టిలో 18 శాతానికి సవరించారు. భవిష్యత్తులో అమ్మకాలు జోరందుకుంటాయని అహుజా ఆశాభావంతో ఉన్నాడు.

వడ్డీరేట్ల పెంపు తప్పదా

• క్యూ4లో పెంచే అవకాశం • మోర్గాన్‌స్టాన్లీ అంచనా



న్యూఢిల్లీ : రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా తక్షణమే వడ్డీరేట్లు పెంచపో యినా.. సమీప భవిష్యత్తులో వడ్డీరేట్లు పెంచే అవకా శాలున్నాయని మోర్గాన్‌స్టాన్లీ నివేదికలో పేర్కొంది. ద్రవ్యోల్బ ణం కారణంగా ఆర్‌బీఐ వడ్డీరేట్లను పెంచకుండా యధాతథంగా కొనసాగిం చానికి ఆర్‌బీఐ నిర్ణయించింది. మానిటరీ పాలసీ కమిటి ప్రకటనతో పాటు మినిట్స్‌ను అధ్యయనం చేసిన తర్వాత ఆర్‌బీఐ సమీప భవిష్యత్తులో వడ్డీరేట్లు పెంచడానికి అనుకూలంగా ఉందని తెలుస్తోందని మో ర్గాన్‌స్టాన్లీ పరిశోధన పత్రంలో వెల్లడించింది. మోర్గాన్‌స్టాన్లీ అంచనా ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం 4 త్రైమాసానికి వడ్డీరేట్లు పెంచే అవకాశాలున్నాయని స్పష్టం చేసింది. అప్పటికి రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలున్నాయని వివరించింది. ఎంపీసీ మినిట్స్ ప్రకారం చూస్తే ద్రవ్యోల్బణం పెరగడానికి పలు కారణాలు చూపించింది. రాష్ట్రప్రభుత్వాలు తమ ఉద్యోగులకు ఇంటి అద్దెభత్యంతో పాటు బడ్జెట్‌లో ప్రభుత్వం రైతులకు పంట దిగుబడిపై కనీసమద్దతు ప్రకటించింది. ఇవన్నీ కలిసి ద్రవ్యోల్బణం పెరగడానికి అవకాశాలున్నాయని వివరించింది. కస్ట మ్స్ సుంకంతో పాటు ముడిచమురు ధరలు పెరిగితే నిర్వహణా వ్యయం పెరిగి ద్రవ్యోల్బణం పెరగడానికి పరిస్థితులు దారితీస్తాయని మోర్గాన్ నివేదకలో పేర్కొంది. దీంతో రిటైల్ ద్రవ్యోల్బణం 4.5 శాతం దాటే అవకాశాలున్నాయని అంచనా వేసింది. ఫిబ్రవరి 7వ తేదీన జరిగిన ఆర్‌బీఐ పరపతి సమీక్షలో వడ్డీ రేట్లను యధాతథంగా కొనసాగించిన విషయం తెలిసిందే.

ఈ ఏడాది రూ. 25వేల కోట్ల ఐపీఓలు

• హిందుస్తాన్ ఎయిరోనాటిక్స్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్,



న్యూఢిల్లీ : రాబోయే కొన్ని నెలల్లో సుమా రు రెండు డజన్ కంపె నీలు ఐపీవో మార్కెట్లోకి రానున్నాయి. సుమా రు రూ.25వేల కోట్ల పెట్టుబ డు లు సేకరించానున్నాయి. ఈ నిధ లతో కంపెనీ లు తమప్రాజెక్టులను విస రించుకోవడమో లే దా.. మూల ధనం వ్య యంకోసం వస్తు న్నా యి. హిందుస్తాన్ ఎయిరోనాటిక్స్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, బార్బిక్యూ నేష నల్ హాస్పిటాలిటి, ఫ్లేమింగ్ ట్రావెల్ రిటైల్ లాంటి కంపెనీలు ఐపీవోకు రాను న్నాయి. ఇప్పటికే ఈ కంపెనీలు మార్కెట్ నియంత్రణా సంస్థ సెబికి దరఖాస్తు చేసుకున్నాయి. వాటితో పాటు మరో 20 కంపెనీలు వాటిలో రైట్స్, మిశ్రధా తుని గమ్, బంధన్ బ్యాంకు, ఇండోస్టార్ క్యాపిటల్ ఫైనాన్స్, నెక్స్ జెన్‌ఇూ టెక్నాలజీస్, రౌట్ మొబైల్‌లు కూడా సెబి అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాయి. న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్, అందర్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియాలతో పాటు ఐదు కం పెనీలు ఇప్పటికే ఐపీవోకు వచ్చేశాయి. మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం సెకండరీ మార్కెట్లో షేర్లు ఖరీదైన వ్యవహారంగా మారడంతో మదుపరులు ఐపీ వోకు ఆకర్షితులవుతారని చెబుతున్నారు. 2017లో 36 కంపెనీలు ఐపీవోల ద్వారా రూ. 67వేల కోట్లు సేకరించాయి. చివరగా 2010లో అత్యధికంగా రూ.37, 535కోట్ల వరకు దేశీయ కంపెనీలు నిధులు సేకరించాయి.

రూ.10వేల కోట్ల పెట్టుబడులు వెనక్కి

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకులో వెలుగు చూసిన రూ.11,400 కోట్ల స్కాంతో విదేశీ ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్ల నుంచి ఈ నెల రూ.10వేల కోట్ల వరకు తమ పెట్టుబడులను తరలించుకుపోయారు. కాగా ఈ ఏడాది జనవరిలో ఎఫ్‌పీఐలు రూ.13,780 కోట్లవరకు దేశీయ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాయి. దీంతో పాటు గ్లోబల్ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడం, ద్రవ్యలోటు భారీగా పెరగిపోవడంతో తదితర కారణాల వల్ల విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

బ్రిటన్ ఎస్‌బీఐ పునర్నిర్మాణం

• ఇక నుంచి ఎస్‌బీఐ యూకె లిమిటెడ్



లండన్ : ప్రభుత్వరంగానికి చెందిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఏప్రిల్ నుంచి తమ వ్యాపారాన్ని పునర్వ్యస్థీకరిస్తోంది. బ్రిటన్‌లో ఎస్‌బీఐ తన అనుబంధ సంస్థ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా యూకె లిమిటెడ్ పేరుతో వ్యాపారం నిర్వహిస్తోంది. బ్యాంకు ఆఫ్ ఇంగ్లాండ్ నుంచి మూలధనం కావాల్సినందున కొన్ని రకాల మార్పులు చేయాల్సి వస్తోంది. దీంతో వచ్చే ఏప్రిల్ 1 నుంచి బ్రిటన్‌లోని అన్నీ ఎస్‌బీఐ రిటైల్‌బ్రాంచీలు కొత్తగాబ్రిటన్‌లో రిజిస్టర్ అయిన బ్యాంకింగ్ వ్యవస్థలోకి మారిపోతాయి. ఇప్పటి వరకు ఎస్‌బీఐ భారత్ కంపెనీగా ఉంది. ఇక నుంచి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా యూకె లిమిటెడ్‌గా మారిపోతుంది. మొత్తం 12 రిటైల్ బ్రాంచీల్లో ఏడు లండన్‌లో ఉంటే మిగిలినవి లండన్ వెలుపల ఉన్నాయి. ఇక నుంచి ఈ బ్రాంచీలు ఎస్‌బీఐ యూకె లిమిటెడ్‌గా మారిపోతాయి. రోజువారి లావా దేవీల్లో యధావిధిగా కొనసాగుతాయని సంజీవ్‌చద్దా ఎస్‌బీఐ రిజినల్ హెడ్ యూకె చెప్పారు. తమ కస్టమర్లు డెబిట్ కార్డులతో పాటు ఈ కార్డులనుఇతర బ్యాంకుల్లోనూ వినియోగించుకోవచ్చునని, గతంలో మాదిరిగానే సేవలుపొందవచ్చునని వాటిలో ఎలాంటి తేడా ఉండదని ఆయన తెలిపారు. ఎస్‌బీఐ బ్రిటన్ మార్కెట్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించిందని అందుకే మార్పులు చేశామని ఆయన వివరించారు. ఇదిలా ఉండగా ఎస్‌బీఐని బ్రిటన్‌లో 1921లో లండన్ నగరంలో ప్రారంభించారు. ఎస్‌బీఐకి లండన్‌లో ఏడు బ్రాంచీలున్నాయి. వాటిలో మంచెస్టర్, బర్మింగ్‌హామ్, వోల్వర్‌హామ్‌టన్, లీయిస్టర్, కోవెంట్రీల్లో ఉన్నాయి. ఈ నగరాల్లో భారతీయ సంతతి ఎక్కువగా ఉందని ఎస్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

2020 నాటికి పోషె ఎలక్ట్రిక్ కార్లు

న్యూఢిల్లీ : ఫోక్స్ వ్యాగెన్ గ్రూపునకు చెందిన లగ్జరీ వాహనాల తయారీ కంపెనీ పోషె 2020 ప్రారంభం నాటికి భారత్‌మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలను (ఈవీ)లను తీసుకొస్తున్నట్లు కంపెనీ ఉన్నతాధికారి చెప్పారు. భారత్ మార్కెట్లో పోషె 2012 నుంచి కార్లను విక్రయిస్తోంది. అయితే ఇవన్నీ దిగుమతి చేసుకొని నేరుగా దేశీయ మార్కెట్లో విక్రయిస్తోంది. అయితే కంపెనీకి జర్మనీలో తప్పించి ప్రపంచంలో ఎక్కడా తయారీ యూనిట్ కానీ, అసెంబ్లింగ్ యూనిట్లులేవు. 2020 నాటికి పోషె భారత్ మార్కెట్లో కార్లను విడుదల చేస్తుందని కంపెనీ ఇండియా డైరెక్టర్ పవన్ శెట్టి తెలిపారు. కంపెనీ మిషన్ -ఈ వ్యూహంలో భాగంగా ఈ కార్లనుభారత్ మార్కెట్లోకి తెస్తున్నామని శెట్టి చెప్పారు. కాగా 2016లో దేశీయ మార్కెట్లో 401 యూనిట్లు విక్రయిస్తే 2017 నాటికి ఇవి కాస్తా 434 కార్లకు చేరాయని ఆయన అన్నారు. జీఎస్టి వల్ల కొన్ని మోడల్స్ కార్ల ధరలు పెరిగాయని చెప్పారు. లగ్జరీ, సూపర్‌లగ్జరీ బ్రాండ్‌మార్కెట్లో 1.2 శాతం నుంచి 1.5 శాతం వాటా దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. కంపెనీ త్వరలోనే కొత్త ఎస్‌యూవీ మోడల్ కెయెన్నీ ఈ3, ఈ ఏడాది మూడవ త్రైమాసికంలో విడుదల చేస్తామని చెప్పారు. ప్రస్తుతం మార్కెట్లో కెయెన్నీ, మేకాన్, పాన్‌మెరా, 718 సీరీస్, కేమాన్, బాక్స్‌స్టార్ ఫ్లాగ్‌షిప్ 911ను మార్కెట్లో విడుదల చేశామని దేశవ్యాప్తంగా ఎనిమిది సర్వీస్‌సెంటర్లున్నాయని శెట్టి అన్నారు.



5జీపై టెక్ మహీంద్రా ఆశలు

• బెంగళూరులో ల్యాబ్ • ఇంటెల్‌తో భాగస్వామ్యం



హైదరాబాద్ : వచ్చే ఏడాది (2019)లో దేశీయ మార్కెట్లోకి 5జీ సర్వీసులు అందుబాటులోకి వస్తున్నందున టెక్ దిగ్గజం టెక్ మహీంద్రా ఇప్పటి నుంచే సన్నాహాలు మొదలుపెట్టింది. అమెరికాకు చెందిన చిప్ తయారీ కంపెనీ ఇంటెల్ భాగస్వామ్యంతో బెంగళూరులో ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ టాప్ ఎగ్జిక్యూటివ్ ఒకరు చెప్పారు. ఇదిలా ఉండగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికం (డీఓటి) ఈ ఏడాది జూన్‌నాటికి రోడ్‌మ్యాప్‌ను ఖరారు చేయబోతోంది. కంపెనీ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ సీపీ గుర్నాని మాట్లాడుతూ ఇప్పటికే 30వేల మంది ఉద్యోగులకు నైపుణ్యం కల్పించామని, వీరంతా కొత్త టెక్నాలజీని తేలికగా నిర్వహించే స్థాయికి తీసుకొచ్చామన్నారు. మిగిలిన 75వేల మంది ఉద్యోగులను ఈ కేలండర్ సంవత్సరంలోగా నైపుణ్యం కల్పిస్తామన్నారు. 2019 నాటికి 5జీ టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందని.. దీని కోసం ప్రత్యేకంగా మూలధనం కూడా కేటాయించామన్నారు. ఇంటెల్‌తో కలిసి బెంగళూరులో ల్యాబ్ ఏర్పాటు చేశామని, ఇతర కంపెనీల్లో కూడా ల్యాబ్ ఏర్పాటు చేశామన్నారు. సముద్రం ఒడ్డున (బీచ్) లో ఈత నేర్చుకోలేమని, అందుకే సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ల్యాబ్‌లు ఏర్పాటు చేశామని వివరించారు. మొత్తానికి 5జీ నెట్‌వర్క్‌కు అన్నీ సిద్ధం చేసి ఉం చుకున్నట్లు ఇక్కడ జరుగుతున్న వరల్డ్ కాం గ్రెస్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 2018 సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. 5జీ టెక్నాలజీ కోసం కొత్తగా రిక్రూట్‌మెట్లు ఉంటాయా అని ప్రశ్నించగా.. ఆయన సమాధానం చెప్పడానికి నిరాకరించారు. ఐటి రంగం ఏడాదికి 8 శాతం చొప్పు న వృద్ధి చెందితే నాలుగు శాతం వరకు ఉద్యోగాల్లో నియామకాలు ఉంటాయన్నారు. తన అంచనా ప్రకా రం ఐటి రంగంలో ఉద్యోగాల నియామకాలు నిలిచి పోలేదని రిక్రూట్‌మెంట్లు ఉంటాయన్నారు. తమ కంపెనీలోసుమారు 1.05 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. వచ్చే ఆర్థికసంవత్సరం ఐటి రంగం 7 నుంచి 9 శాతం వృద్ధి సాధిస్తుందని నాస్కా మ్ అంచనా వేయడం బట్టి ఐటి రంగం మంచి వృద్ధి ని సాధిస్తున్నట్లు లెక్క అని ఆయన అభిప్రా యపడ్డారు.

టీవీ ధరలకు రెక్కలు!

• 7శాతం పెరిగే అవకాశం • కస్టమ్స్ సుంకం ప్రభావం



న్యూఢిల్లీ : దేశంలోని అతి పెద్ద టెలివిజన్ తయారీ కంపె నీలు ఉదాహరణ సోనీ, ఎల్‌జీ, పానసానిక్, స్యాంసంగ్‌లు ఎల్ ఈ డీ/ఓఎల్‌ఈడీ టెలివిజన్ సె ట్‌ల ధరలను ఏడు శాతం వరకు పెం చే అవకాశం కనిపిస్తోంది. బడ్జెట్‌లో ప్రభుత్వం ఎక్సైజ్ సుం కం పెంచడమే దీనికి కారణం. కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ అండ్ అప్లియె న్సెస్ మా న్యూఫ్యాక్చరింగ్ అసో సియేషన్ (సెయిమా) ఇప్పటికే ప్రభుత్వంతో చర్చలు జరి పి సుంకాన్ని వెనక్కి తీసుకోవాలని కోరింది. కాగా పానాసానక్ 2-7 శాతం వరకు ఎల్‌ఈ డీ/ఓఎల్‌ఈడీ టెలివిజన్ ధరలను పెంచుతున్నట్లు తెలి పింది. దీంతో రాబోయే రోజుల్లో దీని ప్రభావం అమ్మకాలపై కనిపిస్తుందని పానా సొనిక్ బిజినెస్ హెడ్ నీరజ్ బెల్ తెలిపారు. పరిశ్రమవర్గాల సమాచారం ప్రకారం స్యాంసంగ్ 5-6 శాతం పెంచు తున్నట్లుచెబుతున్నారు. అయితే కంపెనీ ఎండీ కిమ్ ఆన్ కిమ్ మాత్రంపై దీనిపై స్పందించానికి నిరాకరించారు. సోని మాత్రం పరిస్థితిని అధ్యయనం చేసు న్నామని భవిష్యత్తు పెంచేఆలోచనలో ఉన్నట్లు సోని బ్రావియా బిజినెస్ హెడ్ సచిన్‌రాయ్ అన్నా రు. సెయిమా అంచానా ప్రకారం గత రెండు సంవత్సరాల నుంచి ప్యానెల్ పరిశ్రమ అంతంత మాత్రంగానే ఉందని.. తాజాగా సుంకం పెం చడంతో డిమాండ్ తగ్గుతుందని, ఉద్యోగాలపై ప్రభావం పడుతుందని సెయిమా ప్రెసిడెండ్ మనీష్ శర్మ అన్నారు. బడ్జెట్‌లో ప్రభుత్వం దిగుమతి చేసుకొనే ప్యా నెల్స్‌పై సుంకాన్ని 7.5 శాతం నుంచి 15శాతానికి పెంచిం ది. ప్యానెల్స్‌పాటు ఎల్ సీడీ/ఎల్‌ఈడీ/ ఓఎల్‌ఈడీ విడిభాగాల ధరలను 10 శాతం నుంచి 15 శాతానికి పెంచింది.దేశీయ తయారీకంపెనీలు లాభపడతాయని ప్రభుత్వంగా కనిపి స్తోం ది.

రసాయనాల పరిశ్రమ @ 30వేలకోట్ల డాలర్లు


ముంబై : రసాయనాల పరిశ్రమ 2025 నాటికి 300 బిలియన్ డాలర్ల లేదా 30వేల కోట్లకు చేరుతుంది. ప్రస్తుతం ఈ రంగం 147 బిలియన్ డాలర్లు లేదా 14,750కోట్ల డాలర్ల పరిశ్రమ అని కెమిక్సిల్ పేర్కొంది. ఏడాదికి 15-20 శాతం చొప్పున ఈ రంగం వృద్ధి చెందుతోందని రసాయనాల ఎగుమతి ప్రమోషన్‌కౌన్సిల్ (కెమిక్సిల్) చైర్మన్ సతీశ్ వాఘ్ చెప్పారు. పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని, దిగుమతులు తగ్గించుకునేందుకు ప్రభుత్వం కెమికల్ పాలసీ (రసాయనాల విధానాన్ని)ని తయారు చేస్తోందని తెలిపారు.2020 నాటికి దేశం నుంచి రసాయనాల ఎగుమతి లక్ష్యంగా 1800 కోట్లడా లర్లకు పెంచుకోవాలని చూస్తోందని.. ప్రస్తుతం 1200 కోట్ల డాలర్లని ఆయన చెప్పారు. ఈ ఆర్థికసం వత్సరం మొదటిసగ భాగంలోనే ఎగుమతులు 27 శాతం పెరిగి 719 కోట్ల డాలర్లకు చేరాయని వివరించారు. ఆసియా మార్కెట్ల విషయానికి వస్తే రసాయనాల రంగంలో భారత్ మూడవ స్థానంలో, ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఏడవ స్థానంలో ఉం దన్నారు. ప్రభుత్వం తీసుకొన్న కొన్ని నిర్ణయాలవల్ల మంచి ఫలితాలు కనిపిస్తున్నాయన్నారు. రసాయనా ల రంగం పుంజుకోకపోవడానికి కాలుష్య నియం త్రణా బోర్డు కారణమని ఆయన ఆరోపించారు. గత ఐదు సంవత్సరాల నుంచి కొన్ని రసాయనాలు పర్యా వరణానికి హాని కలిగిస్తున్నాయని చెప్పి ఉత్పత్తిని నిలిపివేయించాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశా రు. పెరిగిపోతున్న డిమాండ్‌కు తగ్గట్లు ఉత్పత్తి చేయలేకపోతున్నామని వాపోయారు. పీసీబీ లేదా కాలుష్య నివాణ సంస్థ నుంచి అనుమతులు లభిం చకపోవడంతో ఉత్పత్తి పెంచుకోలేకపోతున్నా మని, దీంతో ఎగుమతులకు గండిపడుతోందని ఆయన వివరించారు. దీని ప్రభావం దేశీయ పరిశ్ర మలపై ప్రభావం చూపుతున్నాయి. చైనా నుంచి పెద్ద మొ త్తంలో దిగుమతి కూడా చేసుకోవాల్సిన పరి స్థితులు ఏర్పడుతున్నాయని వాఘ్ వివరించారు.

వాణిజ్యమం త్రిత్వశాఖ మధ్యకాలికానికి 2015-20 కో సం సూక్ష్మ చిన్న మధ్యతరహాకంపెనీల కొసం బడ్జె ట్లో కొ న్ని ప్రో త్సాహకాలు ప్రకటించింది దీంతో అనుకున్న వృద్ధి రేటు లక్ష్యాన్ని సాధించవచ్చునని పేర్కొ న్నారు.



జాప్యం భారం రూ.1.73 లక్షల కోట్లు

• 213 రైల్వేల ప్రాజెక్టుల ఆలస్యం



న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వ చేపడుతున్న మొత్తం 349 రైల్వే ప్రాజెక్టుల్లో ఐదింట మూడో వంతు ప్రాజెక్టులు ఆలస్యం కొనసాగుతున్నాయి. ఈ ఆలస్యం వల్ల ప్రభుత్వానికి రూ.1.73 లక్షల కోట్ల భారం పడుతోందని కేంద్ర గణాంకాల మంత్రిత్వశాఖ తాజా నివేదికలో పేర్కొంది. మొత్తం 213 రైల్వే ప్రాజెక్టులు వివిధ కారణాల వల్ల ఆలస్యానికి గురవుతున్నాయని గణాంకాల ప్రాజెక్టుల అమలు మంత్రిత్వశాఖ అక్టోబర్ 2017 కోసం తయారు చేసిన నివేదికలో వివరించింది. కాగా గణాంకాల మంత్రిత్వశాఖ రూ.150 కోట్ల వ్యయం అయ్యే ప్రాజెక్టులపై తరచూ అధ్యయనం చేస్తుంటోంది. కాగా 2013 రైల్వే ప్రాజెక్టులపై వాస్తవంగా రూ.123,103.45 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేస్తే... ప్రస్తుతం వివిధ కారణాల వల్ల ఈ ప్రాజెక్టులపై వ్యయం రూ.2,96,496.70 కోట్లకు చేరింది. మొత్తానికి చూస్తే ప్రాజెక్టులపై వ్యయం 140.85 శాతం పెరిగింది. గణాంకాల మంత్రిత్వశాఖ మొత్తం 350 ప్రాజెక్టులపై ఈ ఏడాది అక్టోబర్‌లో మళ్ల సమీక్ష నిర్వహిస్తుంది. మొత్తం 350 ప్రాజెక్టుల్లో 36 ప్రాజెక్టులు 12 నెలల నుంచి 261 నెలల వరకు ఆలస్యం కొనసాగుతున్నాయి. రైల్వేల తర్వాత అత్యధికంగా ఆలస్యం జరుగుతున్న ప్రాజెక్టుల విషయానికివస్తే విద్యుత్ రంగం... ఈ రంగంలో 126 ప్రాజెక్టులను గణాంకాల మంత్రిత్వశాఖ మానిటరింగ్ చేస్తుంటుంది. 43ప్రాజెక్టులపై అదనంగా రూ.58,728.23 కోట్లు అదనపు భారం పడుతుందని పేర్కొంది. మొత్తం 43 విద్యుత్ ప్రాజెక్టులపై వాస్తవంగా రూ.104,449.62 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేస్తే.. ప్రస్తుతం వీటిపై వ్యయం రూ.163,178.45 కోట్లకు చేరింది. 126 విద్యుత్ ప్రాజెక్టులకు గాను 64 ప్రాజెక్టులపై ఆలస్యం రెండు నెలల నుంచి 136 నెలలకు పెరిగిపోయిందని తెలిపింది.

పురుషోత్తంరెడ్డి ఇంట్లో మరోసారి ఏసీబీ సోదాలు

● కోటి విలువ చేసే సొత్తు సీజ్ ● ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హెచ్ఎండిఎ డైరెక్టర్ పురుషోత్తం రెడ్డి ఆస్తుల చిట్టా రోజు రోజుకూ పెరిగిపోతోంది. తనిఖీలకు వెళ్ళిన అధికారులకు ఆస్తుల చిట్టా దొరుకుతూనే ఉంది. తాజాగా బంజారాహిల్స్‌లోని పురుషోత్తంరెడ్డి నివాసంలో ఆదివారం మరోసారి ఎసిబి అధికారులు సోదాలను నిర్వహించారు. పురుషోత్తంరెడ్డి భార్య, కూతురు సమక్షంలో జరిపిన ఈ సోదాలలో సుమారు కోటి రూపాయల విలువ చేసే సొత్తును సీజ్ చేశారు. రద్దయిన నోట్లు రూ. 9 వేలతో పాటు లక్షా అయిదు వేల రూపాయల నగదు, దాదాపు రూ. 20 లక్షల విలువ చేసే చీరలు, 501 అమెరికా డాలర్లు, 265 దుబాయ్ రూబీలు, రూ. 70 వేల విలువ చేసే విదేశీ మద్యం సీసాలతో పాటు రూ. 50 లక్షల విలువ చేసే వజ్రాలు, బంగారు, వెండి వస్తువులను గుర్తించిన అధికారులు సీజ్ చేశారు. ఎసిబి అధికారులు గతంలో ఈ ఇంట్లో సోదాలను నిర్వహించారు. తాజాగా లభించిన సమాచారం మేరకు ఆదివారం మరోసారి అధికారులు సోదాలు నిర్వహించారు. ప్రస్తుతం పురుషోత్తంరెడ్డి ఎసిబి కస్టడీ విచారణను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.





పురుషోత్తంరెడ్డిపై ఇప్పటికే నమోదు చేసిన ఎసిబి చట్టంలోని కేసులతో పాటు తాజాగా మరో కేసు కూడా నమోదైంది. నిబంధనలకు విరుద్ధంగా విదేశీ మద్యం కలిగి ఉన్నారన్న అభియోగంపై ఎక్సైజ్ చట్టంలోని నిబంధనల మేరకు ఎసిబి అధికారులు కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న విదేశీ మద్యంను ఎక్సైజ్ పోలీసులకు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు.

బినామీలపై దృష్టి

పురుషోత్తంరెడ్డి అక్రమాలకు ఇంతకాలం అండగా నిలిచిన బినామీలపై ఎసిబి దృష్టి కేంద్రీకరించినట్లు సమాచారం. రాజకీయంగా పురుషోత్తంరెడ్డికి కొంత మంది పెద్దల అండదండలున్నట్లు దర్యాప్తులో ఆధారాలు భయటపడటంతో వారి పాత్రపై కూడా ఆరా తీస్తున్నారని అంటున్నారు. గతంలో ఎసిబికి పట్టుబడ్డ పురుషోత్తంరెడ్డి రాజకీయ పలుకుబడిని ఉపయోగించి కేసును మాఫీ చేయించుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. అధికారి పార్టీకి చెందిన ఒక ఎంఎల్ఎ అండదండలు సంపూర్ణంగా ఉన్నాయని, ఆయన మద్దతు ఉన్నంత వరకూ తనకెలాంటి ఆపద రాదని గతంలోఅనేక మందితో పురుషోత్తంరెడ్డి అన్నట్లు ఎసిబి గుర్తించింది. దాడులలో బయటపడ్డ ఆస్తులన్నీ పురుషోత్తంరెడ్డివేనా లేక రాజకీయ నాయకులకు ఏమైన వాటా ఉందా అనే విషయాన్ని కూడా ఎసిబి కూపీ లాగుతుందని తెలిసింది. మరో పక్క రాష్ట్ర మంత్రికి కూడా పురుషోత్తంరెడ్డి సమీప బంధువు అని గుర్తించిన అధికారులు, ఆయన పేరుతో ఏమైన లావాదేవీలను పురుషోత్తంరెడ్డి నిర్వహించాడా అన్న కోణంలోనూ విచారణ జరుపుతున్నారు. కోకాపేట, గండిపేట తదితర ప్రాంతాలలోని బినామీలు, బావ మరిది శ్రీనివాస్‌రెడ్డి వ్యాపారాలు, ఆర్జన, ఆస్తులపై మరో సారి అధ్యయనం చేస్తున్నారు.

జాతీయ పక్షులను చంపేస్తున్నారు



అడవిదేవులపల్లి, ప్రభన్యూస్ : జాతీయ పక్షి సంపద అంతరించే దశకు చేరింది. కాపాడుకోవల్సిన సమూహం కఠినంగా వ్యవహరిస్తుంది. వేటగాళ్ళ రూపంలో విలువైన మయూరాలు మృత్యువాత పడుతున్నాయి. అడవుల ఉనికే ప్రశ్నార్ధకమైన పరిస్థితుల్లో ఆహారం కోసమో.. ఆహ్లాదం కోసమో.. గ్రామాల సమీపాలకు.. తోటల ప్రాంతాలకు వెళ్తున్న నెమళ్ళు.. జింకలు కారణాలు ఏవైనా కనుమరుగవుతున్నాయి. అడవులను జంతు సంపదను పరిరక్షించాల్సిన అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. వివరాల్లోకి వెళితే సూర్యాపేట జిల్లా, అడవిదేవులపల్లి మండలంలోని గంద్రాలబోడు అటవీ ప్రాంతంలో ఆదివారం ఎనిమిది నెమళ్ళు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాయి. మృతి చెందిన నెమళ్ళను గుర్తించిన గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలిసినప్పటికి అటవీ శాఖ అధికారులు అలస్యంగా ఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే మృతి చెందిన ఎనిమిది నెమళ్ళలో ఐదు నెమళ్ళను గుర్తు తెలియని వ్యక్తులు మాయం చేశారు. మిగిలిన మూడు నెమళ్ళను మాత్రమే అటవీశాఖ అధికారులు స్వాధీనపరుచుకొని పోస్టుమార్టం చేస్తామని తెలిపారు.

అవినీతి అంతానికి ఉద్యమించాలి

● జాయింట్ పోలీస్ కమిషనర్ లక్ష్మీనారాయణ



వేములవాడ, ప్రభ న్యూస్ : దేశంలో పెట్రేగిన అవినీతినీ, లంచగొండితనాన్ని సమూలంగా నిర్మూలించాలంటే స్వాతంత్రోద్యమం లాంటి మహోత్తరమైన మరో ఉద్యమం రావాల్సిన అవసరం ఉందని మహారాష్ట్ర తానె జాయింట్ పోలీస్ కమిషనర్ జెడి లక్ష్మీనారాయణ అభిప్రాయపడ్డారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో పెరుగుతున్న అవినీతీ, లంచగొండితనాన్ని ఆరికట్టడానికి ఎలాంటి కృషి జరగాలన్న ఆంధ్రప్రభ ప్రతినిధి లాయక్‌పాషా అడిగిన ప్రశ్నకు ఆయన పై విధంగా స్పందించారు. ప్రజల ఆలోచన విధానం మారాలనీ, యువతరానికి అవినీతి లంచగొండితనం వల్ల వచ్చే అనర్థాలూ, జరిగే నష్టాల గురించి చక్కగా చెప్పి, గొప్ప విలువలను ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

సీపీఎస్ రద్దుకు సహకరిస్తా

● పెన్షనర్ల అసోసియేషన్‌కు జానారెడ్డి హామీ



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇబ్బందిగా మారిని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) రద్దుకు సహకరిస్తానని ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి జానారెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘం నేతలకు హామి ఇచ్చారు. రానున్న బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఆయన హామి ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల ఐక్య ఉద్యమం నేతలు ఆదివారం ఉదయం ప్రతిపక్షనేత కుందూరు జానారెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సీపీఎస్ రద్దుకు కాంగ్రెస్ తరుపున అసెంబ్లీలో ప్రస్తావించి, రద్దు చేయించేలా చూడాలని కోరారు. జానారెడ్డిని కలిసిన వారిలో టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొండల్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం రవీందర్, అశోక్ కుమార్, గౌతమినాయుడు, డిటిఎఫ్ నాయకులు వినోద్‌కుమార్ ఉన్నారు. సీపీఎస్ విధానం మూలంగా ఇటు ఉద్యోగులకు, అటు పెన్షనర్లకు తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయని సంఘం నేతలు తెలిపారు. సీపీఎస్ అమలు విషయం రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోనే ఉందని, వారే నిర్ణయం తీసుకోవాలని కేంద్రం చెబుతోందని అన్నారు.సమస్యపై అసెంబ్లీలో తప్పకుండా ప్రస్తావించి అమలు జరగకుండా తన వంతు ప్రయత్నం చేస్తానని జానారెడ్డి హామి ఇచ్చారని ఐక్య ఉద్యమ నేతలు స్పష్టం చేశారు.

మున్సిపల్ భవనాల్లో 'గ్రీన్'నిబంధనలు

● భారీగా తగ్గనున్న విద్యుత్,ఇంధన వనరుల వినియోగం ● పర్యావరణ హితంగా మారనున్న కార్యాలయాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మున్సిపల్ భవనాల్లో గ్రీన్ బిల్డింగ్ నిబంధనలను అమలు చేస్తున్నారు. దీని కారణంగా విద్యుత్, ఇంధన వనరుల వినియోగం భారీగా తగ్గనుంది. ఫలితంగా ఆయా భవనాల విద్యుత్ చార్జీలు కూడా తగ్గనున్నాయి.ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నిబంధనలుగా పిలిచే వీటిని అమలు చేయడం ద్వారా కార్యాలయ భవనాలన్నీ పర్యావరణ హితంగా మారనున్నాయి. విద్యుత్‌లో 30శాతం ఆదా కావడంతో పాటు నీటి వినియోగం కూడా కనీస పరిమాణంలో 20శాతం ఆదాచేయడానికి అవకాశం ఏర్పడుతుంది. కాగా ఉపయోగించిన నీటిని కూడా రీసైకిల్ చేయడం ద్వారా వాటిని ప్రస్తుతం ఉన్న గార్డెనింగ్‌కు ఉపయోగించడం ద్వారా గణనీయ పరిమాణంలో నీటిని ఆదాచేయవచ్చు. అయితే ఈ నిబంధనలను అమలు చేయాలంటే ప్రస్తుతమున్న భవనాల్లో స్వల్పమార్పులు చేయాల్సి ఉంటుంది. సహజ వెలుగులను ప్రసరించే విధంగా చర్యలను చేపట్టాల్సి ఉంటుంది. అలాగే ప్రస్తుత మున్న సాంప్రదాయక విద్యుత్ దీపాల స్థానంలో ఎల్ఇడీ బల్బులను వాడడం, వినియోగంలో ఫ్యాను లు, ఎయిర్ కండీషన్లు తొలగించి ఫైవ్‌స్టార్ రేటింగ్ ఉన్న ఫ్యాన్లు, ఏసీలను నెలకొల్పాల్సి ఉంటుంది. వీటితో పాటు భవన కార్యాలయాల్లో వర్షపు నీటి గుంతలను నిర్మించడం, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసుకోవడం, నీటిని పొదుపుగా వాడడానికి ఎక్కడికక్కడ వాటర్ మీటర్లను ఏర్పాటు చేయడం, ఎకో ఫ్రెండ్లీ భవన నిర్మాణం మెటిరియళ్ళను ఉపయోగించడం, సోలార్ పవర్ ఏర్పాటు తదితర చర్యలను చేపట్టాలి ఉంటుంది. ఈ నిబంధనలను అమలు చేయడం వల్ల మొత్తం గా నలభై శాతం వరకు విద్యుత్, 30 శాతం వరకు నీరు ఆదాకానుంది.కాగా ఈ నిబంధనలను అమలు చేయడంలో జీహెచ్ఎంసీ ఒక అడుగు ముందుకేసింది. పనులను ప్రారంభించే కార్యక్రమాల్లో నిమగ్నమైంది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఎనిమిది అంతస్థుల ద్వారా సువూరు 88వేల చదరపు అడగుల విస్తీర్ణంలో ఉంది. అయితే ప్రధాన కార్యాలయంలో సంవత్సరకాలంలోఒక చదరపు అడుగుల విస్తీర్ణానికి రోజుకు 119 యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతోంది. 20,150 చదరపు అడగుల విస్తీర్ణం కవర్ చేసే విధంగా ఎయిర్ కండీషన్లు పనిచేస్తున్నాయి. ఏసీల వల్ల సంవత్సరానికి 51.76 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. ఇక విద్యుత్ సరఫరాల అంతరాయం ఏర్పడితే జనరేటర్ ద్వారా లక్షా 26వేల మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. అదే విధంగా 510 చదరపు మీటర్ల విస్తీర్ణంలో గ్రీనరి ఉంది. ఇందులో 200 వరకు వృక్షాలు ఉన్నాయి. రోజువారి అవసరాలకు, చెట్లకు కలిపి నెలకు రెండున్నర లక్షల లీటర్ల నీటిని ఉపయోగించడం జరుగుతోంది. అయితే విద్యుత్ వినియోగం, నీటి వాడకాన్ని తగ్గించడం, ఇంకుడు గుంతల నిర్మాణం, నీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటు, గాలి, వెలుతురు అధికంగా వచ్చేలా మార్పులు చేపట్టడం వల్ల కలిగే ఇంధన పొదుపు ఆదారంగా గ్రీన్ బిల్డింగ్ నిబంధనలను అమలు చేసే భవనాలకు సిల్వర్, గోల్డ్, ప్లాటినమ్ రేటింగ్ గుర్తింపును అందజేస్తారు. ఉదాహారణకు ప్రస్తుతం జీహెచ్ఎంసీ భవనంలో చదరపు అడుగుకు 119 యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతోంది. దీనిని 80 యూనిట్లకు తగ్గిస్తే సిల్వర్ రేటింగ్ ఇస్తారు.

ప్రస్తుతం ఈ ప్రక్రియ జీహెచ్ఎంసీలో శరవేగంగా సాగుతోంది. దీనితో పాటు ప్రధాన టేబుళ్ళను తొలగించడం, పాత గోడలన్నింటికీ కలరింగ్ వేయడం వంటి చర్యలను ఇప్పటికే చేపట్టారు. ప్రధాన కార్యాలయంతోపాటు జోనల్, డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల్లో 80 కిలో వాట్ల సామర్థ్యంఫుల సోలార్ పవర్ ప్లాంట్‌లను ఏర్పా టు చేసే ప్రక్రియ జరుగుతోంది. నగరంలో ఇప్పటి వరకు సుమారు 60 భవ నాల కు గ్రీన్‌బిల్డింగ్‌లుగా మార్చడం జరిగింది. పలు ఐటీ కంపెనీలు, కార్పొరేట్ సంస్థల కార్యాలయాల భవనాలలో మాత్రమే పాటిస్తున్న నిబంధలనల అమలు మున్సిపల్ శాఖలోనూ మొదలైంది. ఆ వరసలో జీహెచ్ఎంసీకి ముందువరసలో ఉండ డం విశేషం. ఈ చర్యలతో కొద్ది రోజుల్లోనే మున్సిపల్ భవనాలకు కొత్త సొగసులు రానున్నాయని తెలుస్తోంది.

ఎమ్మార్పీఎస్ బంద్‌కు సీపీఎం మద్దతు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు గాను మార్చి 13న చేపట్టిన 24 గంటల రాష్ట్ర బంద్‌కు సీపీఎం పార్టీ మద్దతిస్తున్నదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదివారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత బహుజన లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ నల్లా సూర్యప్రకాశ్‌రావును కలిసి బంద్‌కు మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మార్పీఎస్ ఇచ్చిన బంద్‌కు క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు భాగస్వామ్యులయ్యే విధంగా చూడాలని విజ్ఞప్తి చేయగా తమ్మినేని సానుకూలంగా స్పందించారు.దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు వర్గీకరణకు మద్దతిస్తున్నా బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు పెట్టకుండా జాప్యం చేస్తున్నదని ఆయన మండిపడ్డారు. తమ్మినేని, నల్లా సూర్య ప్రకాశ్‌రావులను కలిసిన వారిలో మంద కృష్ణమాదిగతో పాటు సీనియర్ పాత్రికేయులు సాదం వెంకటేశ్ యాదవ్, ప్రజా వాగ్గేయకారుడు మాష్టార్జీ, మాదిగ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్, డాక్టర్ శంకర్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగం ఎరచూపి అఘాయిత్యాలు



సోమాజిగూడ, ప్రభ న్యూస్ : అమాయక యువతులకు తన గోదాంలో పని కల్పిస్తానని పిలిచి అఘాయిత్యాలకు పాల్పడుతున్న సంఘటన కడప జిల్లా ఏపీ ఆప్కాబ్ చైర్మన్ శ్రీనివాస్ తండ్రి గుజ్జుల రామకృష్ణ ఉదంతం వెలుగులోకొచ్చింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బాధితురాలు అంజూమ్ అనే మైనర్ యువతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ ఆప్కాబ్‌చైర్మన్ గుజ్జుల శ్రీనివాస్ తండ్రి రామకృష్ణ(70) స్థానిక ముస్లిం యువతికి పని కల్పిస్తానని నమ్మబలికి అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆరోపించారు. తనకు అక్కడ జరిగిన అన్యాయానికి బాధపడి ఆత్మహత్యకు ప్రయత్నించానని, కానీ సకాలంలో పక్కవాళ్లు ఆస్పత్రిలో చేర్పించడం వలన బతికి పోయానన్నారు. తనలాంటి యువతులు అలాంటి మృగాళ్లకు బలికావద్దని ప్రాణభయంతో నగరానికి చేరుకుని మీడియాను ఆశ్రయించినట్లు తెలిపారు. తనకు సరైన న్యాయం చేసి మృగాన్ని కఠినంగా శిక్షించాలని బాధితురాలు డిమాండ్ చేశారు.

యువతిని మోసగించిన కేసులో కో డైరెక్టర్ అరెస్ట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సినిమాల్లో రాణించాలని ఎన్నో కలలతో హైదరాబాద్‌కు చేరిన యువతికి సీరియళ్లలో మంచి పాత్రలిప్పిస్తానని నమ్మించి సదరు యువతిని లొంగదీసుకుని పరారైన సినీ కోడైరెక్టర్‌ను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. సినిమాల్లో నటించి, మంచి పేరు, సెలబ్రిటీ హోదా, డబ్బు సంపాదించాలని ఎన్నో కలలతో హైదరాబాద్ చేరిన శ్రీకాకుళం యువతికి స్టేషన్ ఘనాపూర్‌కు ప్రాంతానికి చెందిన సినీ కో డైరెక్టర్ పి.రాజశేఖర్ పరిచయమయ్యాడు. సీరియళ్లలో మంచి పాత్రలిప్పిస్తానని నమ్మించాడు. ఆ పరిచయాన్ని అడ్డం పెట్టుకుని, ఆమెను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని కల్లబొల్లి కబుర్లు చెప్పి ఆమెను లోబరుచుకున్నాడు. ఇచ్చిన మాట ప్రకారం తనను వివాహం చేసుకోవాలని బాధిత యువతి అతనిపై ఒత్తిడి తేవడంతో రాజశేఖర్ గత డిసెంబర్‌లో పరారయ్యాడు. అతని జాడ తెలియని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

బీసీలకు బడ్జెట్‌లో నిధులు పెంచాలి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రానున్న బడ్జెట్ సమావేశాల్లో బీసీలకు నిధులను పెంచాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. రూ. 20వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్‌ను అమలు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలన్నారు. కొద్ది రోజుల క్రితం బీసీల సమస్యలు తెలుసుకోవడం ప్రభుత్వం నిర్వహించిన బీసీ ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీల సమావేశం నివేదికను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల సమస్యల పరిష్కారం, నిధుల పెంపుపై చర్చించడం కోసం మార్చి 2న వివిధ బీసీ సంఘాలు, కుల సంఘాలతో హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నట్టు ఆయన ఆదివారం మీడియాకు తెలిపారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టేలా చూడాలన్నారు. జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించేబిల్లుకు పార్లమెంటులో ఆమోదం కల్పించేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

పదోన్నతులకు షెడ్యూల్ ప్రకటించాలి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో గత రెండేళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు లేక పోవడంతో తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టిఎస్ యుటిఎఫ్) డిమాండ్ చేసింది. సర్వీస్ రూల్స్ త్వరగా వచ్చేలా చూడాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రాములు, ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం హైదరాబాద్‌లోని చెన్నుపాటి భవన్‌లో జరిగింది. సమావేశంలో ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు నాగటి నారాయణ, ఎం సంయుక్త, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు పి మాణిక్‌రెడ్డి, ఏ నర్సిరెడ్డి, కె సోమశేఖర్, సిహెచ్ దుర్గాభవాని, శాంతి కుమారి, ఎంకె దత్ పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి

● ఆత్మహత్యల నుంచి రైతులను కాపాడాలి ● మాజీ ఎంపీ యలమంచిలి శివాజి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని రైతునేత మాజీ ఎంపీ యలమంచిలి శివాజి అన్నారు.ఆదివారం తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్ సంస్థ ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలనుంచి రైతు కుటుంబాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శివాజి మాట్లాడుతూ దేశ జనాభాలో 72శాతం ఉన్న రైతు కుటుంబాల సంఖ్య 63శాతానికి పడిపోయిందన్నారు. పంటలకు లాభసాటి ధరలు దక్కటం లేదన్నారు. జీవన ప్రమాణాల్లో గ్రామాలకు పట్టణాలకు మధ్య అంతరం పెరిగిపోతోందన్నారు. బ్యాంకులు ఏకంగా వ్యవసాయం అన్న పదానికి నిర్వచనమే మార్చేశాయన్నారు. వ్యవసాయ కోటాలో రైతులకంటే పారిశ్రామిక వేత్తలకే కోట్లాది రూపాయల రుణాలు ఇస్తున్నాయన్నారు. దేశంలో 24రకాల పంటలకే కనీస మద్దతు ధరలు ఉన్నాయన్నారు. అందులో ప్రధానంగా వరి గోధుమ , పత్తి వంటివాటికే మద్దతు ధర లభిస్తోందన్నారు. పరిశ్రమల్లో నష్టం వస్తే ఉదారంగా ఆదుకనే ప్రభుత్వాలు , బ్యాంకులు అదే వ్యవసాయంలో రైతులు నష్టపోతే మాత్రం ఆదుకునేందుకు ముందుకు రావటం లేదన్నారు. పత్రికలు , ప్రసార సాధనాల్లో వ్యవవసాయ సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వటం లేదన్నారు. అత్యధికశాతం ప్రజలు ఆధారపడ్డ వ్యవసాయాన్ని మీడియా యాజమాన్యాలు చిన్నచూపు చూస్తున్నాయన్నారు. సమాజానికి వాచ్‌డాగ్‌గా పనిచేయటం అంటే ఇదేనా అని మీడియాను నిలదీశారు. మెగసేసే అవార్డు గ్రహీత రిటైర్ట్ ఐఏఎస్ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ వ్యవసాయ రంగ సమస్యలపట్ల ప్రభుత్వాలు శ్రద్ద చూపాలన్నారు. పంటసాగులో మంచి విత్తనాలు అందేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మాజీ సంపాదకులు పొత్తూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత పదేళ్ళుగా రైతుల ఆత్మహత్యలు పెరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు ఇచ్చే సాయం సరిపోవటం లేదన్నారు. అంతే కాకుండా ఆత్మహత్యలు చేసుకున్న రైతుకుటుంబాల్లో కొన్ని కుటుంబాలకు మాత్రమే ప్రభుత్వ సాయం అందుతోందన్నారు. రాజకీయ పార్టీలు రైతుల ఆత్మహత్యలకు సంబందించిన పరిహారాన్ని ఎన్నికల ప్రణాళికలో స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్ అధ్యక్షులు రమా మేల్కోటె, జర్నలిస్ట్‌భాషా సింగ్, మహిళా రైతు హక్కుల వేదిక నేత ఆశాలత, మానవహక్కుల నేత జీవన్ కుమార్ , రైతు స్వరాజ్య వేదిక నేత కిరణ్ విస్సా, రెయిన్‌బో హోం ప్రతినిధి అనురాధ, విల్సన్ ,కొండల్ రెడ్డి, వంటల సంజయ్, శ్రీనివాస్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు ఈ సందర్భంగా చెక్కులు పంపిణీ చేశారు. అన్నదాతలకు చేయూత నిద్దాం, మనం ఉన్నామనే భరోసానిద్దాం , రైతు ఆత్మహత్యలు నివారిద్దాం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

సర్పంచ్‌లకే చెక్ పవర్?

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పంచాయతీరాజ్ చట్టానికి కీలక సరవరణలు తీసుకోస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో సర్పంచులకే పూర్తి అధికారాలు కట్టబెట్టేలా చర్యలు చేపడుతోంది. ఇకపై చెక్‌పవర్‌ను సర్పంచులకే అప్పగించాలని నిర్ణయించింది. గ్రామాభివృద్ధికి నిధులను ఖర్చు చేసే అంశంలో కీలకమైన చెక్ పవర్ ప్రస్తుతం సర్పంచ్‌కు పంచాయతీ కార్యదర్శికి కలిపి ఉమ్మడిగా ఉంది. ఇపుడు ప్రభుత్వం సర్పంచులకే పూర్తిగా చెక్ పవర్ అప్పగించాలని నిర్ణయించింది. ఇక గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్ కాలపరిమితిని కూడా పెంచాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం రొటేషన్ పద్ధతిలో ప్రతి ఐదేళ్లకొకసారి రిజర్వేషన్ మారుతోంది. దీన్ని పదేళ్లకు పెంచేలా నిబంధనలు రూపొందిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమల్లో ఉంది. ఈ రిజర్వేషన్లను 50శాతానికి పెంచాలని ఆలోచిస్తున్నారు. తుదిమెరుగుల్లో ఉన్న పంచాయతీరాజ్ ముసాయిదా బిల్లును ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

థియేటర్స్ బంద్‌కు టాలీవుడ్ నిర్మాతల సంపూర్ణ మద్దతు

హైదరాబాద్, ఆంధ్రప్రభ :సినిమా థియేటర్స్ బంద్ తప్పదా? బంద్ తప్పనిసరైతే పరిశ్రమపై ఆధారపడ్డ వేలమంది సంగతేంటి? దక్షిణాది సినిమాను శాసిస్తున్న క్యూబ్, యూపీఓ సంస్థల దోపిడీకి చెక్‌పెట్టేది ఎవరు? డిజిటల్ సిస్టమ్‌తో తలకుమించిన భారాన్ని మోస్తున్న నిర్మాతల బతుకుల్లో వెలుగు నింపేది ఎవరు? ఒకప్పుడు ప్రొజెక్టర్ సిస్టమ్‌తో థియేటర్‌లో సినిమాలు నడిపించేవారు. పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ప్రొజెక్టర్ స్థానంలో డిజిటల్ సిస్టమ్ వచ్చింది. ఆ విషయంలో థియేటర్స్ ముందుకు రాకపోవడంతో ఎక్విప్‌మెంట్‌ను తామే అమర్చి అందుకు అయ్యే ఖర్చుని కొంచెం కొంచెంగా తీసుకుంటామని చెప్పాయి సదరు సంస్థలు. ఇందుకు ఐదేళ్ల గడువు తీసుకున్నారు. ఐదేళ్లు దాటిపోయినా రేట్లు తగ్గించలేదు సరికదా.. ఇంకా పెంచుకుంటూ వెళ్తున్నారు. దీంతో ఆ ఖర్చు నిర్మాతలకు మోయలేని భారంగా మారింది. దీంతో దక్షిణాదిలోని నాలుగు భాషల నిర్మాతల సంఘాలు ఒక జాయింట్ యాక్షన్ కమి టీగా ఏర్పడి బెంగళూరులో తుది చర్చలు జరిపారు. అవి కూడా ఫలిం చకపోవడంతో మార్చి 2 నుంచి థియేటర్స్ బంద్‌కు పిలుపునిచ్చారు. దక్షిణాది నిర్మాతల జేఏసీ నిర్ణయంతో మార్చి 2 నుంచి థియేటర్స్ బంద్ కానున్నాయి.

బయటపడ్డ నిజాం కాల సొరంగం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ డబీర్‌పురాలో సొరంగం బయటపడ్డ ఘటన కలకలం రేపుతోంది. ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ఈ సొరంగం బయట పడింది. సొరంగంలో నిజాం కాలం నాటి ఫిరంగి తూటాలు లభ్య మయ్యాయి. సమాచారం తెలుసున్న ప్రజలంతా ఆ సొరంగాన్ని వీక్షించేందుకు భారీ ఎత్తున తరలివచ్చారు. ఘటన తెలుసుకున్న పోలీసులు, పురావస్తు శాఖ అధి కారులతో కలిసి డబీర్‌పురాకు చేరుకున్నారు. ఆ సొరంగాన్ని పరిశీలించారు. ఆ సొరంగం గురించి పునరావస్తు శాఖ అధికారులు పరిశోధన ప్రారంభించారు. అసలు ఈ సొరంగం ఎప్పుడు, ఎవరు తవ్వారు అనే అంశాలను తెలుసుకునే పనిలో పడ్డారు పురావస్తు శాఖ అధికారులు. అంతేకాదు, సొరంగంలో ఇంకా ఏమైనా వస్తువులు వున్నాయా? అని పరిశీలన చేస్తున్నారు. కాగా, ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో సొరంగం వెలుగుచూడటంతో ఆ ప్రాంత స్థానికులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సైతం ప్రజలు పెద్ద ఎత్తున ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించడం గమనార్హం. సొరంగంలో కనిపించిన ఫిరంగి తూటాలను అధికారులు స్వాధీనం చేసుకు న్నారు. సొరంగంకు సంబంధించి పూర్తి సమాచారం.

ఎస్‌జీటీకి 97శాతం హాజరు

● చాలా కేంద్రాల్లో 100శాతం హాజరు ● నేడు స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌తోపాటు

ఆంగ్ల మాధ్యమ గణితం, సాంఘికశాస్త్రం పరీక్షలు

ఉదయం పరీక్షకు హాజరయిన విద్యార్థులు

జిల్లా	దరఖాస్తు	హాజరు	హాజరు శాతం
హైదరాబాద్	20,145	18,497	91.9
రంగారెడ్డి	17,128	16,738	97.8
మేడ్చల్	18,701	18,200	97.4

మధ్యాహ్నం పరీక్షకు హాజరయిన విద్యార్థులు

జిల్లా	దరఖాస్తు	హాజరు	హాజరు శాతం
హైదరాబాద్	10,932	10668	97.18
రంగారెడ్డి	8703	8630	99.16
మేడ్చల్	9571	9321	97.38

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల భర్తీ కోసం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ నియామక పరీక్ష(టిఆర్‌టి)ల్లో భాగంగా ఆదివారం సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు పరీక్ష జరిగింది. ఎస్‌జిటి పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. ఉదయం ఎస్‌జిటి తెలుగు మీడియం పరీక్ష జరగగా, మధ్యాహ్నం ఎస్‌జిటి ఇంగ్లీష్ మీడియం పరీక్ష జరిగింది. పరీక్ష ఓఎంఆర్ పద్దతిలో జరిగింది. హెచ్ఎండీఏ పరిధిలోని 38 కేంద్రాల్లో పరీక్ష సజావుగా జరిగిందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కార్యదర్శి ఏ వాణిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షకు 95.7 శాతం మంది హాజరు కాగా... మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 97.9 శాతం మంది హాజరయ్యారు. చాలా కేంద్రాల్లో 100 శాతం మంది పరీక్షకు హాజరయ్యారని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పడిన తరువాత నిర్వహించిన పరీక్షల్లో ఎస్‌జిటి పరీక్షలకు 100 శాతం మంది హాజరయ్యారని కార్యదర్శి ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం స్కూల్ అసిస్టెంట్.. ఇంగ్లీష్ సబ్జెక్టు పరీక్ష, మధ్యాహ్నం స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ మీడియం గణితం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులకు పరీక్ష నిర్వహించనున్నారు. మొత్తం 10 కేంద్రాల్లో పరీక్షను నిర్వహించనున్నారు. పరీక్షకు ఉదయం 6985 మంది దరఖాస్తు చేసుకోగా... మధ్యాహ్నం పరీక్షకు 4912 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో గణితం పరీక్షకు 2519 మంది ఉండగా సాంఘిక శాస్త్రానికి 2393 మంది దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం జరిగే పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు.

ఇక్ఫాయ్‌లో జాతీయ సెమినార్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఇక్ఫాయ్ యూనివర్సిటీలో 27, 28 తేదిల్లో జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. ఉన్నత విద్యారంగంలో నాణ్యమైన విద్య అనే అంశంపై రెండు రోజులపాటు జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్టు యూనివర్సిటీ డైరక్టర్ బ్రాండింగ్ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ సదస్సును హైదరాబాద్ క్యాంపస్‌లో ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. సదస్సును న్యాక్ సహకారంతో నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

సీఎం చేతుల మీదుగా లాయర్లకు ఆర్థికసాయం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని అర్హులైన న్యాయవాదులకు సీఎం కె చంద్రశేఖరరావు చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్ నిర్ణయించింది. అదే విధంగా 500 మంది యువన్యాయవాదులకు శిక్షణా తరగతులు నిర్వహించాలని తీర్మానించింది. ఆదివారం హైకోర్టు అడ్వకేట్ జనరల్ కార్యాలయంలో ట్రస్ట్‌చైర్మన్, అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన ట్రస్ట్ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె రామకృష్ణారావు,న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్ రావు, కార్యదర్శి రామాంజనేయులతో పాటు ట్రస్ట్ సభ్యులు గుడిమల్ల రవికుమార్, మరో 20 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 18 వేల మంది న్యాయవాదులకు హెల్త్ కార్డులు వర్తింపజేయాలని నిర్ణయించారు. దీని ద్వారా రూ.2 లక్షల బీమా వర్తిస్తుంది. ప్రమాద బీమా పథకం కింద చనిపోయిన న్యాయవాదుల కుటుంబాలకు రూ. 10 లక్షలు, గాయపడిన వారికి కొంత ఆర్థిక సహాయం సీఎం చేతుల మీదుగా ప్రగతిభవన్‌లో పంపిణీ చేయాలని నిర్ణయించారు.

తక్షణమే కాల్పులు విరమించాలి

• ఐరాస నిర్ణయాన్ని స్వాగతించిన సెక్రటరీ జనరల్



ఐక్యరాజ్యసమితి: సిరియాలో 30 రోజుల పాటు కాల్పులను విరమించాలని ఐక్యరాజ్యసమితి (ఐరాస) భద్రతా మండలి చేసిన డిమాండ్‌ను ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ స్వాగతించారు. తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి రావాలన్నారు. తిరుగుబాటుదారుల స్వాధీనంలో ఉన్న ఈస్టర్న్ ఘౌటాపై సిరియా యుద్ధ విమానాలు దాడులు చేస్తున్న నేపథ్యంలో సంధి తక్షణమే ఎటువంటి ఆలస్యం లేకుండా అమలు జరగాలని భద్రతా మండలి ఏకగ్రీవంగా డిమాండ్ చేసింది. సిరియా ప్రజలకు మానవీయ సహాయం ఎటువంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా జరగడానికి వీలుగా ఈ తీర్మానం తక్షణమే అమలు జరగాలని గుటెరస్ పిలుపునిచ్చినట్లు ఐరాస అధికార ప్రతినిధి డుజారిక్ వెల్లడించారు. సామాన్య ప్రజలను కాపాడవలసిన బాధ్యత అన్ని పక్షాలకు ఉందని గుటెరస్ చెప్పారని పేర్కొన్నారు.


దాడిచేస్తే ప్రతీకారం తప్పదు

• అమెరికాను హెచ్చరించిన కిమ్



సియోల్: అమెరికా, ఉత్తరకొరియా దేశాల మధ్య చాలాకాలంగా మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో తమపై అమెరికా ఆంక్షల విధింపునకు సిద్ధపడటాన్ని ఉత్తరకొరియా తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ఆదివారం తెలిపింది. తమపై ఆంక్షలను అమలు చేస్తే దానికి 'యుద్ధ ప్రకటన'గానే తాము పరిగణించాల్సి వస్తుందని మరోసారి హెచ్చరించింది. నిషేధిత అణ్వాయుధ కార్యక్రమాలను ఉత్తరకొరియా తిరిగి చేపట్టకుండా నిరోధించేందుకు అమెరికా తాజాగా మరింత కఠినమైన ఆంక్షలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించటంపై ప్యాంగ్యాంగ్ స్పందించింది. తమకు భయపడే యుఎస్ ఇలా ఆంక్షలు పెడుతోందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. యుఎస్ పెట్టబోతున్న ఆంక్షల వల్ల ఉత్తరకొరియాతో సంబంధమున్న దాదాపు 50కి పైగా షిప్పింగ్ కంపెనీలు, ఓడలు, వర్తక వ్యాపారాలు ప్రభావితమయ్యే అవకాశముంది. అమెరికా తమ దేశంపై దుందుడుకు చర్యలకు పాల్పడితే తాము ప్రతీకారం తీర్చుకుని తీరుతామని ఉ.కొరియా యుఎస్‌ని హెచ్చరించింది. అమెరికా దాడులను ఎదుర్కొనేందుకు తమకు అణ్వాయుధాలు ఉన్నాయని తెలిపింది. అయితే, ఉ.కొరియాపై భారీ స్థాయిలో అమలుచేయనున్న ఆంక్షలు సరైన ఫలితాలను ఇవ్వని పక్షంలో మరింత కఠినమైన ఆంక్షలు, చర్యలకు పూనుకుంటామని ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో ఉ.కొరియా ఈమేరకు ప్రతి హెచ్చరిక చేయడం ప్రాధాన్యతనిస్తోంది.

రష్యాపై హ్యాకింగ్ ఆరోపణలు



యుఎస్: వింటర్ ఒలింపిక్స్ కంప్యూటర్లను రష్యా హ్యాక్ చేసిందని అమెరికా తీవ్ర ఆరోపణలు చేసింది. దక్షిణ కొరియాలో జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్‌లో అధికారులు ఉపయోగించే వందలాది కంప్యూటర్లను రష్యా హ్యాక్ చేసి, వాటిలోని విలువైన సమాచారాన్ని దోచుకుంటోందని తీవ్ర ఆరోపణలు చేసింది. వింటర్ ఒలింపిక్స్ ప్రారంభ వేడుకల సందర్భంగా ఫిబ్రవరి 9న రష్యన్ మిలటరీ గూఢచారులు హ్యాకింగ్‌కు పాల్పడినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా, గతంలో డోపింగ్ ఆరోపణల కారణంగా రష్యన్ బృందంలోని సభ్యులపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ) నిషేధం విధించిన విషయం విదితమే. దీంతో రష్యా నుంచి తక్కువమంది క్రీడాకారులు ఈ వింటర్ ఒలింపిక్స్ క్రీడలకు హాజరయ్యారు. దీనికి ప్రతీకారంగా రష్యన్ గూఢచారులు హ్యాకింగ్‌కు పాల్పడ్డారని అమెరికా ఆరోపించింది. నేడు జరగనున్న ముగింపు వేడుకలను పర్యవేక్షించనున్నామని అమెరికా ప్రకటించింది. అయితే, అమెరికా చేసిన ఆరోపణలను రష్యా ఖండించింది.

ఉగ్రదాడిలో పోలీస్ మృతి



శ్రీనగర్: ఉగ్రవాదులు పోలీస్ శిబిరంపై జరిపిన విచక్షణ రహితంగా కాల్పుల్లో ఒకరు మృతి చెందారని అధికారులు తెలిపారు. ఈ ఘటన సెంట్రల్ కాశ్మీర్లోని బుద్గాం జిల్లాలో చార్ ఈ షరీఫ్ ప్రాంతంలో జరిగిందన్నారు. ఉగ్రవాదులు చార్ ఈ షరీఫ్ ప్రాంతంలోని సూఫీ షేక్ నూరుద్దిన్ దర్గా వద్దగల పోలిస్ పోస్టుపై విచక్షణా రహితంగా కాలుపులకు పాల్పడ్డారన్నారు. ఈ ఘటనలో పోలీస్ కానిస్టేబుల్ కుల్తార్‌సింగ్‌కు తీవ్రగాయాలవటంతో అతడిని వెంటనే వైద్యకోసం ఆసుపత్రిలో చేర్చామన్నారు. అనంతరం కానిస్టేబుల్ ప్రాణాలు విడిచారని పోలీసులు తెలిపారు.

పాక్ దుశ్చర్యలతో ఆరుగురి మృతి

జమ్ము కాశ్మీర్లోని రాజౌరి జిల్లాలో నియంత్రణ రేఖవద్ద గత పదినెలలుగా పాక్ కాలుపుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి చేసిన దాడులలో ఇప్పటివరకు ఆరుగురు సామాన్యపౌరులు మరణించగా, మరో 13మంది తీవ్రగాయాలకు పాల్పడ్డారని ఆదివారం అధికారులు వెల్లడించారు. నౌషెరా, మంజాకోట్ సెక్టార్లలోని సరిహద్దు ప్రాంతంలో ఎక్కువశాతం నష్టం జరిగిందని రాజౌరి జిల్లా అభివృద్ధి కమిషనర్ షాహిద్ ఇక్బాల్ చౌదరి విలేఖరులకు తెలిపారు. మే1,2017నుంచి ఫిబ్రవరి 25,2018 మధ్యకాలంలో 169 ఇళ్లు, 12 ప్రభుత్వ భవనాలు ధ్వంసం అయ్యాయని చౌదరి తెలిపారు. నియంత్రణ రేఖ వెంబడి 4,600మంది ప్రజలు గత పదినెలలు కాలంలో వలస వెళ్లిపోయారన్నారు. స్థానిక అధికారులు 86అండర్‌గ్రౌండ్ బంకర్లను ప్రజల రక్షణ కోసం నిర్మించారని అయినా వలసలు మాత్రం ఆగలేదని ఈ ప్రాంత ప్రజలు తమ నివాస ప్రాంతాలను వదిలి పాక్ దుశ్చర్యలకు తట్టుకోలేక ప్రజలు భయభ్రాంతులకు గురై దూరంగా తరలి పోతున్నారన్నారు.ఈ ప్రాంతంలోని 80స్కూళ్లను ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా మూసివేశామన్నారు.

నవ భారతానికి నారీ శక్తి

• అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం

• మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి

• పరిపూర్ణ స్త్రీత్వంతోనే పరిపూర్ణ స్వరాజ్యం

• మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ



'రన్ ఫర్ న్యూ ఇండియా' మారథాన్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ: ప్రతీ పనిలో మహిళల భాగస్వామ్యం ఉండేలా ప్రతీ భారతీయుడి ప్రాథమిక విధి అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ప్రతీ నెల చివరి ఆదివారం ప్రజలతో తన మనసులోని బావాలను పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమం ప్రధాని ప్రసంగిస్తూ..మహిళలు శక్తివంతంగా.. సాధికారత కలిగి, అన్నింటిలో సమాన అవకాశాలు కల్పించడం కోసమే న్యూ ఇండియా ఎదురుచూస్తోందన్నారు.మహిళా శక్తి నేడు వారి ఆత్మవిశ్వాసం, స్వీయ అధికారంపై ఆధారపడి ఉందన్న ప్రధాని.. భారత నారీ తాను మాత్రమే రాణించకుండా దేశాన్ని,సమాజాన్ని కూడా అభివృద్ధి బాటలో పయనింపజేస్తోందన్నారు. ప్రస్తుతం దేశం మహిళాభివృద్ధి నుంచి మహిళా నేతృత్వాభివృద్ధి వైపు దూసుకెళ్తోందని ప్రధాని కొనియాడారు. మనిషి తన నిత్యజీవితంలోని ప్రతీ రంగంలో మహిళల భాగస్వామ్యానికి ప్రాధాన్యతనివ్వడం ప్రాథమిక విధి అని.. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సాంఘీక, ఆర్థికాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రస్తావిస్తూ.. స్వామి వివేకానంద వాక్కులను ఉటంకించారు.

పరిపూర్ణ స్త్రీత్వంతోనే పరిపూర్ణ స్వరాజ్యం
అన్న వివేకానందుడి మాటల్ని మనం నిజం చేయాల్సిన అవసరముందన్నారు. మహిళతోనే పురుషులకు గుర్తింపు రావడమనేది సంప్రదాయంగా వస్తున్నదని..యశోద- నందన్,కౌసల్య - నందన్, గాంధారి- పుత్ర వంటి పేర్లు వారివారి మాతృమూర్తులతోనే వచ్చినవని గుర్తుచేశారు. ఈనెల 28 తేదీని భారత్ జాతీయ నిశబ్ద దినంగా పాటిస్తోందని.. సత్యం కోసం తీవ్రమైన అన్వేషణ జరుగుతోందని నొక్కిచెప్పారు. శాస్త్రీయ ఆవిష్కరణలకు ఈ సంవత్సరం ఎంతో ముఖ్యమైనదన్న ప్రధాని గుర్తు చేశారు.ఎందుకు, ఎక్కడ, ఎలా అనే వాటికి సమాధానం లభించేవరకు విశ్రాంతి తీసుకోవద్దని అన్నారు.

భద్రతకు ప్రాధాన్యతనివ్వడం

మార్చి 4న జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. మనం ఒక వేళ భద్రత విషయంలో జాగ్రత్తగా లేకుండా మన జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించలేం. అలాంటి అలవాట్ల ఫలితంగా విపత్తు సమయంలో ఎన్నో కష్టాలు ఎదుర్కోవాల్సి రావచ్చు అని అన్నారు. ప్రజలు రోడ్డుపై వెళ్తున్నప్పుడు గుర్తింపు చిహ్నాలన్నింటిపై ఉన్న మాటలను చదువుతారు కానీ..ఆ తర్వాత ఆ సందేశాలను మరచి భద్రతను గాలికొదిలేస్తారు అని అన్నారు.మానవ తప్పిదాలవల్లే విపత్తులు సంభవిస్తున్నాయని.. మనం మన వరకే కాకుండా సమాజ క్షేమాన్ని కాంక్షించాలని పిలుపునిచ్చారు.

వడదెబ్బలతో జాగ్రత్త

గత మూడేళ్లుగా వడగాల్పుల వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.2017లో వడగాల్పులు, వడదెబ్బ కారణంగా దేశంలో 220 మంది మృతి చెందినట్లు అధికారిక లెక్కలు చెబుతున్న నేపథ్యంలో ఈ ఎండాకాలంలో ప్రజలు ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్త ప్రారంభించిన గోబర్ ధాన్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యర్థాలతో బయోగ్యాస్ ద్వారా స్వచ్ఛ శక్తి ఉత్పత్తి అవుతుందన్నారు. ప్రపంచంలోని పశువుల సంఖ్యలో భారత్ అగ్రస్థానంలో ఉందని..దేశంలోని 300మిలియన్ల పశువుల ద్వారా వచ్చే వ్యర్థాలను బయోగ్యాస్‌గా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.గోబర్ ధాన్ యోజన పథకం కింద పశువుల వ్యర్థాలను సేకరించేందుకు ఆన్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కసరత్తు జరుగుతోందని మోడీ చెప్పారు. పశువ్యర్థాల సేకరణ, రవాణా, అమ్మకం ద్వారా కూడా కొత్త ఉద్యోగాల కల్పన జరుగుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల సోదరీమణులు స్వయం సహాయక గ్రూపులు, కో ఆపరేటివ్ సొసైటీలు నెలకొల్పి అవకాశాలను అందిపుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే వారంలో జరిగే హోలీ పండగ అందరి జీవితాలను రంగుల మయంగా మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

48 ఏళ్లు..48 నెలలు తేడా తెలుసుకోండి



• కాంగ్రెస్‌పై ప్రధాని తీవ్ర విమర్శలు


• హస్తం పాలనలో అభివృద్ధి దూరమౌతోందని మండిపాటు

పుదుచ్చేరి: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోడీ మరోసారి నిప్పులుచెరిగారు. 48 ఏళ్ల కుటుంబ పాలనకు..48 నెలల ఎన్డీఏ పాలను ఒక్కసారి సరిపోల్చుకోవాంటూ ప్రజలకు సూచించారు. పుదుచ్చేరిలో బీజేపీ నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించిన మోడీ.. నాలుగు దశాబ్దాల కుటుంబ పాలనకు.. నాలుగేళ్ల ఎన్డీఏ పాలనకు చాలా తేడా ఉందని అన్నారు. కాంగ్రెస్.. ఎన్డీఏ పాలనలో సాంధించిన ప్రగతిని మేధావులు చర్చించాల్సిన అవసరముందన్నారు. నెహ్రూ, ఇందిరా, రాజీవ్ ల పాలనకు తమ పాలనకు ఉన్న తేడాను ప్రజలు ఇప్పటికే గుర్తించారని.. కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో కాంగ్రెస్ పాలన కారణంగా తక్కువ అవస్థాపన జరుగుతోందని ఇది కాంగ్రెస్ కల్చర్ కు నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో పుదుచ్చేరి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్న మోడీ ..రవాణా, సమన్వయంలోనూ వెనకబడిందన్నారు. భారత్ ప్రపంచానికే ఆధ్యాత్మిక గమ్యస్థానమని ప్రధాని మంత్రి నరేంద్రమోడీ స్పష్టం చేశారు. యుగ యుగాలుగా, భారతదేశం ప్రపంచానికి ఆధ్మాత్మిక కేంద్రంగా బాసిల్లుతోందన్నారు. పుదుచ్చేరికి ఆరు కిలోమీటర్ల దూరంలోని ఆరోవిల్లే లో అంతర్జాతీయ టౌన్‌షిప్ జూబ్లీ వేడుకలకు హాజరైన ప్రధాని... ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచిన మతాలకు భారత్ పుట్టినిల్లు అని అన్నారు. అరబిందో అధ్యాత్మిక నాయకత్వంతో నేటికీ మనకు స్ఫూర్తి కలిగించారని మోడీచెప్పుకొచ్చారు. ఆరోవెల్లేలోని అరబిందో ఆశ్రమాన్ని సందర్శించిన ప్రధాని గత ఐదు దశాబ్దాలుగా ఆరోవెల్లే సాంఘీక, సాంస్కృతిక.. విద్య, ఆర్థిక, అధ్యాత్మిక, ఆవిష్కరణలకు కేంద్రంగా మారిందని కొనియాడారు. స్త్రీ, పురుషులు, చిన్నా,పెద్ద తేడా లేకుండా ఈ ఆధ్యాత్మిక కేంద్రాన్ని సందర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆరేవిల్లే ఆధ్యాత్మిక కేంద్రం సమగ్ర మానవాళికి చెందిందని అభివర్ణించిన ప్రధాని.. ఇక్కడ సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రాచీన భారత వసుదైక కుటుంబాన్ని గుర్తు చేస్తున్నాయని చెప్పారు. 1968లో 124 దేశాల ప్రతినిధుల సమక్షంలో ప్రారంభమైన ఆరోవెల్లెలో ప్రస్తుతం 49 దేశాలకు చెందిన 2400 నివాసాలకు కేంద్రమైందన్నారు.

బీజేపీ అగ్రనేతలతో 28న మోడీ భేటీ

న్యూఢిల్లీ: బీజేపీ అగ్రనేతలతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 28వ తేదీన భేటీ కానున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జరిగే ఈ సమావేశంలో పార్టీకి చెందిన ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు పాల్గొంటారు. లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవడం, వ్యవస్థాగత సన్నాహాలు గురించి చర్చిస్తారు. 'ఒకే దేశం.. ఒకేసారి ఎన్నికలు' గురించి కూడా చర్చించే అవకాశం ఉంది. ఈ అగ్రనేతలకు పంపిన లేఖలో 5 అంశాలను పేర్కొన్నట్లు, వాటిపై సమగ్ర నివేదికలను తీసుకొని రావాలని ఆదేశించినట్లు సమాచారం.

చైనా భాషపై జవాన్లకు పాఠాలు



భోపాల్: చైనా సరిహద్దుల్లో విధులు నిర్వహించే జవాన్లకు డ్రాగన్ సైన్యంతో ఎదురయ్యే భాషా అడ్డంకులు త్వరలోనే తొలగిపోనున్నాయి. వివాదం తలెత్తినప్పుడు వారితో సంప్రదింపులు జరిపేందుకు వీలుగా భారత ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ) జవాన్లు చైనా భాషను నేర్చుకుంటున్నారు. బోర్డర్ దగ్గర చైనా సైన్యంతో సంప్రదింపులు కోసం భారత మధ్యప్రదేశ్‌లోని సాంచీ యూనివర్సిటీ ఆఫ్ బుద్ధిస్ట్ ఇండిక్ స్టడీస్‌లో ఐటీబీపీ జవాన్ల కోసం స్పెషల్‌గా చైనా భాషపై ఏడాది పాటు సర్టిఫికెట్ కోర్సును అందిస్తోంది. ఈ కోర్సును ఐటీబీపీ జవాన్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ సర్టిఫికెట్ కోర్సును గత ఏడాది ఇద్దరు ఐటీబీపీ ఇన్స్పెక్టర్లతో పాటు కొంతమంది జవాన్లు పూర్తి చేశారు. ప్రస్తుతం మరో 25 మంది జవాన్లు మాండరీన్‌ను నేర్చుకునేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ రాజేశ్ గుప్తా వెల్లడించారు. 2016-17 విద్యాసంవత్సరంలో నలుగురు ఐటీబీపీ జవాన్లు మాండరీన్ సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఐటీబీపీ జవాన్లకు అవసరమైన అంశాలను ఈ కోర్సు ద్వారా నేర్పుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సిలబస్‌ను హిందీ, ఇంగ్లిష్, చైనా భాషల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మూడు భాషల్లో వాక్యాలను తయారు చేసి, చిత్రాలతో సహా ముద్రించడం వల్ల సులభంగా అవగాహన చేసుకోవచ్చని తెలియజేశారు. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న 25 మందికి వచ్చే జులై నుంచి తరగతులు ప్రారంభమవుతాయని రాజేశ్ గుప్తా తెలిపారు. బౌద్ధమతంలోని అంతర్ దృష్టిని కూడా ఈ కోర్సు అందజేస్తుంది. ఇండో-చైనా సరిహద్దుల్లోని బౌద్ధులతోనూ మమేకం కావడానికి ఇది సహకరిస్తుందని ఆయన తెలిపారు. చైనా సైన్యంతో సంప్రదింపులు జరపాలంటే అందుకు భాష ఇబ్బందికరంగా మారుతుందని గతేడాది కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

కాపలాదారు కామ్ అయ్యారే..!.

• అవినీతి నేతలను పక్కన బెట్టుకుని మాపై విమర్శలా?

• నీరవ్ స్కామ్‌పై మౌనమేల?

• కర్నాటక పర్యటనలో ప్రధాని మోడీపై రాహుల్ విమర్శలు



బగల్కోటే: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ కర్నాటకలోని మారుమూల ప్రాంతాలను కూడా చుట్టేస్తున్నారు. మరోసారి అధికారమే లక్ష్యంగా విస్తృతంగా పర్యటనలు చేస్తున్న రాహుల్ గాంధీ.. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలోని బ్యాంక్‌ల స్కామ్‌లనే విమర్శనాస్త్రాలుగా మార్చుకున్నారు.మూడు రోజుల పర్యటనలో భాగంగా కర్నాటకలో పర్యటిస్తున్న రాహుల్.. దేశానికి తాను కాపలాదారుగా అభివర్ణిచుకున్న ప్రధాని మోడీ.. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. మోడీజీ తన కర్నాటక పర్యటనలో అవినీతి గురించి మాట్లాడారు. తనను దేశానికి ప్రధానమంత్రిగా కాకుండా కాపలాదారుడిగా చూడాలన్నారు.మరి ఇప్పుడెందుకు మౌనం వహిస్తున్నారు అని ఉత్తర కర్నాటక జిల్లాలు విజపుర, బగల్‌కోటే పర్యటనలో విమర్శించారు. బీజేపీ అవినీతి పాలనతో ప్రజలు విసిగిపోయే కాంగ్రెస్‌కు పట్టంకట్టారన్న విషయాన్ని ప్రధాని మరిచిపోయారా అని ప్రశ్నించారు.

బీజేపీ మాజీ సీఎం యడ్యూరప్ప అవినీతి కేసులో జైలుకెళ్లొచ్చారు. అలాంటి వారి పక్కన కూర్చొని మోడీ అవినీతి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా కుమారుడు రూ. 50వేలను మూడు నెలల్లో రూ.80 కోట్లుగా మార్చడం అవినీతికాదా అని మండిపడ్డారు.కొందరు దొంగలు ప్రధాని మోడీ సహకారంతోనే నల్లధనాన్ని తెల్లగా మార్చుకుంటున్నారని రాహుల్ విమర్శించారు. ఎన్నికల హామీలను ప్రధాని గాలికొదిలేదిలేని ప్రధాని ఉపాన్యాసాలతోనే సరిపెట్టుకుంటున్నారని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్యకర్తలతో రాహుల్ మాటామంతి

రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో నూతనోత్తేజం నిపేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కసరత్తు చేస్తున్నారు.

ఇకనుంచి బూత్ లెవల్ కార్యకర్తలతోనే రాహుల్ స్వయంగా మాట్లాడనున్నారు. ఇందుకోసం ఏఐసీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.కార్యకర్తలు, అధినేత మధ్య మాటామంతి కోసం శక్తి అనే సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. మార్చి రెండోవారంలో ఈ వ్యవస్థ రూపుదిద్దుకోనుంది. కిందిస్థాయి కార్యకర్తలు అధినేతతో స్వయంగా మాట్లాడితే రెట్టించిన ఉత్సాహంతో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తారని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ అవినాష్ పాండే తెలిపారు.


రాహుల్ గాంధీ నా లీడర్ కాదు: హార్దిక్

కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ తనకు నాయకుడు కాదని గుజరాత్ పటేల్ సామాజికవర్గం నేత హార్దిక్ పటేల్ అన్నారు. రాహుల్ గాంధీ తన సోదరి ప్రియాంక, బావ వాద్రాలకు అనుకూలంగా వ్యవహరిన్నారని ఆరోపించారు. వ్యక్తిగతంగా రాహుల్ గాంధీ అంటే నాకు ఇష్టమే కానీ.. నా లీడర్‌గా కాదు. అని హార్దిక్ చెప్పుకొచ్చారు.


సీఆర్పీఎఫ్.. బైక్ అంబులెన్సులు



రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో సిఆర్పీఎఫ్ దళాల ఆధ్వర్యంలో బైక్ అంబులెన్సులు నిర్వహించనున్నారు. వైద్యబృందం సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) సాయుధ బలగాలు సాయంతో బైక్‌లపై పర్యటించి బీజాపూర్ జిల్లాలోని 70గ్రామాల ప్రజలకు వైద్యసౌకర్యం అందించనున్నారు. ఈ సందర్భంగా 85వ సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ కమాండెంట్ సుధీర్‌కుమార్ విలేఖరులతో మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల క్రితమే బైక్‌లను మేము సమకూర్చుకున్నాం. వీటిని యాంటీ నక్సల్ ఆపరేషన్లకు వినియోగించాలని భావించామన్నారు. ఫోరువీలర్స్ వాహనాలు నక్సల్ ఆపరేషన్లుకు ఉపయోగించటం వల్ల మావోయిస్టులు వాహనాలును టార్గెట్ చేసే అవకాశం ఎక్కువగా ఉండటంతో టూ వీలర్స్ బైక్‌లను ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నామన్నారు. అనంతరం టూవీలర్స్ బైక్‌లను అనారోగ్యంతో బాధ పడుతున్న గ్రామస్థులకు వైద్య సౌకర్యం కలిపించేందుకు ఉపయోగించాలన్న ఆలోచనతో ఈ కార్యక్రమం రూపొందించామన్నారు. వైద్యుడితోపాటు ఒక పారామెడికల్ అసిస్టెంటు బైక్‌అంబులెన్స్ ద్వారా సేవలు అందిస్తారన్నారు. బీజాపూర్ బెటాలియన్ కేంద్రంగా వైద్యసేవలు అందిస్తున్నామన్నారు.



వార్దా: మహారాష్ట్రలోని సేవాగ్రామ్ సందర్శనలో భాగంగా బాపు కుటిలో ఉపరాష్ట్రపతి వెంకయ్య ధ్యానముద్ర



ఆగ్రా: లాస్ ఏంజిల్స్‌కి చెందిన నుపూర్ డ్యాన్స్ అకాడమీ బృందం తాజ్‌మహల్ వద్ద కథక్ నృత్య ప్రదర్శన



మీరట్: సామూహిక శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) కార్యకర్తలు

రైతు ఆత్మహత్యలపై ధృవీకరణ సరళతరం!

- 14 సర్టిఫికెట్లు 5కు తగ్గింపు
- త్రిసభ్య కమిటీ నివేదిక సిద్ధం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పంట సాగులో పెట్టుబడి ఖర్చులు ఏటేటా పెరిగి పోతున్నాయి. పంటల ఉత్పాదక పెరగక పోగా పండిన పంటలకు కూడా లాభ సాటి ధరలు దక్కటం లేదు. పంటలపై పెట్టిన పెట్టుబడి కూడా రాక అప్పుల పాలవుతన్న రైతులు మానసిక వత్తిళ్లకు లోనవు తున్నారు. తలెత్తుకుని తిరిగే రైతు పదిమందిలో తలదించుకుని బతకలేక చివరకు ఆత్మహత్య చేసుకుని తనువు చాలిస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్న మవుతోంది. చివరకు ఆకుటుంబం పరిస్థితి చావలేక బతకలేక అన్నట్టు జీవశ్చవంగా మారు తోంది. ఇలాంటి పరిస్థితులు ఒక్క తెలంగాణకో పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికో పరిమితం కాలేదు. దేశ మంతటా ఇదే పరిస్థితి నెలకుంది. ఈ నాలుగేళ్ల కాలంలోనే దేశమంతటా ఆరు లక్షల మంది రైతులు ఆత్మ హత్యలు చేసుకున్నట్టు రామన్ మెగసెసె అవార్డు గ్రహీత విల్సన్ గణాంకాలతో సహా వెల్లడించారు. ఒక్క తెలంగాణ రాష్ట్రం లోనే 3400 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుని ప్రాణాలు కోల్పోయారు. రైతులు వ్యవ సాయంలో అప్పులభారం పెరిగి వాటిని తీర్చే దారిలేక మాన సికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడితే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ఆర్థికంగా పరిహారం అందచేస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో అయితే టీఆర్ఎస్ ప్రభుత్వం ఆరు లక్షల రూపాయలు, ఏపీలో అయితే అక్కడి ప్రభుత్వం రూ.5లక్షలు పరిహారంగా ఇస్తుంది. అయితే ఈ పరిహారం పొందటంలోనే బాధిత రైతు కుటుంబాలకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆత్మ హత్య చేసుకున్న రైతు కుటుంబం ప్రభ్వుం నుంచి పరిహారం పొందేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న నియమ నిబం ధనలు, సర్టిఫికెట్లు, ఇతర సంబం ధింత పత్రాలు పొందటం ఆ కుటాంబాలు అల విమాలిన పనిగా మారుతోంది. మృతి చెందిన రైతు ఏవి ధంగా ప్రాణాలు కోల్పోయారన్నది నిర్ధా రిస్తూ పోష్టుమార్టం రిపోర్టు, పోలీసుల నుంచి ఎఫ్ఐఆర్, గ్రామ స్థాయిలో పంచ నామా, వీఆర్వో సర్టిఫికెట్, అప్పులకు సంబందిచిన బాండ్లు ఇతర ధృవీకరణ పత్రాలు, హెల్త్ సర్టిఫికెట్, రేషన్ కార్డ్, ఆధార్ కార్డు, భూమి వివరాలతో కూడిన పాస్ బుక్, భూమి వారసత్వ సర్టిఫికెట్, కౌలు రైతు లయితే కైలు దారు కార్డు, ఎమ్మార్వో సర్టిఫికెట్ దరఖాస్తుకు జతపరచాల్సి ఉంటుంది. వీటన్నింటితోపాటు చివరగా ఆర్డీవో, డీఎస్పీ, వ్యవసాయాధికారితో కూడిన కమిటి నివేదిక కలెక్టర్లుకు, అక్కడినుంచి ప్రభుత్వాని చేరాల్సివుంది. ఇన్నేసి రకాల సర్టిఫికెట్లు తీసుకురావటం సమస్యగా మారింది.

వచ్చే ఏడాదీ బ్యాగు బరువు తప్పదా..!

- అన్ని జిల్లాల్లో సమావేశాలే జరగలేదు
- ఉన్నత పాఠశాలల్లో 10 కిలోల బరువు
- ప్రాథమిక పాఠశాలల్లో 6 కిలోల బరువు
- ఉత్తర్వుల అమలుకు ప్రైవేటు స్కూల్స్ ససేమిరా?
- ఎటూ తేల్చని విద్యాశాఖ



హైదరాబాద్,ఆంధ్రప్రభ: స్కూల్ పిల్లవాడు మోసే బ్యాగు బరువు వచ్చే ఏడాది కూడా తగ్గేలా లేదు... స్కూల్‌కెళ్లే విద్యార్థులు మోస్తున్న బ్యాగు బరువు ఎక్కువగా ఉందని... దానిని తగ్గించాలని భావించిన సర్కార్ బ్యాగు బరువును తగ్గించడం కోసం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబం దించిన ఉత్తర్వులను పాఠశాల విద్యా శాఖ రూపొందించింది. ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపయో గించాల్సిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాల సంఖ్యను నిర్ధా రిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దాంతోపాటు ప్రాథమిక పాఠ శాల విద్యార్థులకు హోం వర్క్ అవసరం లేదని పేర్కొంది. వాటిని ప్రభుత్వ పాఠశాలలతోపాటు, ప్రైవేటు స్కూల్స్‌కూడా తప్పకుండా అమలు జరపాలని ఉత్తర్వులో పేర్కొంది. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు వ్యతిరేకంగా ఉన్నాయి. పాఠశాల విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసి మూడు నెలలు దాటినా ఇప్పటి వరకు అందుకు సంబంధించిన అవగాహన సదస్సులు మాత్రం జరగలేదు.

పూర్తికాని అవగాహన సదస్సులు...

స్కూల్ బ్యాగుల బరువుపై ముందుగా విద్యార్థుల తల్లి దండ్రులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు అవగాహన కల్పించాలని పాఠశాల విద్యా శాఖ భావించింది. ప్రైవేటు యాజ మాన్యాలు ఒక్కో సబ్జెక్టుకు కనీసం 4 నోటు పుస్తకాలను ఉపయోగించేలా ప్రణాళికను రూపొందించింది. ఇలా చూసుకుంటే అన్ని సబ్జెక్టులకు కలిపితే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాల బరువు కాస్త హైస్కూల్ విద్యార్థులకు 10 కిలోలకు పైగా, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 6 కిలోలక్టపైగా ఉంటుంది. ఈ నేపథ్యంలో మొదట ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలకు స్కూల్ బ్యాగుల బరువుపై అవగాహన కల్పించాలని భావించారు. ప్రభుత్వం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపా ధ్యాయులకు కూడా అవగాహన కల్పించాలని నిర్ణయిం చారు. కానీ హైదరాబాద్, కరీంనగర్ జిల్లాల్లో త ప్ప మిగిలిన జిల్లాల్లో అవగాహన సదస్సులు నిర్వహించలేదు. స్కూల్ బ్యాగు బరువును తగ్గించాలని కోరుతూ ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలతో పాఠశాల విద్యా శాఖ అధికా రులు సమావేశం నిర్వహిస్తే అందులో తక్కువ నోటు పుస్తకాలను తెచ్చు కోవాలని విద్యార్థులకు చెబితే తల్లి దండ్రులు స్కూ ల్‌లో సరిగా పాఠాలు చెప్పడం లేదని భావిస్తారని, అందుకే తాము అలాంటి ప్రయత్నం చేయలేకపోతున్నామని సమాధానం చెప్పారు. దీనిపై ఇప్పటి వరకు పాఠశాల విద్యా శాఖ నుంచి ఎటువంటి స్పష్టమైన ఉత్తర్వులు కూడా ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలకు జారీ చేయలేదు.



ప్రభుత్వ స్కూల్స్‌లోనూ తప్పడం లేదు...

ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు బ్యాగు బరువు కాస్త ఎక్కువగానే ఉంది. ప్రభుత్వ స్కూల్స్‌లోనే హైస్కూల్ వారికి 10 కిలోల వరకు, ప్రైమరీ స్కూల్ వారీగి 6 కిలోల వరకు బ్యాగుల బరువు ఉంటుంది. స్కూల్ బ్యాగుల్లో పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలతోపాటు వాటర్ బాటిల్, స్నాక్స్, మధ్యాహ్నం లంచ్ బాక్స్, రైటింగ్ ప్యాడ్, కం పాస్ బాక్స్ వంటివి కూడా ఉంటున్నాయి. కార్పొరేట్, ప్రైవేటు స్కూల్స్‌లో విద్యార్థులను రోజు అన్ని పుస్తకాలను తీసుకొచ్చు కోవాలని యాజ మాన్యాలు కోరుతున్నాయి. దీంతో ప్రతి రోజు వారు 10 నుంచి 12 కిలోల బరువును మోయాల్సి వస్తోంది. ఇప్పటి వరకు బ్యాగు బరువుపై ఉన్న ఉత్తర్వులపై స్పష్టమైన నిర్ణయాన్ని ప్రైవేటు స్కూల్స్ ప్రకటించక పోవడంతో వచ్చే ఏడాది కూడా స్కూల్ బ్యాగు బరువు తగ్గేలా లేదు.ప్రభుత్వ స్కూల్స్‌లో కూడా స్కూల్ బ్యాగు బరువును తగ్గిస్తూ ఇచ్చిన జీవోలను తప్పకుండా అమలు చేయాలని నిర్ణయం తీసుకోలేదు.

ఆరోగ్య సమస్యలు వస్తాయంటున్న నిపుణులు

విద్యార్థులు మోసే బరువుల మూలంగా వారు తీవ్ర ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందని, భవిష్యత్‌లో విద్యార్థు లకు ఆరోగ్య సమస్యలు సైతం వచ్చే ప్రమాదం ఉందని మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బరువులను తగ్గిస్తే వారు చదవడంపై ఎక్కువ శ్రద్ధ చూపే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రిబ్యునళ్లు అవసరం

- సమావేశంలో రెవెన్యూ, న్యాయనిపుణులు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో భూవివాదాల పరిష్కారానికి పటిష్ట వ్యవస్థను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని, వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆదివారం నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. దేశంలో భూవివాద పరిష్కార వ్యవస్థలు, రెవెన్యూకోర్టులు అనే అంశంపై నల్సార్ విశ్వవిద్యాలయం, తెలంగాణ రెవెన్యూ మాసపత్రిక సంయుక్తంగా ఈ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ)వ్యవస్థాపక అధ్యక్షులు వి లచ్చిరెడ్డి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్‌రావు మాట్లాడుతూ, భూవివాదాలపై తహసీల్దార్లు, ఆర్డీఓలు ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీల్ చేసుకోవడానికి జిల్లా స్థాయిల్లో ప్రత్యేకంగా ట్రిబ్యునల్స్ ఉండాలని సూచించారు. పాత చట్టాలను ప్రక్షాళన చేసి ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కొత్త చట్టాలు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.నల్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ, అన్ని శాఖల్లో కంటె రెవెన్యూ శాఖ కీలకమైందని, ఈ శాఖ పటిష్టంగా ఉంటే సామాన్యులకు మేలు జరుగుతుందన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బీజీ రెడ్డి మాట్లాడుతూ, భూ వివాదాల పరిష్కారానికి మూడంచెల వ్యవస్థఉండాలని సూచించారు. తహసీల్దార్, ట్రిబ్యునల్స్, హైకోర్టు ఉండాలని చెప్పారు. నల్సార్ వర్సిటీ ప్రొఫెసర్ ఎం సునీల్ కుమార్ మాట్లాడుతూ,దేశంలో 68 శాతం, రాష్ట్రంలో 68 శాతం కేసులు భూవివాదాలకు సంబంధించినవేనని అన్నారు. భూవివాదాల వల్ల ఏటా ప్రభుత్వం రూ.3,000 కోట్ల ఆదాయం కోల్పోతోందని, ప్రజలు రూ. 35,000 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ అసోసియేషన్ అధ్యక్షులు లచ్చిరెడ్డి మాట్లాడుతూ, భూ వివాదాల పరిష్కారానికి ఉత్తరప్రదేశ్, ఒడిషా రాష్ట్రా లు నూతన చట్టాలు తీసుకువచ్చాయని ,వాటి వల్ల వివాదాల పరిష్కారం సులభతరమవుతోందన్నారు.

ప్రతిష్టాత్మకంగా మారిన మెట్రో భద్రత

- సీఐఎస్ఎఫ్‌కు అప్పగించేందుకు మొగ్గు చూపుతున్న అధికారులు
- వ్యయంపై అంచనాకు అధ్యయనం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ నగరానికి మణిహారంగా నిలువనున్న మెట్రో రైల్ భద్రతపై అధికారులు దృష్టిసారించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ ప్రాజెక్టు మొదటి దశలో భాగంగా ఉప్పల్ నుంచి మియాపూర్ వరకు సేవలు అందుబాటులోకి వచ్చాయి. దాదాపు 30 కిలో మీటర్ల మెట్రో మార్గంలో నిత్యం వేలాది మంది ప్రయాణం చేస్తున్నారు. త్వరలోనే మిగతా రెండు కారిడార్లను ప్రారంభించేందుకు పనులు చకా చకా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మెట్రో భద్రత, ప్రయాణికులకు రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులు సమాయాత్తమవుతున్నారు. ఇందుకోసం మెట్రో రైల్ అధికారులతో భేటీ అయి తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు. మెట్రో భద్రత విషయంలో గతంలో పలు పర్యాయాలు సమావేశమైనప్పటికీ తుది నిర్ణయం తీసుకోలేదు. వాస్తవానికి మెట్రో భద్రతను ప్రత్యేక భద్రతా దళం (ఎస్‌పిఎఫ్)కు అప్పగించాలని మొదట్లో భావించారు. కానీ దాడులు జరిగితే సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు కొంత ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయని అధికారులు ఆ నిర్ణయాన్ని పక్కకు పెట్టారు.

హైదరాబాద్ అత్యంత సున్నితమైన ప్రాంతం. దేశంలో ఎక్కడ ఉగ్రవాద దాడులు జరిగినా దాని మూలాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో హైదరాబాద్‌లో భయటపడుతున్నాయి. రెండేళ్ళ క్రితం హైదరాబాద్‌లో ఏకంగా ఎనిమిది మంది ఐసిస్ ఉగ్రవాదులను ఎన్ఐఎ అరెస్టు చేసింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో భద్రతకు ప్రాధాన్య మివ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇందుకు తోడుగా హైదరాబాద్ పలు ఉగ్రవాద సంస్థల హిట్ లిస్ట్‌లో కూడా ఉన్న విష యాన్ని అధికారులు పరిగణనలోకి తీసు కుంటున్నారు. ఈ పరిస్థితులలో భద్రత విషయంలో ఏ మాత్రం ఎమరు పాటుగా ఉన్నా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అధికారులు అంటున్నారు.

లండన్ నగరంలోని మెట్రో రైల్‌కు అత్యంత భద్రత కల్పించారు. అయినప్పటికీ అక్కడ కూడా ఉగ్రదాడి జరిగిన విషయాన్ని అధి కారులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లో ఏ చిన్న ఘటన చోటు చేసుకున్నా పరిస్థితి ఊహించలేని విధంగా ఉంటుందని భావిస్తున్న అధికారులు ఢిల్లీ తరహాలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) కు అప్పగించే విషయాన్ని చురుగ్గా పరిశీలిస్తున్నారు. ఢిల్లీ మెట్రోకు దాదాపు రెండు వేల మంది సిఐఎస్ఎఫ్ సిబ్బంది భద్రత కల్పిస్తుంది. హైదరాబాద్ మెట్రోను కూడా ఇదే తరహాలో అప్పగిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం మెట్రో బాధ్యతను హైదరాబాద్ నగర పోలీసులే చూస్తున్నప్పటికీ భవిష్యత్‌లో ఇది సాధ్యం కాదని అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్ మెట్రోకు ఎంత మంది సిబ్బంది అవసరం, ఎంత ఖర్చు అన్న అంశాలపై అధ్యయనం చేయిస్తున్నారు. త్వరలోనే వివిధ విభాగాలకు చెందిన అధి కారులతో సమావేశమై తుది నిర్ణయానికి వచ్చిన అనంతరం నివేదికను ప్రభుత్వానికి పంపించి ఆమోదం పొందాలని అధికారులు భావిస్తున్నారు.

తహసీల్దార్ ఆఫీసుల్లో నెట్‌వర్క్ కష్టాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తహశీల్దార్లకు రిజిస్ట్రేషన్ అధికారాలను మార్చి 11నుంచి కట్టబెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయానికి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. రిజిస్ట్రేషన్లకు అవసరమైన సాంకేతిక సమస్యలు అంత సులువుగా తీరేవి కావని ఇరు శాఖలు అంచనా వేస్తున్నాయి. రిజిస్ట్రేషన్ నెట్‌వర్క్ సాంకేతికతను తహశీల్దార్ కార్యాలయాలకు అనుసంధానం అంత సులువుగా జరగదని తెలుస్తోంది. ఇప్పుడున్న 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నెట్‌వర్క్‌ను మరో 473 కార్యాలయాలకు విస్తరించడం ఇబ్బందిగా మారనున్నదని తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో జాయింట్‌గా కొనసాగించిన సర్వర్‌తో మూడున్నరేళ్లుగా రిజిస్ట్రేషన్ల శాఖ అనేక ఇబ్బందులను ఎదుర్కొంది. ఈ నేపథ్యంలో అడ్డంకులను అధిగమించేందుకు సొంత మెరుగైన సర్వర్ దిశగా ప్రయత్నాలు చేసింది. ఇప్పటివరకు కొనసాగించిన పాత సర్వర్‌తో గత ఆరునెలలుగా అవాంతరాలు, ఇబ్బందులు ఎదురయ్యాయి. కీలక సమయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఆన్‌లైన్ ఇబ్బందులు అనేక సమస్యలను సృష్టించాయి. అనేక సందర్భాల్లో ఆన్‌లైన్ సర్వర్ పనిచేయక రాష్ట్రంలోని 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్రయ విక్రయాలకు చెందిన రిజిస్ట్రేషన్లు గంటల తరబడి ఆలస్యమవడం నిత్యకృత్యమైంది. ప్రతిష్టాత్మక కార్డ్ విధానంలో సర్వర్ సరిగా పనిచేయని కారణంగా అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్న అధికారులు సర్వర్‌ను సొంతంగా అప్‌డేట్ చేసుకున్నది.

రిజిస్ట్రేషన్ చిక్కులకు చెక్ పెట్టేందుకు అధునాతన సర్వర్‌కు అంకురార్పణ చేశారు. ఒరాకిల్ ఎక్సా డాటా హైస్పీడ్ స్టాండ్ మిషిన్‌తో నూతన సర్వర్‌ను ఏర్పాటు చేశారు. రిజిస్ట్రేషన్ శాఖ అమలు చేస్తున్న అనేక సేవల్లో ఎటువంటి అంతరాయాలు, ఇబ్బందులు లేకుండా ఈ అధునాతన నూతన వ్యవస్థను ఏర్పాటు చేశారు. 7 టెరా బైట్ల గరిష్ట సామర్థ్యంతో గచ్చిబౌలిలోని స్టేట్ డేటాసెంటర్‌లో సెంట్రల్ సర్వర్‌ను నెలకొల్పారు. ఉమ్మడి రాష్ట్రంలోని సర్వర్‌ను ఒక్కో రిజిస్ట్రార్ కార్యాలయంనుంచి వేరుచేసే పనిని చురుకుగా కొనసాగిస్తున్నారు. ఎంపిఎల్ఎస్ టెక్నాలజీ ద్వారా అన్ని ఎస్ఆర్‌వోలను అనుసంధానించారు. రైల్వే శాఖకు చెందిన రైల్‌టెల్ సంస్థ నెట్‌వర్క్ అందజేస్తోంది. మరోవైపు అక్రమాల నిరోధానికి స్థిర చరాస్తుల క్రయ విక్రయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిగా వీడియో రికార్డింగ్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందుకు ప్రతీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రెండు సీసీ కెమెరాలను రిజిస్ట్రేషన్ల శాఖ సమకూర్చింది.



సస్యవిప్లవం దిశగా తెలంగాణ అడుగులు

- ఖరీఫ్ నుంచి కార్యరంగంలోకి రైతు సమన్వయ సమితుల వ్యవస్థ
- ప్రతి సీజన్‌కు ముందు గ్రామగ్రామాన రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు
- రూ. 200 కోట్ల మూలధనంతో రాష్ట్ర రైతు కార్పొరేషన్
- వచ్చే బడ్జెట్‌లో రూ. 15వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వ నిర్ణయం
- మార్గదర్శకాలు జారీ చేసిన వ్యవసాయశాఖ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశంలో ఇప్పటి వరకు ఎక్కడా లేనివిధంగా సరికొత్త ఆలోచనతో నెలకొల్పిన రైతు సమన్వయ వ్యవస్థను విజయ వంతంగా ముందుకు నడిపించేందుకు తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. సీఎం కేసీఆర్ తనకున్న ముందు చూపు ఆలోచనతో కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ మేరకు వ్యవసాయ సహకార శాఖ విడుదల చేసిన ఉత్తర్వుల్లో అన్ని అంశాలపై స్పష్టత ఇచ్చారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఏర్పాటైన రైతు సమన్వయ సమితిల అధికారాలు, బాధ్యతలు, విధులపై క్షేత్రస్థాయికి సర్క్యులర్లను పంపించారు. ఈ ఏడాది ఖరీఫ్ మొదలుకొని ఈ సరికొత్త వ్యవస్థ అమల్లోకి రానుంది.

అందుకోసం లాభాపేక్షలేని రైతు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది ప్రభుత్వం. రాష్ట్రస్థాయి రైతు సమన్వయ సమితి అధ్యక్షుడే ఈ కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ముఖ్య కార్యదర్శి హోదాలో ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారిని ఈ కార్పొరేషన్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించి రాష్ట్రస్థాయిలో అన్ని కార్యక్రమాలను పర్యవేక్షించే బాధ్యతలను ఆయనకే అప్పగిస్తారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు సమన్వయ సమితిల కార్యకలా పాలను పర్యవేక్షిస్తారు. పెట్టుబడి మద్దతు పథకంతో పాటు ఎరువులు, విత్తనాల పంపిణీ, సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ, పంట కొనుగోళ్ళు, వ్యవసాయ యాం త్రీకరణ, బిందు, తుంపర సేద్యం విస్తరణ, ఉద్యాన పంటల అభివృద్ధి తదితర కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం ద్వారా అందించే ఇతర రాయితీలు, సబ్సిడీలు అన్నీ ఇకనుంచి రైతు సమన్వయ సమితిల ద్వారానే అందిస్తారు. ప్రధానంగా ధరల స్థిరీకరణ, అన్ని రకాల నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచేందుకు, రైతుకు కనీస మద్దతు ధరలు అందేలా చూసేందుకు తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించే బాధ్యతలు కూడా ఈ సమితిలకే అప్పగించారు.

అందుకోసం ప్రతి ఐదువేల ఎకరాలకు ఒకటి చొప్పున ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్లస్టర్ల వారీగా క్రాప్ కాలనీలను ఏర్పాటు చేస్తారు. రూ.200 కోట్ల మూలధనంతో ఏర్పాటైన రాష్ట్ర రైతు కార్పొరేషన్‌కు వచ్చే బడ్జెట్‌లో రూ.15వేల కోట్ల మొత్తాన్ని కేటాయించనున్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 2,630 రైతు వేదికలను ఏర్పాటుచేసి రైతుకు అందించే ముడి సరుకును అక్కడి నుంచే సరఫరా చేస్తారు. ప్రతి మూడు గ్రామాలకు ఒకటి చొప్పున అగ్రికల్చరల్ రిసోర్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో రిసోర్స్ సెంటర్ నిర్మాణానికి రూ.12 లక్షల చొప్పున కేటాయిస్తూ ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సంస్థ లక్ష్యాలు



- ప్రధానంగా వరి, మొక్కజొన్న, పసుపు, నూనె గింజలు తదితర పంటల సాగును ప్రోత్సహించడం.
- భూముల సారవంతం ఆధారంగా పంటలను ఎంపిక చేసేందుకు తగిన అవగాహన కల్పించడం. వాతావరణ పరిస్థితుల మార్పులు, ఈ క్రమంలో నష్టాల నుంచి బయటపడేందుకు గల మార్గాలను సూచించడం.
- గ్రామాల వారీగా క్రాప్‌కాలనీలను ఏర్పాటు చేసేందు కు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయడం.
- రాష్ట్రంలో ప్రధానమైన ఉద్యాన పంటలు పసుపు, అల్లం, ఉల్లి, వెల్లుల్లి, మిర్చి, కూరగాయల పంటలను అవసరాలను తీర్చే మేరకు సాగు చేయించడం. ఆ దిశగా రైతులను ప్రోత్సహించడం.
- పండ్ల తోటల్లో మామిడి, బత్తాయి, ద్రాక్ష, నిమ్మ, దానిమ్మ, జామ, అరటి పంటలను ప్రోత్సహించడం.
- పాలీహౌస్‌లపై రైతుల్లో అవగాహన పెంచి విస్తరింపజేయడం, ప్రోత్సాహకాలు అందించడం. సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, యంత్రాలు పంపిణీ చేయడం. వాటిని వినియోగించే అంశంపై రైతులకు శిక్షణ ఇవ్వడం.
- క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీలు నిర్వహించి వ్యవసాయ మార్కెట్‌లలో సదుపాయాలు కల్పించడం, రైతులకు శిక్షణ ఇవ్వడం, మార్కెట్ యార్డులను ఆధునీకరించడం.
- వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా చిన్న, సన్నకారు రైతులకు వనరులను మెరుగుపరిచి పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడం.
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులో ఉన్న పరిజ్ఞానం, పరిశోధనలపై శాస్త్రవేత్తలు, భారత వ్యవసాయ పరిశోధనా మండలి, వివిధ వ్యవసాయ విశ్వవిద్యాలయాలతో సమన్వయం ఏర్పరచుకుని క్షేత్రస్థాయికి శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరవేయడం, అందుకు ప్రణాళికలు రూపొందించుకోవడం.
- వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుక ఎని రైతు సంక్షేమం దిశగా వాటిని అమలు చేయడం.
- పొరుగు రాష్ట్రాలు, ఇతర దేశాల్లో రైతులు, అధికారులు పర్యటించేలా చూసి అక్కడి పరిజ్ఞానాన్ని, సాగు విధానాలను అవలంబించడం. వ్యవసాయ రంగ వైభవానికి వ్యవస్థీకృత మార్పులు, స్థానిక అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళడం.
- రైతు సహకార వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను విస్తరించడం, సకాలంలో లబ్ధి చేకూర్చడం.
- పోస్టు హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, నష్టాల నియంత్రణకు అవలంబించాల్సిన పద్ధతులపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం.
- గిడ్డంగులు, కోల్డ్‌స్టోరేజీలు, ప్యాకింగ్ హౌస్‌లు, ఔట్‌లెట్లను పర్యవేక్షించడం.
- పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను స్థాపించేందుకు చర్యలు తీసుకోవడం.
- ఫార్మర్స్, ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్‌లను సమన్వయపరిచి వ్యాపారాలు ముందుకు నడిపించడం.
- ప్రైవేట్ వ్యాపారులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులను సంప్రదించి పంట కొనుగోళ్ళపై ఒప్పందాలు కుదుర్చుకోవడం.

కార్పొరేషన్ విధులు

- కనీస మద్దతు ధరలు అమలు చేయడం, రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యాన్ని ఛేదించడం.
- ఆహార శుద్ధి, భద్రత, నిత్యావసరాలకు సరిపడే ఆహార పదార్థాలు ప్రజలకు అందుబాటులో ఉంచడం.
- వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, ఉపాధి హామీ, సహకారం, మార్క్‌ఫెడ్, ఆగ్రోస్, గిడ్డంగుల సంస్థ, ఆయిల్‌ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థలను అవసరం మేరకు సమన్వయపరచడం.
- పోస్ట్‌హార్వెస్ట్ ఇంటర్వెన్షన్, గోడౌన్స్, ప్యాకింగ్ హౌజెస్, కోల్డ్‌స్టోరేజస్, చైన్ మేనేజ్‌మెంట్ సప్లయ్, ఫార్మర్ టు కన్స్యూమర్ అనే లక్ష్యాలు నెరవేర్చడం. ప్రైవేట్ ఆహార పరిశ్రమలతో సంప్రదించి వ్యవసాయ ఉత్పత్తులను, ఆహార పదార్థాల ఎగుమతిని ప్రోత్సహించడం.
- ఇతర రాష్ట్రాల్లోని అవసరాలను గుర్తించి ఆ పంటలను ఇక్కడ సాగు చేయించడం, అనంతరం ప్రాసెసింగ్ చేసి సరఫరా చేయడం.
- అవసరమైతే స్వయంగా ఔట్‌లెట్లను నెలకొల్పి ప్రత్యేక బ్రాండ్‌తో క్రయ విక్రయాలు జరపడం.
- సాగుకు ముందు, ఆ తర్వాత చర్యలపై రైతుల్లో అవగాహన పెంచడం.
- మార్కెట్ ధరలు, సదుపాయాలపై ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని గ్రామ గ్రామాన రైతులకు తెలియజేయడం.



రక్తహీనతతో గర్భిణీల మృతి

- దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ టాప్
- గణాంకాల్లో 58 శాతం
- ప్రతి వందమందిలో 50 మందికి ఈ సమస్య

హైదరాబాద్ , ఆంధ్రప్రభ : రక్తహీనతతో గర్భిణీలు ఎక్కువగా మృతిచెందుతు న్నారు. దీంతో పుట్టబోయే శిశువు కూడా లోకాన్ని చూడకుండానే తల్లీ గర్భంలోనే ప్రాణాలు వదులుతున్నారు. తల్లీకి రక్తహీనత రావడం వల్ల చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు తీసుకునే ఆహార పదార్థాలకు చేసే పనికి చాలా తేడా ఉంటుంది. దీంతో వారికి ఈ రక్తహీనత వస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. చిన్నప్పటినుంచేమహిళలు ఈ ఇబ్బందితో బాధపడుతున్నట్టు సర్వేలో తేలింది. మన రాష్ట్రంలో 58 శాతం మహిళలు రక్తహీనతతో బాధ పడుతున్నారు. పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా మహిళలు ఇబ్బందులు పడు తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి 100 మందిలో 50 మంది మహిళలు రక్తహీనతతో చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారు.

అందుబాటులో లేని మాత్రలు

గర్భిణీలకు మాత్రమే ఈ టాబ్‌లెట్లను ప్రభుత్వం పం పిణీ చేస్తోంది. గర్భం దాల్చిన మొదటి ఆరునెలల వరకు ప్రసవం తరువాత 6 నెలల వరకు కచ్చితంగా ఈ మాత్రలను పంపిణీ చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది. చాలా ఆస్పత్రుల్లో ఈ మందులు అందు బాటులో లేవని, చాలామంది బయటకొనుక్కోవాలంటే వీటి ఖరీదు ఉండడంతో వాటిని వాడకుండా ఇబ్బందులను కొనితెచ్చుకుంటున్నారని తెలుస్తోంది.

ప్రతి 100 మంది చిన్నారుల్లో 60 మంది చిన్నారులకు ఇబ్బందులు

వైద్య ప్రమాణాలకు అనుగుణంగా ఏడాది పాటు ఈ మందులు వాడే మహిళల శాతం 30 శాతానికి మిం చడం లేదు. దీంతో రక్తహీనత సంఖ్య ఎక్కువగా ఉం టోంది. 5 సంవత్సరాల పిల్లలకు రక్తహీనత సమస్య ఎక్కువగా ఉంటోంది. ప్రతి 100 మంది చిన్నారులను చూసుకుంటే 60 మంది చిన్నారులు ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. గర్భం దాల్చని వారితో పోలిస్తే ప్రసవం జరిగిన వారిలోనే ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్టు జాతీయ కుటుంబ సర్వే తేల్చింది. రాష్ట్రంలో జరిగే ప్రతి లక్షకాన్పుల్లో సుమారుగా 125 మంది వరకు రక్తహీనత వల్లే చనిపోతున్నారని తెలిసింది.

ఆదిలాబాద్ జిల్లాల్లో రక్తహీనత లోపించిన మహిళల సంఖ్య 180 వరకు ఉన్నట్టు అంచనా. హైదరాబాద్‌లో ఆ సంఖ్య 100 వరకు ఉంది. గర్భిణిల్లో పోలిక్ యాసిడ్, ఐరన్ ట్యాబ్‌లెట్లు అందడం లేదు. దక్షిణాది రాష్ట్రాలతో పోల్చితే మనరాష్ట్రంలోనే మరణాల సంఖ్య ఎక్కువగా ఉంది. కేరళ 12, తమిళ నాడులో 21 మంది శిశువులు చనిపోతున్నారు. మహ బూబ్‌నగర్‌లో జిల్లాల్లో వెయ్యిమంది శిశువుల్లో 60 మంది వరకు మృతిచెందుతున్నారు. కాన్పులు చేసే ఆస్పత్రుల్లో కచ్చితంగా స్త్రీ వైద్య నిపుణులు, పిల్లల వైద్యుడు, మత్తు డాక్టర్ ఉండాలి. 70 శాతం ఆస్పత్రుల్లో మత్తు డాక్టర్లు లేరని పలువురు పేర్కొంటున్నారు. గర్భిణీ ప్రసవం అయిన 42 రోజుల తరువాత మరణించే అవకాశాలు ఎక్కువ. తల్లీకి రక్తహీనత ఉండడంతో పాటు బీపీ, షుగర్ రావడం వలన ఈ మరణాలు జరుగుతాయని వైద్యులు పేర్కొంటున్నారు. రక్తహీనత వల్ల నెలలు నిండకముందే నొప్పులు రావడం జరుగుతుంది. దీంతోపాటు 35 సంవత్సరాల తరువాత గర్భం దాల్చే వారిలో ఈ సమస్య ఎక్కువగా వస్తుంది.

సంప్రదాయ పద్ధతులే సమస్యకు కారణం

మనదేశంలోని సంప్రదాయ పద్ధతులే ఈ సమస్యకు కారణంగా తేలింది. రక్తహీనత సమస్య మహిళల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపు తోంది. దీనివల్ల వయస్సుకు తగ్గట్టుగా శరీరంలో మార్పులు రావడం లేదు. ఒకసారి ఈ సమస్య వస్తే దానిని అధిగమించడం కష్టంగా మారు తోంది. మహిళలు విరామం లేకుండా పనిచే యడం కూడా ఈ సమస్యకు కారణంగా తెలు స్తోంది.

సిల్వర్ స్క్రీన్ సిరిదేవి



శ్రీదేవి అసలు పేరు అమ్మయెంగెర్ అయ్యప్పన్. తమిళనాడు రాష్ట్రంలోని శివకాశిలో 1963, ఆగస్టు 13న అమ్మయెంగెర్ అయ్యప్పన్ జన్మించింది. ఆమె తండ్రి అయ్యప్పన్ తమిళుడు. న్యాయవాద వృత్తిలో స్థిరపడ్డారు. తల్లి రాజేశ్వరి తిరుపతికి చెందిన తెలుగువారు. శ్రీదేవికి సోదరి శ్రీలత, సోదర సమానుడు సతీష్ ఉన్నారు. శ్రీదేవి తన నాలుగవ ఏట బాల నటి తెరంగేట్రం చేసింది. ఎం.ఎ.తిరుముగమ్ తమిళంలో తెరకెక్కించిన తునైవన్ ఆమె తొలి చిత్రం. ఆమె బాలనటిగా తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ చిత్రాల్లో నటించారు. దక్షిణాది నటి లక్ష్మి హీరోయిన్‌గా నటించిన సూపర్ హిట్ చిత్రం జూలీ ద్వారా 1975లో బాలనటిగా బాలీవుడ్‌లో రంగప్రవేశం చేసింది. తన 13వ ఏట తమిళ చిత్రం మూండ్రు ముడిచ్చులో తొలిసారిగా హీరోయిన్‌గా నటించింది.

తొలి లేడీ సూపర్‌స్టార్

శ్రీదేవి 1978లో సోల్వా సావన్(తెలుగులో పదహారేళ్ల వయస్సు) చిత్రంతో హీరోయిన్‌గా బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. కానీ ఆ సినిమా ఉత్తరాది సినీ ప్రేక్షకులకు అంతగా ఎక్కలేదు. ఆ తర్వాత ఐదేళ్లకు 1983లో జితేంద్రకు జోడీగా నటించిన హిమ్మత్‌వాలా చిత్రం సూపర్‌డూపర్ హిట్టయ్యింది. ఆ విధంగా హిందీలో తొలి కమర్షియల్ విజయం శ్రీదేవి ఖాతాలో పడింది. అనతికాలంలోనే హిందీ చిత్ర పరిశ్రమలో అత్యంత డిమాండ్ ఉన్న హీరోయిన్‌గా నిలదొక్కుకుంది. మవాలి(1983), తోఫా(1984), మిస్టర్ ఇండియా(1987), చాందిని(1989) లాంటి చిత్రాలు ఆమెను బాక్సాఫీస్ క్రీడలో అగ్రస్థానంలో ఉంచాయి. సద్మా(1983), చాల్‌బాజ్(1989), లమ్హే(1991), గుమ్‌రాహ్(1993) లాంటి చిత్రాల్లో శ్రీదేవి నటన విమర్శలు ప్రశంసలను సైతం తెచ్చిపెట్టింది.

పోస్టర్‌పై శ్రీదేవి.. రోడ్డుపై యాక్సిడెంట్లు

శ్రీదేవితో పాటుగా జితేంద్రకు కలిసొచ్చిన హిమ్మత్‌వాలా చిత్రానికి సంబంధించిన ఓ వింత ఇప్పటికీ బాలీవుడ్ సినీ జనాలు చెప్పుకుంటారు. సినిమా రిలీజ్‌కు ముందు ముంబై మహానగరంలోని కీలకమైన ఓ సెంటర్‌లో ఓ పోస్టర్ వెలిసింది. వర్తులాకారాల్లో వందలాది ఇత్తడి బిందెలు.. వాటి మధ్యలో జితేంద్రపై శ్రీదేవి. ఆ పోస్టర్‌ను చూసి ముంబైవాసులు తలకిందులైపోయారు. ఇంకేముంది రోడ్డుపై యాక్సిడెంట్లే యాక్సిడెంట్లు. దాంతో ప్రభుత్వ అధికారులు అప్పటికప్పుడు ఆ పోస్టర్‌ను తొలగించారు.

భావ వ్యక్తీకరణలో వెండితెర రాణి

మిగతా ప్రత్యేకతలకు తోడు వైవిధ్యమైన ఆంగిక అభినయానికి శ్రీదేవి పెట్టిందిపేరు. కళ్ళతో మాట్లాడ టంలో ఆమె తర్వాతే ఎవరైనా. కామిక్ టైమింగ్‌లో ఘనాపాఠి. తనదైన భావోద్వేగపూరితమైన నటనతో ప్రేక్షకులను ఏకకాలంలో నవ్వించగలదు, ఏడ్పించగలదు.

మిస్టర్ ఇండియా కాదు మిస్ ఇండియా!

శ్రీదేవి కొన్ని హిందీ సినిమాలకు టైటిల్‌ను తలకిందులు చేసి తన సత్తా చాటుకుంది. మచ్చుకు శేఖర్‌కపూర్ డైరెక్షన్‌లో అనిల్ కపూర్, శ్రీదేవి జోడిగా నటించిన మిస్టర్ ఇండియా చిత్రం బాక్సాఫీస్ బద్దలు కొట్టింది. పత్రికా విలేకరి పాత్రలో అదృశ్యమైపోయే శక్తి కలిగిన హీరోతో ప్రేమలో పడే పాత్రలో ఆమె నటించింది. ఆ పాత్ర శ్రీదేవి నటనలోని నవరసాలను పండించింది. దాంతో హిందీ సినీ వ్యాపార పండితులు ఆ సినిమాను మిస్టర్ ఇండియాకు బదులుగా మిస్ ఇండియా అని పిలుచుకోవడం ప్రారంభించారు.

ఆరేళ్ళ వ్యవధిలో కన్నుమూసిన తల్లిదండ్రులు

1991లో ఆమె తండ్రి మరణించగా, 1997లో ఆమె తల్లి రాజేశ్వరి తుది శ్వాస విడిచారు. తనకు సంబంధించిన అన్ని వ్యవహారాలను చూసుకునే తల్లి కనుమూయడంతో శ్రీదేవి ఒక్కసారిగా విషాద సాగరంలో మునిగిపోయారు. తల్లి అనారోగ్యం పాలైనప్పుడు బోనీ కపూర్ అండగా నిలవడం ఆమెకు ఎంతో ఊరటనిచ్చింది.

1996లో బోనీకపూర్‌తో పరిణయం

శ్రీదేవికి 1996లో సినీ నిర్మాత బోని కపూర్‌తో వివాహ మైంది. బాలీవుడ్ నటులు అనిల్ కపూర్, సంజయ్ కపూర్‌లకు బోనికపూర్ అన్నయ్య అవుతారు. శ్రీదేవి, బోనికపూర్‌ల కుమార్తెలు జాహ్నవి, కుషి.



హీరోలకు హీరో

హీరో చుట్టూ తిరిగే పాత్రల్లో సైతం తనదైన నటనతో ప్రేక్షకులను ఆకర్షించడంలో దిట్ట. నటనలో పండిపోయిన కమల్ హాసన్ నుంచి రజనీకాంత్, అనిల్ కపూర్ నుంచి సల్మాన్ ఖాన్ దాకా వెండితెరపై అంతే స్థాయిలో వెలిగిపోయింది.

పునరాగమనం.. అద్భుత విజయం


2012లో ఇంగ్లీష్ వింగ్లీష్ చిత్రంతో శ్రీదేవి సినీ రంగానికి తిరిగి వచ్చింది. న్యూయార్క్‌లో ఇంగ్లీషు పాఠాలు నేర్చుకునే ఒక సగటు భారతీయ గృహిణిగా శ్రీదేవి నటనకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అద్భుతమైన విజయాన్ని అందించారు. ఆ తర్వాత బాల నటిగా తనకు సినీ జీవితం ప్రసాదించిన తమిళ చిత్ర పరిశ్రమను మరువలేదన్నట్టుగా 2015లో ఇళయదళపతి విజయ్ హీరోగా పులి చిత్రంలో చిరస్మరణీయ పాత్రలో కనిపించింది. 2017లో మామ్ చిత్రంతో మళ్ళీ బాలీవుడ్ తలుపు తట్టింది. కింగ్ ఖాన్ షారూఖ్ ఖాన్ హీరోగా జీరో చిత్రంలో శ్రీదేవి నటించాల్సి ఉంది. కానీ ఈలోగా మృత్యువు ఆమెను పరలోకానికి సాగనంపింది.



పురస్కారాలు.. సత్కారాలు

నాలుగు దశాబ్దాల పైచిలుకు సినీ ప్రస్థానంలో వెండితెర సాక్షిగా శ్రీదేవి పొందిన పురస్కారాలు, గౌరవాలు కోకొల్లలు. ఊహ తెలియకముందే పురస్కారాన్ని పొందిన ఘనత ఆమె సొంతం. శ్రీదేవితో పురస్కారాలు, గౌరవాలకు ఎక్కడ లేని పేరు ప్రతిష్టలు దక్కాయి.

2013 - భారత ప్రభుత్వం నుంచి నాల్గవ అత్యంత పౌర పురస్కారం పద్మశ్రీ



ఫిల్మ్ ఫేర్ అవార్డులు

1992 - లమ్హే చిత్రానికి ఉత్తమ నటి పురస్కారం
1990 - చాల్‌బాజ్ చిత్రానికి ఉత్తమ నటి పురస్కారం
1991 - క్షణక్షణం చిత్రానికి ఉత్తమనటి (తెలుగు) పురస్కారం
1982 - మీండుమ్ కోకిల చిత్రానికి ఉత్తమనటి (తమిళం) పురస్కారం
1977 - ఫిల్మ్‌ఫేర్ ప్రత్యేక పురస్కారం 16 వయదినిలే(తమిళం) చిత్రానికి



జీ సినిమా అవార్డులు

2018 - మామ్ చిత్రానికి జీ సినీ ఉత్తమ నటి పురస్కారం
ఫిల్మ్‌ఫేర్ గ్లామర్ అండ్ స్టయిల్ పురస్కారాలు
2015 - అల్టిమేట్ దివా పురస్కారం
బిగ్ స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ అవార్డులు
2012 - ఇంగ్లీష్ వింగ్లీష్ చిత్రానికి అత్యధికంగా వినోదపరిచిన నటి పురస్కారం



తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర పురస్కారాలు

1981 - మూండ్రామ్ పిరై చిత్రానికి ఉత్తమ నటి పురస్కారం

స్టార్‌డస్ట్ పురస్కారాలు

2013 - ఇంగ్లీష్ వింగ్లీష్ చిత్రానికి ఉత్తమ నటి పురస్కారం

ప్రత్యేక గౌరవాలు

1971 - ఉత్తమ బాల నటిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర పురస్కారం
1990 - భారతీయ సినిమాకు సేవలందించినందుకు స్మితాపాటిల్ స్మారక పురస్కారం
1997 - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కళాసరస్వతి పురస్కారం
2003 - లచ్చు మహరాజ్ పురస్కారం
2003 - భారతీయ సినిమాకు సేవలందించినందుకు వంశీ అంతర్జాతీయ పురస్కారం
2003 - భారతీయ సినిమాకు సేవలందించినందుకు మామి పురస్కారం
2008 - ఫిక్కీ నుంచి లివింగ్ లెజెండ్ ఇన్ ఎంటర్‌టైన్‌మెంట్ పురస్కారం
2009 - హిందీ సినిమాకు సేవలందించినందుకు 33వ కైరో అంతర్జాతీయ చలనచిత్రోత్సవం వద్ద ప్రత్యేక సత్కారం
2012 - ఇంగ్లీష్ వింగ్లీష్‌లో నటనకు 2012 సంవత్సరానికి ఐఆర్‌డిఎస్ చలనచిత్ర పురస్కారం
2013 - సినిమాకు సేవలందించినందుకు కేరళ ప్రభుత్వ సత్కారం
2013 - 100 ఏళ్ల భారతీయ సినిమాకు సేవలందించినందుకు భారత రాష్ట్రపతి నుంచి మెడలియన్ ఆఫ్ ఆనర్

జీ సినిమా పురస్కారాలు

2017 - మామ్ చిత్రానికి ఉత్తమ నటి పురస్కారం





మిథున్ ఎఫైర్ నుంచి థండర్ థైస్ దాకా

స్టార్ట్.. యాక్షన్ అన్న మాటలు వినపడితే చాలు పాత్రలో పరకాయప్రవేశం చేసి తనదైన అభినయంతో వెండితెరపై కథను రక్తి కట్టించే శ్రీదేవి నిజ జీవితంలో మాత్రం అత్యంత సిగ్గరి. మీడియా ముందు మాట్లాడటంలో ఎంతో పొదుపు పాటించేది. ఈ మధ్యకాలంలో అంటే సినిమా ప్రమో షన్లలో భాగంగా తరచుగా ఇంటర్వ్యూలు ఇచ్చిన శ్రీదేవిని చూశాం. అదే రెండు, మూడు దశాబ్దాల క్రితం అయితే ఆమె మీడియాతో మాట్లాడటం చాలా అరుదు. తోటి నటులతో సంబంధాలు, వ్యక్తిగత విషయాలు లాంటి వివాదాలపైన శ్రీదేవి చాలా క్లుప్తంగా, ముక్కుసూటిగా చెప్పేది. అప్పట్లో ఎంతో పాపులరైన శ్రీదేవి కామెంట్లలో కొన్ని

బాలీవుడ్ డిస్కో డ్యాన్సర్ మిథున్ చక్రవర్తి, శ్రీదేవి మధ్య ఏదో ఉందంటూ 1984లో రకరకాల వార్తలు, పుకార్లు దేశమంతటా షికారు చేశాయి. వాటిపై ఆమె ఇలా స్పందించింది..

● మా మధ్య ఏమీలేదు. నేను మిథున్ కలసి జాగ్ ఉఠా ఇన్సాన్ చిత్రంలో నటించా ము. మా మధ్య బంధం వృత్తిపరమైనది. ఆయన పనిచేయడం గొప్పగా ఉంటుంది. కానీ ఆ తర్వాత ఆయన్ను నేనెప్పుడూ కలిసింది లేదు. ఈ కథలు ఎక్కడి నుంచి పుట్టు కొస్తున్నాయో నాకైతే తెలీదు



● నేను హీరోలెవ్వరితోనూ ఫ్రెండ్లీగా ఉండ ను. తోటి నటులతో ఎలాంటి సంబంధం పెట్టుకోను అని ఏడాది తర్వాత అంటే 1985, మే మాసంలో మరో వ్యాఖ్య చేసింది.

● 1987లో బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్‌కు, శ్రీదేవికి మధ్య పొరపొ చ్చాలు వచ్చాయనే వార్తలు వచ్చాయి. ఆయ నతో శ్రీదేవికి ఇక నటించదనే కథనాలు పుట్టు కొచ్చాయి. వాటిపై ఆమె స్పందించిందిలా...అమిత్‌జీతో పనిచేయనని నేనెప్పుడూ అనలేదు. ఒక ఆర్టిస్టుకు ఆయనతో కలిసి సినిమాలో నటించడాన్ని మించింది ఏముంటుంది? ఆయన అన్నీ స్వయంగా చేయగలరు

● 1990లో తారల మధ్య పోటీపై శ్రీదేవి కామెంట్ ప్రత్యర్థులు ఎక్కడున్నారు? ఇద్దరు సమఉజ్జీల మధ్యనే శత్రుత్వం ఉంటుంది. ప్రస్తుతానికి నాకు ఉన్న ఏకైక ప్రత్యర్థి శ్రీదేవి. నేను అదేపనిగా ఆమెను మించిపోవడానికి ప్రయత్నిస్తున్నాను. అలా చేస్తునే ఉంటాను...హిమ్మత్‌వాలా చిత్రం శ్రీదేవికి ఎక్కడలేని స్టార్‌డమ్ తెచ్చి పెట్టింది. అందులో అందాల ప్రదర్శనకు ఆమెకు ఉరిమే ఊరువులు (థండర్ థైస్) అనే ట్యాగ్ తెచ్చిపెట్టింది. ఇదే విషయంపై 1992 నవంబర్‌లో శ్రీదేవి అన్న మాటలివి


● హిమ్మత్ వాలా రిలీజైన తర్వాత నాకు థండర్ థైస్ అనే ట్యాగ్ తగిలించారు. అప్పట్లో చాలా బొద్దుగా ఉండేదాన్ని. నా బరువు 75 కేజీలుండేది. చాందినీ సినిమా చేస్తున్నప్పుడు బరువు తగ్గాను. 57 కేజీలకు చేరుకున్నాను. అది నా నృత్యాన్ని మెరుగు పరుచుకునేందుకు ఎంతగానో ఉపకరిం చింది.

● నిజజీవితంలో నిశ్శబ్దం.. సినిమాలో రోదనం సినిమాకు, నిజ జీవితానికి మధ్య తేడాను 1995, సెప్టెంబర్‌లో రెండు వాక్యాల్లో తేల్చేసింది

● నిజ జీవితంలో మా నాన్నగారు మరణిం చినప్పుడు ఎలాంటి నాటకీయత చోటు చేసుకోలేదు. అంతా నిశ్శబ్దం. అదే సినిమాల్లో తండ్రి మరణిస్తే నా కళ్ళు నొప్పి పుట్టేంతవరకు నేను ఏడుస్తూనే ఉండాలి.

స్టార్ స్టేటస్ గురించి ఏడాది తర్వాత శ్రీదేవి ఇలా అంది..

● నేను కావాలంటే మారువేషంలో షాపింగ్ చేయవచ్చు. కానీ ఒక స్టార్‌గా నాకు ఉన్న గుర్తింపును కోల్పోతాను. అన్నీ పొందడం ఏ ఒక్కరి వల్లా కాదు కదా..!



మైఖేల్ అంటే చాలా ఇష్టం

శ్రీదేవి.. మైఖేల్ జాక్సన్.. ఇద్దరి మరణానికి కారణం అదేనా.?

సినీ వినీలాకాశంలో శ్రీదేవి స్థానం ఎవరూ భర్తీ చేయలేనిది. అందంతో.. నటనతో మొత్తం భారతీయ సినీ ప్రపంచంలోనే తొలి మహిళా సూపర్ స్టార్‌గా ఆమె ఎదిగారు. ఆమె నటన అనిర్వచనీయం.. అమోఘం.. అనకుండా ఎవరూ ఉండరు. అంతటి నటి ఇంత త్వరగా అందరినీ విడిచి వెళ్లిపోతారని ఎవరూ ఊహించలేదు. అభిమానులకైతే ఊపిరి ఆగినంత పనైంది. ఆమె అందం గురించి మాట్లాడుతూ.. ప్రఖ్యాత పాప్ సింగర్ మైఖేల్ జాక్సన్‌ను గుర్తు చేసుకుంటున్నారు. ఇద్దరి మధ్యా చాలా పోలికలు ఉన్నాయంటున్నారు. ఇద్దరూ ఆగస్టులోనే పుట్టారు. వయస్సులో ఐదేళ్లు తేడా ఉన్నా.. గెలవాలన్న తపనలో మాత్రం ఇద్దరిదీ ఒకే విధమైన ఆలోచన. చిన్న వయస్సులోనే కళా రంగంలోకి వచ్చారు. ఒకరు సినీ రంగంలో నెంబర్ వన్ అయితే.. మరొకరు సంగీత ప్రపంచంలో ధ్రువతారగా నిలిచారు. ఎన్నో అవార్డులు రివార్డులు సొంతం చేసుకున్నారు. ఇద్దరూ అందానికి.. తమను తాము అందంగా కనిపించడానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. అయితే ఆ అందమే వారిని త్వరగా అభిమానులకు దూరం చేసిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

సర్జరీలే కొంపముంచాయా.?

శ్రీదేవి, మైఖేల్ జాక్సన్.. ఇద్దరూ సర్జరీలతోనే కాలం గడిపారు. అందంగా కనపడాలని.. అందరినీ మెప్పించాలని విపరీతంగా కాంక్షించారు. శ్రీదేవి బాలీవుడ్‌లో ప్రవేశించి తొలినాళ్ళలో ముక్కుకు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారు. సేమ్ టు సేమ్ మైఖేల్ కూడా అంతే. తన ముక్కు కోసం ఎన్నో సార్లు సర్జరీ చేయించుకున్నాడు. శ్రీదేవిఆ తర్వాత కూడా ఆమె ఆ ప్లాస్టిక్ సర్జరీని వదిలినట్లు లేరు. స్లిమ్ గా, అందంగా కనిపించటంకోసం ఇంప్లాంట్స్, లైపోసక్షన్, బొటాక్స్ (చర్మంపై ముడతలు పోగొట్టే ప్రక్రియ) వంటి అనేక చికిత్సలను చేయించుకుంటున్నారట.మరోవైపు నల్లగా ఉండే జాక్సన్ తెల్లగా అవ్వడం కోసం ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చాడు. అంతేకాదు స్లిమ్‌గా



ఉండడం కోసం అన్నం మానేసి ట్యాబ్లెట్లతోనే కాలం గడిపాడు. ఈ విషయం ఆయన పోస్టుమార్టం రిపోర్ట్ బయటపెట్టింది. కళా ప్రపంచంలో పోటీపడుతూనే.. అందరినీ మెప్పిస్తూనే.. ఓ రాత్రి.. ఎవరికీ చెప్పకుండా.. అందరినీ విషాదంలో ముంచేసి వెళ్లిపోయారు. ఇద్దరూ గుండెపోటుతో మరణించడం ఒకెత్తైతే.. రాత్రి సమయంలోనే చనిపోవడం మరో విషాదం.

విమర్శకుల మాట..

అందంగా కనిపించాలనే తాపత్రయమే వీరిద్దరినీ చంపేసిందా అంటే అవుననే అంటున్నారు విశ్లేషకులు. ఇద్దరూ వారివారి రంగాల్లో అగ్రస్థానంలో ఉన్నవాళ్లు. తమ ప్రతిభతో ఎందరినో వెనక్కి నెట్టినవాళ్లు. కానీ.. తమను తాము జయించలేకపోయారు. అయితే తమలోని అందాన్ని గెలవాలనే కోరికను గెలవలేకపోయారని విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉంటే.. శ్రీదేవి మరణంపై అభిమానులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.మరో విషయం ఏంటంటే.. శ్రీదేవికి మైఖేల్ జాక్సన్ అంటే ఎంతో ఇష్టం. ఆమె తన ఇష్టాన్ని తన పెయింట్స్ ద్వారా తెలిపారు. మైఖేల్‌పై ఉన్న అభిమానాన్ని చాటుతూ అందమైన చిత్రాన్ని రూపుదిద్దారు. ఆ చిత్రాన్ని దుబాయిలో జరిగే ఓ కార్యక్రమంలో వేలం వేసి.. మంచి పనికి వినియోగిద్దామనుకున్నారు. కానీ అంతలోనే ఈ విషాదం చోటు చేసుకుంది.



అందాల తార శ్రీదేవి మరణంతో అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. తమ అభిమాన నటి ఇకలేరనే వార్తను ఫ్యాన్స్ నమ్మలేకపోతున్నారు. తమ అభిమాన తారను చివరిసారిగా చూడాలన్న ఆత్రుతతో శ్రీదేవి ఇంటికి అభిమానులు పోటెత్తున్నారు. ఈ నేపథ్యంలో ముంబై పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

భారత దేశ నెంబర్-1 హీరోయిన్‌గా హారతులు అందుకున్న ఎవర్ గ్రీన్ నటి శ్రీదేవి హఠాన్మరణం.. దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. దుబాయ్‌లో ఓ వేడుకకు హాజరైన ఆమె హఠాత్తుగా గుండె పోటుకు గురై మరణించడం అందరినీ కలచి వేసింది. దక్షిణాదికి చెందిన హీరోయిన్ అయినప్పటికీ.. ఉత్తరాదిలో తన సత్తాను చాటి.. దేశం గర్వించదగిన హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది శ్రీదేవి. బాల నటిగా ప్రారంభమైన ఆమె సినీ ప్రస్థానం.. ఇంతింతై అన్నట్టుగా ఎదిగింది. ఎవరూ అందుకోలేని స్థాయికి చేరుకుంది.



అందాల అభినయ అక్షయపాత్ర

కలిసొచ్చిన కాలంలో నాయికలవుతారు, అంతా బాగుంటే ఓ పదేళ్లు వెలుగుతారు, కాలంతో పాటే మారుతారు, క్యారెక్టర్ ఆర్టిస్టులవుతారు, కానీ అత్యంత అరుదుగా కాలదోషం పట్టని నాయికలొస్తారు. దశాబ్దాల పాటు తరగని నట మాయాజాలం చూపిస్తారు. అందాల అభినయ అక్షయపాత్రలవుతారు. అలాంటి నాయికే శ్రీదేవి. బాల నటిగా ఆమె ముద్దు మాటలు విన్నాం, పదహారేళ్ల వయసులో చిలిపిదనం చూశాం, నాయికగా ఆటపాటలను ఆస్వాదించాం, అమ్మ గా ఆమె నటనకు ముగ్ధులయ్యాం. కాలాలు మారాయి, తరాలు మారాయి....నటిగా ఆమె అలరిస్తూనే సాగింది. భారతీయ ప్రేక్షకులకు జ్ఞాపకాలు మిగిల్చి మరలిరాని లోకాలకు తరలివెళ్లింది.

దివికేగిన దివ్యతార
అతిలోక సుందరి శ్రీదేవి అస్తమయం
శోకసంద్రంలో భారతీయ చిత్ర పరిశ్రమ

స్వరం ఆమెకో వరం...

ఆకట్టుకునే అందమే కాదు... మధురమైన స్వరం శ్రీదేవికి వరంలా మారింది. సన్నివేశాల్లో ఆమె పలికిన మాటలన్నీ తియ్యగా వినిపిస్తాయి. హిందీ, తెలుగు, తమిళం..ఇలా శ్రీదేవి నటించిన భాషలు వేరైనా...ఆ స్వరమాయ మారలేదు. వేటగాడు సినిమాలో ఏయ్ మిస్టర్ కళ్లు కనిపించడం లేదా అంటూ గద్దించినా...ఫిజిక్స్ నేర్పుతావా వంకాయ్ అంటూ దేవత చిత్రంలో కథానాయకుడిని ఆటపట్టించినా....నేను స్వర్గాధిపతి ఇంద్రుడి కుమార్తెను ఇంద్రజను అంటూ గర్వాన్ని ప్రకటించినా, క్షణం క్షణంలో ప్రతినాయకులకు భయపడుతూ వణికే కంఠంతో మాట్లాడినా ఆ పాత్ర వ్యక్తిత్వాన్ని సుమధురంగా వ్యక్తపరిచింది శ్రీదేవి.

మయూరిలా నృత్యం...

నృత్యాలతో ప్రేక్షకులను సమ్మోహన పరిచింది శ్రీదేవి. హద్దుల్లోనే అందంగా కనిపిస్తూ...తెరను ఉత్సాహపరిచేది. పాటల్లో ఆమె పలికిన హావభావాలు పాత్రకు కొనసాగింపుగా ఉండేవి. ముఖ్యంగా హిందీలో చాందినీ, హిమ్మత్‌వాలా లాంటి చిత్రాల్లో ఆమె చేసిన నృత్యాలు వెండితెరను ఉర్రూతలూగించాయి.

రేఖ వారసురాలిగా..

హిందీ చిత్రసీమకు బాల నటిగా శ్రీదేవి తెలుసు. 1975లో జూలీ అనే చిత్రంలో చిన్నప్పుడు నటించింది. మరో నాలుగేళ్ల తర్వాత పదహారేళ్ల వయసు హిందీ చిత్రం సాల్వ సావన్‌తో నాయికగా అడుగుపెట్టింది. దక్షిణాదిలో అద్భుత విజయాన్ని అందుకున్న ఈ చిత్రం బాలీవుడ్‌లో అపజయం పాలైంది. సినిమా ఆడకున్నా శ్రీదేవి నటనకు మంచి గుర్తింపు దక్కింది. 1983లో విడుదలైన హిమ్మత్‌వాలా శ్రీదేవికి బాలీవుడ్‌లో అసలైన విజయాన్ని అందించింది. హిమ్మత్‌వాలా విజయం ముందు తరం నాయిక రేఖ వారసురాలు అనేంత పేరు తీసుకొచ్చింది. వైజయంతీ, హేమామాలినీలతో శ్రీదేవిని పోల్చడం ప్రారంభమైంది హిమ్మత్‌వాలాతోనే. తోఫా, మిస్టర్ ఇండియా, గుమ్రా, చాందినీ, చాల్‌బాజ్, లమ్‌హే, లాడ్లా, జుదాయి, ఖుదాగవా ఆమెను హిందీలో తిరుగులేని తారను చేశాయి.

దక్షిణాది అగ్రతారగా...

తునైవాన్ ఆమె తొలి తమిళ చిత్రం. నాయికగా మూండ్రు ముడిచు చిత్రంతో పరిచయమైంది. పదహారు వయదనిలే, సిగప్పు రోజాకల్, వరుమాయిన్ నిరమ్ సివప్పు, మీండుమ్ కోకిల లాంటి చిత్రాలు తమిళనాట అగ్రతారను చేశాయి. తమిళ చిత్రాలు నటిగా ఎక్కువ సంతృప్తినిచ్చాయని చెప్పుకున్నారు శ్రీదేవి. తమిళంతో పాటే ఆమె మలయాళ చిత్ర ప్రయాణం ప్రారంభమైంది. ఆ తర్వాత కన్నడలోనూ నటించారు.

తెలుగు తెర అభిమాన నాయిక...

మూడు తరాల కథానాయకులతో కలిసి నటించిన అరుదైన చరిత్ర శ్రీదేవి సొంతం. ఎన్టీఆర్, ఏఎన్నార్‌లకు మనవరాలిగా తొలినాళ్లలో నటించి..ఆ తర్వాత వాళ్ల సరసనే తారగా మెప్పించింది. ఎన్టీఆర్‌తో వేటగాడు, కొండవీటి సింహం, సర్దార్ పాపారాయుడు, గజదొంగ, బొబ్బిలిపులి, జస్టిస్ చౌదరి, ఏఎన్నార్‌తో ముద్దుల కొడుకు, ప్రేమాభిషేకం, బంగారు కానుక, ప్రేమ కానుక తదితర చిత్రాల్లో ఆడిపాడారు. ఇక ఎన్టీఆర్, ఏఎన్నార్ అనంతరం కృష్ణ, కృష్ణంరాజు, శోభన్ బాబు, ఆ తర్వాతి తరం కథానాయకులు చిరంజీవి, నాగార్జున, వెంకటేష్ సరసన నాయికగా నటించారు. తెలుగులో మూడు దశాబ్దాలు అప్రతిహతంగా ఆమె నటప్రయాణం కొనసాగింది. ముఖ్యంగా హీరోల్లో కృష్ణతో ఆమె అత్యధిక చిత్రాలు చేయగా....దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావు తెరకెక్కించిన 24 చిత్రాల్లో ఆమె నటించారు. ఎన్టీఆర్‌తో గొప్ప కాంబినేషన్ అనిపించుకున్న శ్రీదేవి ఆ తర్వాత మెగాస్టార్ చిరంజీవితో అంత స్టార్ పెయిర్ అనిపించుకున్నారు. చిరంజీవితో శ్రీదేవి నటించిన జగదేక వీరుడు అతిలోక సుందరి టాలీవుడ్ ఘన విజయాల్లో ఒకటిగా నిలిచింది.



నటన-నా హృదయ స్పందన

-శ్రీదేవి

54 ఏళ్ల జీవితంలో యాభై ఏళ్లు నటిగా కొనసాగిన అరుదైన తార శ్రీదేవి. ఐదు దశాబ్దాల నట ప్రయాణంలో 300 పైగా చిత్రాల్లో నటించింది. ఒక్కో చిత్రంలో ఒక్కో వైవిధ్యమైన పాత్ర...ఆమెలోని అద్భుత నటిని ఆవిష్కరించాయి. ఇంత సుదీర్ఘ అనుభవంలో శ్రీదేవి అంతరంగం...

★ జీవితంలో ఏదైనా పొందాలంటే మరొకటి వదులుకోవాలి. నేను బాల్యం నుంచే నటించడం ప్రారంభించాను. సినిమాలు చేస్తూ వచ్చాను. అలా బాల్యాన్ని, పాఠశాల, కళాశాల జీవితాన్ని కోల్పోయాను. అయితే నేను సాధించిన దాని కంటే ఎక్కువే పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోగలిగాను.

★ చిన్నప్పటి నుంచి వినయంగా ఉండేదాన్ని. అమ్మ ఎలా చెబితే అలా నడుచుకున్నా. ఒక రోజు సాయంత్రం మా పెరటి గోడపై అమ్మ నన్ను కూర్చోబెట్టి కాసేపు సరదాగా కబుర్లు చెప్పింది. ఇంతలో వంట గదిలో ఏదో మర్చిపోయి వెళుతూ...అలాగే కూర్చో కదలకు అని వెళ్లింది. వంట పనిలో పడి చాలా సేపటికి గానీ నేను ఆమెకు గుర్తు రాలేదు. పరుగెత్తుకుంటూ వచ్చి చూస్తే...నేను గోడమీద కదలకుండా కూర్చుని ఉన్నాను. అమ్మ అడిగితే నువ్వే కదా అమ్మ కదలకుండా కూర్చోమన్నావు అన్నానట. అమ్మ నన్ను హత్తుకుని ఏడ్చేసింది.



★ నేను దర్శకురాలి నటిని. ఓ చిత్రాన్ని అంగీకరించే ముందే ఆ దర్శకుడితో ఎంతవరకు పనిచేయగలం అని ఆలోచిస్తాను. ఆ తర్వాత నా పాత్ర, మనసు కదిలించగల కథా కథనాలకు ప్రాధాన్యత ఇస్తా. ఇక మంచి కథానాయకులు ఉంటేనే ఆ సినిమాకు అన్ని విధాలా గొప్పదనం వస్తుంది.

★ మిస్టర్ ఇండియా సినిమాకు ముందు నన్ను కేవలం సౌందర్య తారగానే చూసేవారు. కానీ ఆ సినిమా తర్వాత నాలోని నటిని ప్రేక్షకులు, పరిశ్రమ గుర్తించాయి. దర్శకులు శేఖర్ కపూర్‌కు అందుకు కృతజ్ఞురాలిని. ఇక ఆ చిత్రంలో నా అభిమాన హాస్య నటుడు చార్లీ చాప్లిన్‌గా పాత్రను అనుకరించడం మరిచిపోలేని జ్ఞాపకం. వాస్తవానికి ఆ వేషం ఒక సన్నివేశానికే అనుకున్నారు. అయితే నన్ను ఆ దుస్తుల్లో చూసిన దర్శకులు, రచయితలు అలా సన్నివేశాలు పెంచుకుంటూ పోయారు. మొత్తం 11 సన్నివేశాలు చార్లీ చాప్లిన్ పాత్రలో చిత్రీకరించారు.

★ పెయింటింగ్స్ వేయడం నాకు అలవాటు. క్షణం తీరిక లేకుండా నటిస్తున్న రోజుల్లో కూడా షూటింగ్ పూర్తయి ఇంటికొచ్చాక బొమ్మలు గీసుకుంటూ కాలక్షేపం చేసేదాన్ని. అయితే కొన్నాళ్లకు అది కూడా మర్చిపోయాను. మా పాప పుట్టాక ఆమె పాఠశాలకు వెళ్తున్నప్పుడు డ్రాయింగ్ వేసి పెట్టేదాన్ని. అలా మరోసారి బొమ్మలు వేసే అలవాటు కొనసాగించాను. నా పెయింటింగ్ ఒకటి క్రిస్టీ వేలం సంస్థ 50 వేల డాలర్‌లకు విక్రయించింది. ఆ డబ్బు సేవా కార్యక్రమాలకు ఉపయోగించారు.

★ నా వ్యక్తిత్వాన్ని మా అమ్మే తీర్చిదిద్దింది. జీవితంలో క్రమశిక్షణ, మితాహారం, మంచి అలవాట్లు అన్నీ అమ్మే నేర్పించింది. ఎంత పెద్ద సినిమా అయినా, ఏం జరిగినా...సాయంత్రం ఆరు గంటలకు షూటింగ్‌లో నుంచి బయటకు రావాల్సిందే. ఆరు గంటలకు నేను ఇంటికి వెళ్లే కారులో కూర్చుని ఉండేదాన్ని.



★ నా 50 ఏళ్ల నట జీవితంలో ఏ రోజూ నటించాల్సిన సన్నివేశానికి ముందే సిద్ధమయింది లేదు. ఆ సన్నివేశానికి అప్పుడు ఎలా మనసు ప్రతిస్పందిస్తే అలా నటించాను. నటన మన హృదయం నుంచి వస్తుందని నేను నమ్ముతాను. నా కళ్లు అభినయంలోని భావాలను బాగా పలికిస్తాయని అనుకుంటాను.

★ నాకు సవాలులా అనిపించిన పాత్రలు తమిళ చిత్రాల్లో దొరికాయి. నేను బాలనటిగా పరిశ్రమకు రావడం వల్ల బాల్యాన్ని కోల్పోయాను. నా పిల్లలకు అలాంటి పరిస్థితి రావద్దనే పదిహేనేళ్లు నటనకు దూరంగా ఉన్నాను. వాళ్లు ఎదిగే క్రమాన్ని దగ్గరుండి చూసుకున్నాను. పిల్లల జీవితాన్ని ఆస్వాదించాను.

★ మా అమ్మకు కేన్సర్ చికిత్స అందిస్తున్న సమయంలో బోనీ కపూర్ ఎంతో సహాయ సహకారాలు అందించారు. అయితే అందరూ అనుకుంటున్నట్లు ఆ సమయంలో మేము ఒకరికి ఒకరం దగ్గర కాలేదు. బోనీ నిర్మాతగా నాతో చాలా సినిమాలు నిర్మించారు. అలా ఓ పదేళ్ల ప్రయాణం మమ్మల్ని కలిపింది. నా భాగస్వామిగా, ఒక సంరక్షకుడిగా నేను నమ్మాను. ఇన్నేళ్ల మా దాంపత్య జీవితంలో ఆ నమ్మకం ఏ రోజూ సడలిపోలేదు.

★ నటించడాన్ని ఆస్వాదిస్తేనే చిత్ర పరిశ్రమకు రండి. లేకుండా దీన్ని మించిన శ్రమ మరోటి ఉండదు. నటిగా కొనసాగాలంటే చాలా ఓపిక, కష్టపడే తత్వం ఉండాలి. బయటి ప్రపంచాన్ని మర్చిపోయేంతగా నటనను ప్రేమించాము కనుకే ఇన్నేళ్లు పరిశ్రమలో ఉండగలిగాము.

★ నా మొత్తం నట ప్రయాణాన్ని తిరిగి చూస్తే....భగవంతుడికి ఎంతో కృతజ్ఞురాలిని అనిపిస్తుంది. నా దర్శకులు, సాంకేతిక నిపుణులు, నటీనటులు, నిర్మాతలు అందరూ నా విజయంలో భాగస్వాములే.



★ కుటుంబమే నా లోకం. పిల్లలు జాహ్నవి, ఖుషీలకు మాతో అనుబంధం ఎక్కువ. జాహ్నవి అమ్మ కూచి, ఖుషీకి నాన్నంటే ఇష్టం. జాహ్నవి నటి కావాలన్నదే ఆమె కోరికే. నేనూ, బోనీ ఏ రోజూ నటివి కావాలని జాహ్నవికి చెప్పలేదు. ఆమె అభిరుచి కాదనడం మాకిష్టం లేదు. నేను నటిస్తానని అన్నప్పుడు మా అమ్మ అభ్యంతరం చెప్పలేదు కదా.

★ నా సౌందర్య రహస్యం ఇంటి చిట్కాలు పాటించడమే. ఆరోగ్యకరమైన జీవన శైలి, మితాహారం, వ్యాయామం చేయడం తప్పనిసరిగా పాటిస్తాను. మానసిక ప్రశాంతత, సానుకూల దృక్పథంతో ఉంటాను. కృత్రిమమైన అందాన్ని నేను విశ్వసించను. ఎంత ఖర్చు పెట్టి సౌందర్య సాధనాలు, చికిత్సలు చేయించుకున్నా సహజంగా ఉండే అందం రాదు. పైగా సైడ్ ఎఫెక్టులు తప్పనిసరిగా ఎదురవుతాయి.

★ నాయికల్లో సూపర్‌స్టార్‌లు ఇప్పటికీ ఉన్నారు. కత్రీనా కైఫ్, విద్యా బాలన్, ఆలియా భట్, దీపికా పదుకొనే, ప్రియాంకా చోప్రా లాంటి వాళ్లంతా గొప్ప విజయాలు సాధిస్తున్నారు.

★ దర్శకత్వం ఆలోచన ఎప్పుడూ చేయలేదు. దర్శకుడికి చాలా బాధ్యతలుంటాయి. కథను అర్థం చేసుకుని నటించడం వరకే నేను సమర్థురాలిని.

★ దుస్తులు కొనడం అంటే నాకు చాలా ఇష్టం. నేనెక్కడ ఉన్నా...ఆ సమీపంలో ఉన్న దుకాణాలకు వెళ్లి దుస్తులు కొనుక్కుంటూ ఉంటాను.

చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతి...

చిన్న వయసులో శ్రీదేవి మరణం బాధాకరం. ఆమె మా ఇంట్లో ఎదిగిన పిల్ల. చెన్నైలో మా ఇల్లు, వాళ్ల ఇల్లు పక్క పక్కనే ఉండేవి. నరేష్, శ్రీదేవి చిన్ననాటి స్నేహితులు. శ్రీదేవి మృతిని విజయనిర్మల జీర్ణించుకోవడం లేదు.

- సూపర్‌స్టార్ కృష్ణ

సావిత్రి, భానుమతిలను మినహాయిస్తే శ్రీదేవితో పోల్చదగిన నటీమణులు ఎవరూ లేరు. శ్రీదేవి మృతి అందరినీ షాక్‌కు గురిచేసింది. సెట్‌లో ఆమె ఎంతో హుందాగా, గౌరవంగా వ్యవహరించేవారు

- కృష్ణంరాజు

శ్రీదేవి ఎందరో నటీమణులకు ఆదర్శం. సినీ జీవితంలో ఆమె చెరగని ముద్రవేశారు. శ్రీదేవి జీవితం మొత్తం నటనలోనే సరిపోయింది. ఆమె అత్మకు శాంతి కలగాలి.

- హేమమాలిని

భారత సినీరంగంలో శ్రీదేవి లాంటి నటి మరొకరు లేరు...రారు. ఆమె విషయంలో భగవంతుడు చాలా అన్యాయం చేశాడు. శ్రీదేవి కళ కోసమే పుట్టింది. కళే ప్రాణంగా బతికింది. ఆమెకున్న అంకితభావం మరెవరిలోనూ చూడలేదు. జగదేకవీరుడు-అతిలోకసుందరిలో ఇంద్రజ పాత్ర తన కోసమే పుట్టిందా? అన్నట్లు నటించి మెప్పించింది. అంత గొప్ప నటిని కోల్పోవడం నిజంగా భారతీయ పరిశ్రమ చేసుకున్న దురదృష్టం.

- చిరంజీవి

శ్రీదేవితో నాన్నగారు చాలా సినిమాల్లో నటించారు. ఎలాంటి భావాన్ని అయినా కళ్లతోనే పలికించగల మహానటి శ్రీదేవి. ఆవిడ హఠాన్మరణం చిత్రసీమకు తీరని లోటు. ఆవిడ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడ్ని వేడుకొంటున్నా

- నందమూరి బాలకృష్ణ

శ్రీదేవి మనల్ని విడిచిపెట్టిన నిజాన్ని ఎదుర్కొనేందుకు నేను ఉదయం నుంచి ప్రయత్నిస్తున్నా. ఆమె మరణాన్ని ఒక పీడకలగా భావిస్తాను. మేమంతా ఆమెను ప్రేమిస్తూనే ఉంటాం.

-నాగార్జున

శ్రీదేవి ఇక లేరనే విషయం నన్ను విషాదంలోకి నెట్టేసింది. ఆమెతో కలిసి నటించిన క్షణ క్షణం నా జీవితంలో ఎప్పటికీ మరచిపోలేని సినిమా.

-వెంకటేష్

శ్రీదేవి లేరంటే నమ్మలేకపోతున్నాం. ఆమె నటన చిరస్మరణీయం. శ్రీదేవి భౌతికంగా లేనప్పటికీ ఈ లోకాన్ని వీడినా నటిగా చిత్రసీమలో సుస్థిరస్థానం సంపాదించుకున్నారు

- పవన్‌కల్యాణ్

శ్రీదేవి మృతి నన్ను కలిచివేసింది. నేను అసిస్టెంట్ దర్శకుడిగా ఉన్న సమయంలో శ్రీదేవి బాలనటి. పదహారేళ్ల వయసు నుంచి జగదేకవీరుడు- అతిలోకసుందరి వరకు తనతో అనేక సినిమాలు తీశాను. స్వయంకృషితో ఎదిగిన తార ఆమె

- దర్శకుడు కె.రాఘవేంద్రరావు

శ్రీదేవి లేడీ సూపర్‌స్టార్. 54 ఏళ్ల వయసుకే నటిగా 50 ఏళ్లు రాణించడం అద్భుతం. ఎంత చక్కటి ప్రయాణం. ఆమె మరణం ఊహించని ముగింపు.

- ఎస్.ఎస్.రాజమౌళి

శ్రీదేవితో కలిసి చాలా సినిమాల్లో నటించాను. భారతీయ చిత్ర పరిశ్రమ మంచి నటినే కాదు ఉన్నతమైన వ్యక్తిని కూడా కోల్పోయింది.

-ఎం.మోహన్‌బాబు

కెరీర్ పరంగా మా ఇద్దరి మధ్య పోటీ ఉండేది. అయితే అది స్నేహపూర్వకమైన పోటీ. మేమిద్దరం కలిసి నటిస్తామనుకోలేదు. శ్రీదేవి ఎప్పుడూ తక్కువగా మాట్లాడేవారు. ఆమె ఈ లోకంలో లేరంటే నమ్మలేకపోతున్నా

- జయసుధ

ఈరోజు నేను దేవుడిని ద్వేషిస్తున్నా. ఉజ్వలమైన వెలుగుని అతను తీసుకెళ్లిపోయాడు. బోనీకపూర్‌కి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా

- రామ్‌గోపాల్ వర్మ

ఎందుకో తెలియదు నా మనసంతా తెలియని బాధతో నిండిపోతోంది.

- శ్రీదేవి మృతికి ముందు ట్వీట్టర్‌లో అమితాబ్

చాలా డిస్ట్రబ్ అయ్యాను. నాకు అత్యంత సన్నిహితు రాలైన స్నేహితురాలిని కోల్పోయాను. ఇండస్ట్రీ ఒక నిజమైన లెజెండ్‌ను కోల్పోయింది.

-రజనీకాంత్

టీనేజ్ నుంచి గొప్ప నటిగా ఎదిగిన శ్రీదేవిని చూశాను. స్టార్‌డమ్‌కు ఆమె అర్హురాలే. ఆమె చనిపోయిందని తెలియగానే చివరిసారి శ్రీదేవిని నేను కలిసిన జ్ఞాపకాలన్నీ ఒక్కసారి నా కళ్ల ముందుకు వచ్చాయి.

- కమల్ హాసన్

క్రీడాప్రభ



నా జీవితంలో అదే పెద్ద తప్పు

● ఏరికోరి తెచ్చుకున్న చాపెల్ వల్లే కష్టాలొచ్చాయి

● నెట్టేసినిపోయిందు... కెరీర్‌కు డేంజర్ బెల్స్ మోగాయి

● ఆనాటి నిర్ణయం ఎప్పటికీ క్షమించలేనిది

● ఆత్మకథలో సౌరవ్ గంగూలీ నిర్వేదం

కోల్‌కతా: టీమిండియాకు దూకుడు నేర్పిన కెప్టెన్ సౌరవ్ గంగూలీ.. సౌరవ్ జట్టు పగ్గాలు చేపట్టిన తర్వాతే భారత జట్టు దశ మారింది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, వెస్టిండీస్ వంటి అగ్రజట్లకు పోటీనిచ్చే స్థాయికి ఎదిగింది. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రపంచ క్రికెట్‌ను శాసించే స్థాయికి చేరింది. మ్యాచ్ ఫిక్సింగ్ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న జట్టులో ఆత్మవిశ్వాసం నింపి.. దూకుడు పెంచి.. నంబర్ వన్ జట్టుగా నిలబెట్టాడు. విదేశీ గడ్డపై చొక్కావిప్పి తిప్పినా.. నోరుపారేసుకుని క్రికెటర్లను ఆయోమయానికి గురిచెయాలని చూసే ఇతర దేశాల క్రికెటర్లకు అంతే దురుసుగా సమాధానం చెప్పినా ఆయనకే చెల్లింది. అప్పట్లో 'దాదావేసిన పునాదుల వల్లే' గొప్ప విజయాలు లభిస్తున్నాయి. అంతటి మహోన్నతుడు, ధీశాలి కూడా కొన్ని సందర్భాల్లో తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. కెరీర్ పరంగా, వ్యక్తిగతంగా కష్టాలు అనుభవించాడు. ఇందుకు తాను ఏరికోరి తెచ్చుకున్న వ్యక్తే కారణం కావడం కొసమెరుపు. ఆ వ్యక్తే టీమిండియా మాజీ కోచ్ గ్రెగ్ చాపెల్. ''నా జీవితంలో చేసిన అతిపెద్ద తప్పు అదే. సన్నిహితులు, మిత్రులు వద్దంటున్నా... వారి మాటపెడచెవిన పెట్టాను. కోచ్‌గా గ్రెగ్‌ను ఏరికోరి తెచ్చిపెట్టుకున్నాను. అందుకు తగిన శాస్తి జరిగింది' అని ఇప్పుడు పశ్చాత్తాపడుతున్నాడు. తన ఆత్మకథ 'ఎ సెంచరీ ఈజ్ నాట్ ఎనఫ్' పుస్తకంలో ఈమేరకు ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. ''2004లో జాన్ రైట్ తర్వాత ఎవరు అన్న ప్రశ్న తలెత్తినపుడు నాకు తట్టిన తొలి పేరు గ్రెగ్ చాపెల్. అతడే మనల్ని నంబర్ వన్ స్థాయికి తీసుకెళ్తాడని భావించా. ఇదే విషయాన్ని అప్పటి అధ్యక్షుడు దాల్మియాకు చెప్పాను. గవాస్కర్‌లాంటి వాళ్లు వద్దని వారించారు. అతనితో నీకు ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. చివరికి గ్రెగ్ సోదరుడు ఇయాన్ చాపెల్ కూడా వద్దని చెప్పినా నేను వినలేదు. అప్పుడు నాకుఅనిపించిందే చేశాను. కానీ ఆ తర్వాత ఏం జరిగిందో అందరికీ తెలుసు. అతనివల్ల నాకెరీర్ సర్వనాశనం అయింది. కానీ ఆ దేశ పౌరుడిని మాత్రం ఏమీ చేయలేక పోయాను. 2005 నా జీవితంలోనే అత్యంత గడ్డు కాలం. ఎలాంటి కారణం లేకుండా నా కెప్టెన్సీ కోల్పోయాను. ప్లేయర్‌గానూ చోటు సంపాదించలేకపోయాను. ఇది రాసేటప్పుడు కూడా నాకు కోపం వస్తున్నది. నాకు జరిగిన అన్యాయం ఊహించలేనిది.. ఎప్పటికీ క్షమించలేనిది ''అని గంగూలీ గుర్తుచేసుకున్నాడు.

ముషారఫ్ హెచ్చరికలు

అర్ధరాత్రుల్లో సాహసాలు చేయొద్దంటూ గంగూలీకి 2004లో పాకిస్థాన్ మాజీ అధ్యక్షుడు ముషారఫ్ ఓ సలహా ఇచ్చారట. ఆ దేశ క్రికెట్ జట్టుతో వన్డే సిరీస్ వెళ్ళినప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. సిరీస్‌ను దాదా టీమ్ 3-2 తేడాతో గెలుచుకుంది. హోటల్ నుంచి సరదాగా బయటకు వెళ్లి ఫుడ్ ఐటమ్స్ తినాలని జట్టు కోరుకుంది. కానీ, బయటకు వెళ్లాలని చెప్తే సెక్యూరిటీ గార్డులు తనను అడ్డుకుంటారని భావించి.. ముఖం కనిపించకుండా హోటల్ వెనుక ద్వారం నుంచి బయటకు వెళ్లానని గంగూలీ తెలిపారు. ఇంకోసారి సెక్యూరిటీ లేకుండా బయటకు వెళ్ళకండి. తామే సెక్యూరిటీ పంపుతామని.. అర్ధరాత్రుల్లో మాత్రం ఇలాంటి సాహసాలు చేయొద్దని హెచ్చరించినట్లు గంగూలీ చెప్పారు.



చలింపిక్స్ సక్సెస్

క్రీడా స్ఫూర్తిని చాటిన ఉభయ కొరియాలు

పొయింగ్‌చాంగ్: రెండు వారాల పాటు ద.కొరియాలో అట్టహాసంగా కొనసాగిన శీతాకాల ఒలింపిక్స్ వేడుకలు ఆదివారం ముగిశాయి. ఉభయ కొరియాలు దౌత్యసంయమనంతో ఈ ఉత్సవాలను విజయంతం చేశాయి. చివరి రోజు రెండు దేశాల అథ్లెట్లు వారివారి జాతీయ పతాకాలతో కవాతు చేశారు. కొందరు ఉత్తర కొరియా ఆటగాళ్లు బ్లు-వైట్ వర్ణాల చిహ్నాన్ని ధరించారు. కలర్‌ఫుల్ ముగింపు వేడుకలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ఇవాంక ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఉత్తర కొరియా జనరల్ కిమ్ యాంగ్ చోల్‌కు కొద్ది దూరంలో ఆమె ఆసీనురాలైంది. వేడుకలు జరుగుతున్న సమయంలో ద.కొరియా అధ్యక్షుడి బ్లూహౌజ్ చోల్ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఈ సందర్భంగా చోల్ మాట్లాడుతూ, అమెరికాతో చర్చలకు ఉత్తర కొరియా సంసిద్ధంగా ఉందని చెప్పారు. కాగా, వింటర్ ఒలింపిక్స్ లెజెండ్ మారిట్ జొర్గెన్ మహిళల 30 కిమీ రేసు ఫైనల్‌లో పసిడి పతకం సాధించింది. తద్వారా పతకాల పట్టికలో జర్మనీని వెనక్కి నెట్టి నార్వే ప్రథమ స్థానంలో నిలిచింది. 37 ఏళ్ల మారిట్ మొత్తంగా ఈవెంట్‌లో 15 పతకాలు సాధించింది.







అరుణకు 7వ స్థానం

మెల్‌బోర్న్: జిమ్నాస్టిక్ వరల్డ్ కప్‌లో కాంస్యపతకం గెలిచి చరిత్ర సృష్టించిన అరుణ బుడ్డారెడ్డి, ఫైనల్ రౌండ్ ఫ్లోర్ ఈవెంట్‌లో చివరి స్థానంలో నిలిచింది. శనివారం పోటీలో మూడో స్థానంలో నిలిచి, రికార్డు కెక్కిన అరుణ, ఆదివారం వెనుకంజ వేసింది. 10.833 స్కోరుతో ఏడవ స్థానంలో నిలిచింది. పురుషుల విభాగంలో ఢిల్లీ కామన్వెల్త్ గేమ్స్, 2014 ఏసియన్ గేమ్స్ కాంస్య పతక విజేత ఆశిశ్ కుమార్‌కు సైతం ఆదివారం ప్రతికూల ఫలితమే ఎదురైంది. 13.583 స్కోరుతో ఎనిమిదవ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

విరాట్ కోహ్లీ మరో ఘనత

వెన్ను నొప్పికారణంగా, దక్షిణాఫ్రికాతో చివరి టీ20 మ్యాచ్‌కు దూరమైనప్పటికీ, టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి అరుదైన క్లబ్‌లో చేరిపోయాడు. ఒక విదేశీ పర్యటలో అత్యధిక పరుగులు చేసిన రెండో కెప్టెన్‌గా నిలిచాడు. ద.ఆఫ్రికా పర్యటనలో అన్ని ఫార్మాట్లలో కలిపి 14 ఇన్నింగ్స్‌లు ఆడిన విరాట్, 871 పరుగులు చేశాడు. ఫలితంగా ఒక టూర్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో సారథిగా రికార్డుల కెక్కాడు. మొదటిస్థానంలో దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ గ్రేమ్ స్మిత్(937) ఉన్నాడు. 2003 ఇంగ్లండ్ పర్యటనలో స్మిత్ 16 ఇన్నింగ్స్‌ల్లో తొమ్మిది వందలకు పైగా పరుగులు చేశాడు.

వన్డే జట్టులోకి వస్తా: రైనా



కేప్‌టౌన్: ద.ఆఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో రాణించాను. తదుపరి ఐపీఎల్ టోర్నీలోనూ సత్తా చాటుతా. ఈ ప్రదర్శనతో తిరిగి వన్డే జట్టులో స్థానం సంపాదిస్తా అని టీమిండియా బ్యాట్స్‌మన్ సురేష్‌రైనా ధీమా వ్యక్తంచేశాడు. కీలకమైన మూడో టీ20 మ్యాచ్‌లో 27 బంతుల్లో 43 పరుగులు చేసిన రైనా, అటు బౌలింగ్‌లోనూ తనవంతు సహకారం అందించాడు. మూడు ఓవర్లు వేసిన అతను 27 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ తీశాడు. తద్వారా ఇండియా 2-1తో పొట్టికప్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. 'ఈ ప్రదర్శన నాకు కీలకం. శ్రీలంక ముక్కోణపు సిరీస్, ఐపీఎల్‌లో రాణించడమే లక్ష్యం. ప్రపంచకప్ వన్డే జట్టులో చోటు సంపాదించాలని కోరుకుంటున్నాను. 2011 వరల్డ్ కప్ విజేత జట్టులో సభ్యుడినైనందుకు గర్వంగా ఉంది. వన్డేల్లో ఐదవ స్థానంలో ఆడినప్పుడల్లా మంచి ప్రదర్శనే చేశానని రైనా గుర్తుచేసుకున్నాడు. గత రెండు సంవత్సరాలుగా నేను ఎంతో కష్టపడుతున్నాను. జాతీయ క్రికెట్ అకాడమీలో కఠోరంగా శ్రమించా. నా కెరీర్‌లో నేనెప్పుడూ ఫిట్‌గానే ఉన్నా. కచ్చితంగా భారత్ తరపున ఆడతానని ఆశించాను అని రైనా తెలిపాడు.

కోహ్లీకి ప్రత్యేక కృతజ్ఞతలు

మరోవైపు నాలోని సత్తాను ముందే గుర్తించిన కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా ప్రత్యేక కృతజ్ఞతలు. విరాట్ టీ20ల్లో మూడో స్థానంలో దిగి ఎన్నో గుర్తుండిపోయే ఇన్నింగ్‌లు ఆడాడు. కానీ ఈ సిరీస్‌లో మాత్రం నా కోసం తన స్థానాన్ని త్యాగం చేశాడు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు పంపి స్వేచ్ఛగా ఆడమని ప్రోత్సహించాడు అని ఈ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ చెప్పాడు. 31 ఏళ్ల రైనా టీమ్‌ఇండియా తరపున 223 వన్డేలు, 68 టీ20లు ఆడాడు. వన్డేల్లో 4, 5 స్థానాలు తన బ్యాటింగ్ శైలికి నప్పుతాయని రైనా చెప్పాడు.

మేరీకోమ్, సీమాకు రజతాలు

బల్గేరియా: 69వ స్ట్రాండ్జ మెమోరియల్ బాక్సింగ్ టోర్నీలో ఐదు సార్లు ప్రపంచ కప్ విజేత మేరీకోమ్ రజత పతకంతో సరిపెట్టుకుంది. 48 కేజీల మహిళల విభాగంలో బరిలోకి దిగిన కోమ్ స్వర్ణం ఆశలు నెరవేరలేదు. మరోవైపు 81 కేజీల విభాగంలో సీమా పూంజా రష్యా బాక్సర్ ఇవనోవా చేతిలో పరాజయం పాలైంది. రెండో స్థానంలో నిలిచింది. కాగా, 54 కేజీల విభాగంలో బరిలోకి దిగిన మీనాకుమారి దేవి, సరితా దేవి (60కేజీలు), సవీటి బూర (75కేజీలు) కాంస్య పతకాలు సాధించారు.

ఐసీసీ విజ్ఞప్తికి బీసీసీఐ నో..



న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్ కమిటీ విజ్ఞప్తిని బీసీసీఐ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ఏప్రిల్ 22-26 మధ్య కోల్‌కతాలో ఐసీసీ వార్షిక సమావేశం జరగనుంది. ఈ క్రమంలో ఐపీఎల్ గేమ్స్‌ను వీక్షించే అవకాశం ఐసీసీ సభ్యులకు కల్పించే విధంగా, సమావేశం రోజుల్లో కోల్‌కతాలో మ్యాచ్‌లు ఉండేలా మార్పులు చేయాలని కోరింది. కానీ ఇందుకు బీసీసీఐ అంగీకరించలేదు. కోల్‌కతా నైట్ రైడర్స్ ఏప్రిల్ 16, మే 3 తేదీల్లో మాత్రమే సొంత మైదానంలో మ్యాచ్ అడుతుంది. ఐసీసీ సమావేశం రోజుల్లో హైదరాబాద్, ముంబై, ఇండోర్, బెంగళూరు, జైపూర్ నగరాల్లో మాత్రమే మ్యాచ్‌లు జరుగుతాయి. నాలుగు రోజుల కోసం మార్పులు చేస్తే, మొత్తం షెడ్యూల్ తికమక అవుతుందని ఐసీసీకి బీసీసీఐ వివరించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

ఐతే... ఓకే

● ద్రవిడ్ సూచనలకు దిగొచ్చిన బీసీసీఐ

న్యూఢిల్లీ: భారత కుర్రాళ్లు అండర్-19 ప్రపంచ కప్ గెలిచిన వేళ బీసీసీఐ నజరానాలు ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రధాన కోచ్ ద్రావిడ్‌కు రూ. 50 లక్షలు, ఆటగాళ్ల కు రూ.30 లక్షలు, సహాయక సిబ్బందికి రూ.20 లక్షల చొప్పున పోత్సాహకంగా ఇస్తామని బోర్డు గతంలోనే స్పష్టం చేసింది. కానీ బోర్డు తీరు పట్ల ద్రావిడ్ నొచ్చుకున్నాడు. ప్రపంచకప్ విజయంలో అందరిదీ సమాన పాత్ర అని చెప్పిన ద్రావిడ్.. తనకు ఎక్కువ మొత్తంలో ప్రోత్సహకం ప్రకటించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశాడు. ద్రావిడ్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో.. బీసీసీఐ ఆలోచనలో పడింది. అందరికీ సమానంగా రూ. 25 లక్షల చొప్పున నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. తనకు వస్తోన్న రూ. 25 లక్షలను ద్రావిడ్ కాదనుకోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. అంతే కాదు.. ద్రావిడ్ చొరవ వల్ల గతేడాది మరణించిన టీమ్ ట్రైనర్ రాజేష్‌సావంత్ కుటుంబానికి ఆర్థిక సాయం అందనుంది. భారత కుర్రాళ్లు వరల్డ్ కప్ నెగ్గడంతో అతడికి కూడా బీసీసీఐ ప్రోత్సాహకం ప్రకటించింది. బీసీసీఐ సీఈవో రాహుల్ జోహ్రితో మాట్లాడిన రాహుల్.. జట్టు విజయం సాధించడానికి ఏడాదిపాటు కష్టించామని చెప్పాడు. ఇంగ్లండ్ పర్యటనలో జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన డబ్ల్యూవీ రామన్, లాజిస్టిక్స్ మేనేజర్లు మనూజ్ శర్మ, సుమీత్ మలహాపూర్కర్, ట్రైనర్ అమోఘ్ పండిట్‌లతోపాటు రాజేష్‌సావంత్ కుటుంబీలకు కూడా లబ్ధి చేకూరనుంది.

ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత కశ్యప్

వియన్నా: కామన్వెల్త్ గేమ్స్ చాంపియన్ పారుపల్లి కశ్యప్ ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. మలేషియాకు చెందిన జున్ వియ్‌చీమ్‌ను వరుస గేముల్లో మట్టికరిపించి జయకేతనం ఎగురవేశాడు. మూడేళ్ల తర్వాత తొలి అంతర్జాతీయ టైటిల్‌ను దక్కించుకున్నాడు. మాజీ జాతీయ చాంపియన్, రెండోసీడ్ ఆటగాడైన కశ్యప్ చీమ్‌ను 23-21, 21-14 స్కోరుతో ఓడించాడు. గేమ్‌ను 37 నిముషాల్లోనే ముగించాడు. వియన్నాలో టైటిల్ గెలిచినందుకు ఆనందంగా ఉంది. ఈ యేడాది ఇదే మొదటి టైటిల్ అని కశ్యప్ ట్వీట్‌చేశాడు. గతేడాది యుఎస్ ఓపెన్ గ్రాండ్ ప్రిక్స్ గోల్డ్ టైటిల్ రేసులో ఫైనల్‌కు చేరుకున్న ఈ యువ షట్లర్ తృటిలో టైటిల్ చేజార్చుకున్నాడు. ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఒక్క మ్యాచ్ ఓడకుండా టోర్నీని కొనసాగించిన కశ్యప్ ఫైనల్‌లోనూ అదే తరహా ప్రదర్శన కనబరిచి టైటిల్ గెలిచాడు.

కుర్రాళ్లకు ఛాన్స్

● శ్రీలంక ముక్కోణ సిరీస్‌కు జట్టు ఖరారు

● కోహ్లీ, ధోనీకి విశ్రాంతి... రోహిత్‌కు కెప్టెన్సీ పగ్గాలు

● హుడా, సుందర్, సిరాజ్‌లకు పిలుపు



ముంబై: వచ్చే నెల్లో శ్రీలంకలో జరుగనున్న ముక్కోణపు టీ 20 సిరీస్‌లో పాల్గొనే భారత క్రికెట్ జట్టును ప్రకటించారు. ముందుగా ఊహించినట్లు గానే భారత రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లికి విశ్రాంతి ఇచ్చారు. అదే సమయంలో ఎంఎస్ ధోని, జస్ప్రిత్ బూమ్రా, భువనేశ్వర్ కుమార్, హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్‌లకు కూడా విశ్రాంతినిచ్చారు. ఈ మేరకు 15 మందితో కూడిన భారత జట్టును బీసీసీఐ సెలక్టర్లు ఆదివారం ప్రకటించారు. ఈ పర్యటనలో రోహిత్ శర్మకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పచెప్పగా, శిఖర్ ధావన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. హైదరబాద్ పేసర్ మొహ్మద్ సిరాజ్‌కు మరోసారి అవకాశం కల్పిస్తూ సెలక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. ప్రధానంగా దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, విజయ్ శంకర్, రిషబ్ పంత్‌లకు అవకాశం దక్కింది. గతేడాది డిసెంబర్‌లో స్వదేశంలో లంకతో పోరాడిన టీ20 జట్టు ఆటగాళ్లకు తాజా కూర్పులో ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టం అవుతోంది. జాతీయ జట్టు తరపున వన్డేలు, టీ20ల్లో రాణించిన రిషబ్‌పంత్‌పైసెలక్టర్లు మరోసారి నమ్మకం ఉంచారు. ఆల్‌రౌండర్‌గా పాండ్యా స్థానంలో విజయ్ శంకర్‌ను ఎంపిక చేశారు. పంత్‌కు బ్యాట్స్‌మన్ కోటాలో చోటు దక్కినందున, దినేష్ కార్తీక్ కీపింగ్ బాధ్యతలు చేపట్టనున్నాడు. కాగా, ఈ సీజన్‌లో 2000 పరుగులు సాధించి సత్తా చాటిన మయాంక్ అగర్వాల్‌కు జట్టులో చోటు దక్కలేదు. ఇండియా ఎ జట్టుకు ఆడిన వారికే ప్రాధాన్యం ఇవ్వాలన్న నిబంధనల మేరకు అతడి ఎంపిక ప్రస్తావనకు రాలేదని బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు వివరణ ఇచ్చారు. మార్చి 6 నుంచి శ్రీలంకలో ఈ ట్రైసిరీస్ మొదలవుతుంది. 18న సిరీస్ ముగుస్తుంది. ఈ ముక్కోణపు 20 సిరీస్‌లో భారత్, శ్రీలంకలతో పాటు బంగ్లాదేశ్ కూడా పాల్గొనుంది.

భారత్ జట్టు

రోహిత్ శర్మ(కెప్టెన్), శిఖర్ ధావన్(వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, సురేష్ రైనా, మనీష్ పాండే, దినేష్ కార్తీక్, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, యజ్వేంద్ర చాహల్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, జయదేవ్ ఉనాద్కత్, సిరాజ్, రిషబ్ పంత్

ఇంగ్లండ్‌పై కివీస్ గెలుపు



టేలర్ సెంచరీ... సంత్నర్ మెరుపులు

హామిల్టన్: రాస్‌టేలర్ సెంచరీతో కదం తొక్కగా, ఆఖర్లో మిచ్ సంత్నర్ మెరుపులు మెరిపించడంతో ఉత్కంఠ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై న్యూజీలాండ్ విజయం సాధించింది. ఆదివారం హామిల్టన్‌లో జరిగిన తొలి వన్డేలో అడుగడుగునా నాటకీయ పరిణామాలు, కీలక మలుపులు చోటుచేసుకున్నాయి. ఆఖరి ఓవర్ లో సంత్నర్ సిక్సర్ బాదేసి, మరో నాలుగు బంతులు మిగిలివుండగానే, జట్టుకు విజయాన్ని ఖరారు చేశాడు. ఇతను 27 బంతుల్లోనే 45 పరుగులు రాబట్టాడు. దీంతో అప్పటి వరకు ఇంగ్లండ్ వైపు ఉన్న మ్యాచ్ న్యూజీలాండ్ వైపు మొగ్గింది. అంతకు ముందు టాస్ గెలిచిన కివీస్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేసిన పర్యాటక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 284 పరుగులు చేసింది. రూట్ (71), బట్లర్ (79) పరుగులతో రాణించారు. లక్ష్య ఛేదనలో కివీ బ్యాట్స్‌మన్ ప్రారంభంలోనే తడబడ్డారు. 10 ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయి కేవలం 27 పరుగులే చేసింది. పీకల్లోతు కష్టాల్లో ఉన్న జట్టును గట్టెక్కించేబాధ్యతను రాస్ టేలర్ చేపట్టాడు. లాథమ్‌తో కలిసి నాలుగవ వికెట్‌కు 178 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఈ క్రమంలో కెరీర్‌లో 18వ సెంచరీ నమోదు చేశాడు. 40 ఓవర్లకు కివీస్ స్కోరు 205పరుగులుగా ఉన్నది. ఈ దశలో టేలర్, లాథమ్ అవుట్ కావడంతో, మిగతా వికెట్లు టపటపా పడిపోయాయి. 10 పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు కోల్పోయింది. మ్యాచ్‌పై ఇంగ్లండ్ పట్టు బిగించింది. కానీ, చివర్లో సంత్నర్ చెలరేగి ఆడటంతో ఇంగ్లండ్ ఆశలు గల్లంతయ్యాయి.

బ్లేజర్లు వద్దు.. చీరలే ముద్దు

న్యూఢిల్లీ: ఈ యేడాది కామన్వెల్త్ ప్రారంభ వేడుకల్లో చీర కట్టుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. మహిళా అథ్లెట్ల సంప్రదాయ దుస్తుల స్థానంలో చీరకు చోటు కల్పిస్తూ ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది. బ్లేజర్లు, ట్రౌజర్ల మాదిరిగా చీరకట్టు కూడా సౌకర్యవంతమేనని అభిప్రాయపడింది. ఈనెల 20న తీసుకున్న ఈ నిర్ణయంపై ఐవోఏ పాలక మండలి అభిప్రాయ సేకరణ చేపట్టింది. పీవీ సింధు, సాక్షి మాలిక్, జ్వాల గుత్తా ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ప్రస్తుత డ్రెస్‌కోడ్ సంప్రదాయంలో మార్పులు వద్దని చెప్పారు. అయితే, 2014 కామన్వెల్త్ రైఫిల్ పసిడి విజేత అపూర్వ చండేలా వంటి అథ్లెట్లు మాత్రం తాజా నిర్ణయాన్ని స్వాగతించారు. 'ఐవోఏ నిర్ణయాన్ని అంగీకరిస్తున్నాను. చీరలంటే నాకిష్టం. బ్లేజర్లు, ట్రౌజర్లు కూడా బాగానే ఉంటాయి. రానున్న కామన్వెల్త్ గేమ్స్ ప్రారంభ వేడుకల్లో కొత్త సంప్రదాయం కనువిందు చేస్తుందని భావిస్తున్నా' అని చండేలా వ్యాఖ్యానించింది. కాగా, 2016 రియో ఒలింపియన్ అథ్లెట్ కుష్బిర్ కౌర్ ఇందుకు మద్దతు తెలిపింది. లింగ సమానత్వానికి దోహదపడే నిర్ణయమని చెప్పింది.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.